
02-04-2024
మంగళవారం
హైదరాబాద్
సంపుటి 26, సంచిక: 285
పేజీలు: 8 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్: 8
వెల రూ. 5.00
Published from:
Hyderabad, Khammam,
Karimnagar, Mahabubnagar

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★




## జార్ఖండ్‌లో 4 స్థానాలకు సిపిఐ అభ్యర్థుల ప్రకటన


రాంచి: జార్ఖండ్‌లో నాలుగు లోక్‌సభ స్థానాలకు సిపిఐ అభ్యర్థులను ప్రకటించింది. పలాము లోక్‌సభ స్థానం నుంచి అభయ్ భూయన్, లోహార్దగ నుంచి మహేంద్ర ఓరాన్, చాత్ర నుంచి అర్జున్ కుమార్, దుమ్కా పార్లమెంట్ స్థానం నుంచి రాజేష్ కుమార్ కిష్కులు పోటీ చేయనున్నట్లు సిపిఐ జార్ఖండ్ రాష్ట్ర కార్యదర్శి మహేంద్ర పాఠక్ తెలిపారు. ఆదివారం జరిగిన సమావేశంలో అభ్యర్థుల ఎంపికై నిర్ణయం తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో 14 లోక్‌సభ స్థానాలకు తరువాయి 2లో



## ఈనెల 15 వరకూ జ్యుడిషియల్ కస్టడీ

### కేజ్రీవాల్‌ను తీహార్ జైలుకు తరలించిన అధికారులు

**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈనెల 15వ తేదీ వరకూ జ్యుడిషియల్ కస్టడీ విధిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత అధికారులు ఆయనను తీహార్ జైలుకు తరలించారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం, మనీలాండరింగ్ ఆరోపణలపై కేజ్రీవాల్‌ను మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన ఇడి కస్టడీలోనే ఉన్నారు. తొలుత కోర్టు కేజ్రీవాల్‌ను మార్చి 28వ తేదీ వరకూ కస్టడీకి తరువాయి 2లో



## ప్రభాకర్‌రావు ఆదేశాలతోనే రూ.70 లక్షలు సీజ్

### రిమాండ్ రిపోర్ట్‌లో రాధాకిషన్‌రావు
### బిఆర్‌ఎస్‌లో అసంతృప్త నేతలపైనా నిఘా

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్‌ను మూడోసారి అధికారంలోనికి తీసుకొచ్చేందుకు ఎస్‌ఐబి తీవ్రంగా ప్రయత్నించింది. బిఆర్‌ఎస్‌ను బలోపేతం చేసేందుకు అనేక ప్రయత్నాలు చేశారని, ఇందుకు ప్రతిపక్ష పార్టీలు, కొందరు ముఖ్యమైన నాయకుల కదలికలపై నిఘా పెట్టారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ అయిన టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్‌డి తరువాయి 2లో



## కెసిఆర్ తప్పుల వల్లే...
# రైతులకు తిప్పలు



### పంట నష్టానికి కెసిఆర్ రూ.25 వేలు డిమాండ్ చేయడం హాస్యాస్పదం
### బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంత నష్టపరిహారం చెల్లించారో చెప్పాలి
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్
### 'తైబందీ' విధానాన్నే కెసిఆర్ పట్టించుకోలేదని విమర్శ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు, కృష్ణా బేసిన్ ఎండిపోవడానికి, పంటల నిర్వహణను పట్టించుకోకపోవడం వంటి అన్ని పాపాలకు కెసిఆరే కారణమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. గతంలో కెసిఆర్ చేసిన తప్పుల వల్లనే తెలంగాణ ప్రజలు, రైతులు ఇబ్బందిపడుతున్నారని విమర్శించారు. పంట నష్టానికి రూ.25 వేలు డిమాండ్ చేస్తున్న కెసిఆర్, ఆయన ప్రభుత్వ హయాంలో ఎంత నష్ట పరిహారం చెల్లించారో చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని మగ్దూంభవన్‌లో సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, బాలనర్సింహ్మతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. కరువు, వరదల, నష్టం ప్రకృతిపైన ఆధారపడి ఉన్నదని, కాంగ్రెస్ ప్రభుత్వ కరువు అని కెసిఆర్ చెబుతున్నారన్నారు. రూ.300 కోట్లు రైతులకు ఇచ్చామని హరీశ్‌రావు చెబుతున్నారని, కానీ 10 శాతం కూడా ఇవ్వలేదని విమర్శించారు. 2014 నుండి ఆ మూల, ఈ మూల తప్పితే నష్టపరిహారమే ఇవ్వలేదన్నారు. 'తైబందీ' విధానాన్నే కెసిఆర్ పట్టించుకోలేదని మండిపడ్డారు. రైతాంగాన్ని, తెలంగాణను మోసం చేసిన చరిత్ర కెసిఆర్‌ది అని విమర్శించారు. కెసిఆర్ పాలనలో 2014 నుండి 2018 వరకు పూర్తి స్థాయి కరువు ఉన్నదని, ఈ తరువాయి 2లో

### పోటీపై నిర్ణయం జాతీయ నాయకత్వానిదే..

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోటీపై నిర్ణయం తీసుకునే అంశాన్ని సిపిఐ జాతీయ నాయకత్వానికి అప్పగించామని కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఇటీవల జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. కాళేశ్వరం, కృష్ణా బేసిన్ పంటలు దెబ్బతినేందుకు పాపం కెసిఆర్ దేనని మండిపడ్డారు. పంట ల బీమా పథకం నుండి గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం బయటకికివస్తే, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకంలో చేరిందన్నారు.

## కెసిఆర్ మాటలన్నీ
# అబద్ధాలే...

### మైక్ సమస్య వస్తే కరెంట్ కోతలా?
### విద్యుత్ సరఫరా లేకుంటే రికార్డు స్థాయిలో వినియోగం ఎలా పెరిగింది?
### నీళ్ల గురించి, కాళేశ్వరం గురించి కెసిఆర్ వాస్తవాలు చెప్పలేదు
### ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

ప్రజాపక్షం / హైదరాబాద్



సూర్యాపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెసిఆర్ మాట్లాడిన మాటలలో కొంచం కూడా వాస్తవాలు లేవని, బిఆర్‌ఎస్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మైక్ సమస్య వస్తే కరెంటు కోతలని కెసిఆర్ అబద్ధాలు మాట్లాడారని, పదేళ్లు సిఎంగా ఉన్న వ్యక్తి ఇంతలా దిగజారి మాట్లాడుతారా తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఢిల్లీ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్ల గురించి, కాళేశ్వరం గురించి కెసిఆర్ వాస్తవాలు చెప్పలేదని, వాస్తవాలను దాచి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని, కట్టు కథలు చెప్పి ప్రజలను మభ్య పెట్టాలని ప్రయత్నించారని విమర్శించారు. బిఆర్‌ఎస్ నేతలు కెసిఆర్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరుతుంటే ఆయన తట్టుకోలేకపోతున్నారన్నారు. రాష్ట్రం లో విద్యుత్ సరఫరా లేకుంటే రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం ఎలా పెరిగిందని, గతంలో ఎన్నడు లేనంతగా ఎందుకు నమోదయిందైవని ఆయన ప్రశ్నించారు. 'యాదాద్రి పవర్ ప్రాజెక్ట్ ఎప్పుడు ప్రారంభించారు. ఎవరి వల్ల ఆలస్యమైంది. యాదాద్రి ప్రాజెక్ట్ నిర్మించిన స్థలమే సరైంది కాదు. బొగ్గు లభించే ప్రాంతానికి 350 కిలోమీటర్ల దూరంలో యాదాద్రి పవర్ ప్లాంట్ గత ప్రభుత్వ నిర్మాణం చేపట్టింది. యాదాద్రి థర్మల్ ప్లాంటుకు బొగ్గు సరఫరా కోసం భారీగా ఖర్చు అవుతుంది. యాదాద్రి పవర్ ప్లాంట్ పర్యావరణ అనుమతులు పొందటంలో ఆలస్యం వల్ల నిర్మాణ వ్యయం భారీగా పెరిగింది. తెలంగాణకు 4వేల మెగావాట్ల విద్యుత్ ఇవ్వాలని ఎపి పునర్ వ్యవస్థీకరణ చట్టంలోనే ఉంది. విభజన చట్టం ప్రకారమే రాష్ట్రానికి ఎన్‌టిపిసి మంజూరైంది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మించాల్సి ఉండగా కమిషన్ల కోసం సబ్ క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్ నిర్మాణం చేపట్టింది కెసిఆరే' అని భట్టివిక్రమార్క తరువాయి 2లో

## బలవంతపు చర్యలు
# తీసుకోబోం

### సుప్రీంకోర్టుకు ఐటి విభాగం వెల్లడి
### లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్‌కు డిమాండ్ నోటీసుల నుంచి భారీ ఊరట




**న్యూఢిల్లీ:** ఆదాయపన్ను విభాగం వరుసగా జారీ చేసిన డిమాండ్ నోటీసుల వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీకి ఉపశమనం లభించింది. తాము జారీ చేసిన పన్ను చెల్లింపు నోటీసులకు సంబంధించి లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బలవంతపు చర్యలు తీసుకోబోమని సుప్రీంకోర్టుకు ఐటి విభాగం తెలియజేసింది. సుమారు రూ.3,500 కోట్ల పన్నులు చెల్లించాలని జారీ చేసిన డిమాండ్ నోటీసులపై కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం నాడు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణకు చేపట్టింది. ఈ సందర్భంగా కేసులో తుది తీర్పు వచ్చేంత వరకు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోబోమని ఆదాయ పన్ను విభాగం తరుపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలియజేశారు. ఈ విషయాన్ని సుప్రీం కోర్టు ధర్మాసనం రికార్డు చేసుకుంది. 'కోర్టు ఎదుట దాఖలైన పటిషన్‌పై ప్రతివాది ఐటి విభాగం తరుపున హాజరైన సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపిస్తూ , గత మార్చి నెల అనేక తేదీలలో సుమారు 3,500 కోట్లు చెల్లించాలని జారీ చేసిన డిమాండ్ నోటీసుల విషయంలో ఎలాంటి వివాదం లేదని పేర్కొన్నట్లు' ధర్మాసనం తెలిపింది. నోటీసులకు సంబంధించి చేసుకున్న అప్పీల్‌లో అనేక అంశాలపై తీర్పులు ఇవ్వాల్సి ఉన్నదని, ప్రస్తుత సమయంలో పరిస్థితిని మరింత ముదరకుండా ఉండేందుకు రూ.3,500 కోట్ల పన్ను చెల్లింపునకు సంబంధించి ఐటి విభాగం ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోమని సొలిసిటర్ జనరల్ తెలిపారు. అనంతరం కాంగ్రెస్ దాఖలు తరువాయి 2లో



## ఎండలు...
# మరింత తీవ్రం


### ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో అధిక ఉష్ణోగ్రతలు
### భారత వాతావరణ విభాగం (ఐఎండి) వెల్లడి

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది ఎండలు దంచికొడుతున్నాయి. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో దేశ వ్యాప్తంగా ఎండలు మరింత తీవ్రమవుతాయని, అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలిపింది. మధ్య, పశ్చిమ ద్వీపకల్ప ప్రాంతాల్లో పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని పేర్కొంది. ఐఎండి ప్రకటనను అనుసరించి, ఏప్రిల్, మే మాసాల్లో ఎండలు అధికంగా ఉంటాయి. ఈనెల 19 నుంచి సార్వత్రిక ఎన్నికలు ఏడు దశల్లో జరగనున్న నేపథ్యంలో, రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు ఎండల కష్టం తప్పకపోవచ్చు. దేశంలోని చాలా ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. అధిక ఉష్ణోగ్రతల మధ్య, పశ్చిమ భారతాల్లో నమోదుకానుండగా, పశ్చిమ హిమాలయ ప్రాంతం, ఈశాన్య రాష్ట్రాలు. ఉత్తర ఒడిశాలోని కొన్ని ప్రాంతాలలో సాధారణం నుండి సాధారణం కంటే తక్కువ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో మైదానాల్లోని చాలా ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ వేడిగాలులు వచ్చే అవకాశం ఉంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో 10 నుంచి 20 రోజులపాటు తరువాయి 2లో

### మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎంఎల్‌సి ఉపఎన్నికల కౌంటింగ్ వాయిదా 03

## తాగునీటి అవసరాలకు
# సాగర్ ఎడమ కాలువ ద్వారా నీరు విడుదల

ప్రజాపక్షం/నందికొండ



మిషన్ భగీరథ తాగునీటి అవసరాల నిమిత్తం ఉన్నతాధికారుల సూచనల మేరకు సోమవారం సాయంత్రం నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా 2500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు ఎడమ కాలువ లాల్ బహదూర్ కెనాల్ నుండి తెలంగాణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు డ్యామ్ అధికారులు నీటిని విడుదల చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి నిలువ సామర్థం తక్కువగా ఉన్నందున ప్రస్తుతం తాగునీటి అవసరాల కోసమే వాడుకోవాలని, ఒక్క నీటి చుక్కను కూడా వృథా చేయకూడదని అధికారులు తెలిపారు. అయితే ఈ నీటిని ఎన్ని టిఎంసిల వరకు విడుదల చేస్తారనేది తెలియాల్సి ఉంది.

**సాగర్ రిజర్వాయర్ సమాచారం... :** నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి గరిష్ట నీటిమట్టం 590 తరువాయి 2లో

## జ్ఞానవాపీ మసీదులో హిందూ ప్రార్థనల
# ఉత్తర్వు తాత్కాలికమే

### స్టేకు సుప్రీంకోర్టు తిరస్కృతి



**న్యూఢిల్లీ :** జ్ఞానవాపీ మసీదు (కాశీ)లో హిందువుల ప్రార్థనలు నిలిపివేసేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ ఉత్తర్వులు తాత్కాలికంగా మాత్ర మే అమలులో ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జ్ఞానవాపీ దక్షిణ సెల్లార్ భాగంలో హిందువులు ప్రార్థనలు చేయడాన్ని నిలిపివేయాలని కోరుతూ జ్ఞానవాపీ మసీదు కమిటీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యాన గల ధర్మాసనం సోమవారం ఈ కేసు విచారణ సందర్భంగా స్టే మంజూరు చేసేందుకు తిరస్కరించింది. సెల్లార్ భాగంలో ఉన్న ప్రాంతంలో ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో పక్కపక్కనే విడివిడిగా హిందూ, ముస్లింల ప్రార్థనలు కొనసాగే విధానం యథాతథంగా ఉంటుందని పేర్కొంది. మసీదు సెల్లార్‌లో ప్రార్థనలు చేసుకునేందుకు హిందువులకు అనుమతి ఇస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును జ్ఞానవాపీ మసీదు కమిటీ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఈ విషయంపై పూజారి శైలేంద్ర కుమార్ పాథక్ వ్యాస్ అభిప్రాయం ఏమిటిలో ఈనెల 30వ తేదీలోపు తెలిజేయాలని కూడా సుప్రీంకోర్టు ధర్మాసం ఆదేశించింది. హిందువులు జ్ఞానవాపీ తరువాయి 8లో

# కరువుపై రాజకీయ పోట్లాట

### కాంగ్రెస్, బిఆర్‌ఎస్ మధ్య విమర్శ, ప్రతి విమర్శలు
### కొరవడిన కార్యాచరణ

ప్రజాపక్షం/ ఖమ్మం



తెలంగాణ రాష్ట్రంలో కరువు కోరలు చాచింది. ప్రాజెక్టులలో నీరు ఇంకిపోయింది. చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులు ఎండిపోయి నెర్రెలు వారాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఎండిపోయాయి. అన్నింటికి మించి ఇప్పుడు భయంకరమైన తాగునీటి ఎద్దడి ముంచుకు రానున్నది. పార్లమెంటు ఎన్నికల వేళ కాంగ్రెస్, బిఆర్‌ఎస్ కరువుపై రాజకీయ పోట్లాటకు దిగాయి. మీరే కరువుకు కారణం అంటే... కాదు మీరే అంటూ విమర్శల పర్వంతో కరువును రాజకీయ అంశంగా మార్చివేశాయి. కాంగ్రెస్ చేతకానితనం వల్లే కరువు వచ్చిందని, పంటలు ఎండిపోతున్నాయని బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌తో పాటు ఆ పార్టీ నాయకులు కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. కృష్ణానది నుంచి సాగర్ ద్వారా నీటిని అందించి పంటలను కాపాడాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పని చేయలేదని ఆంధ్రాకు నీరు తరలిపోతున్నా పట్టించుకోలేదని బిఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. కాళేశ్వరాన్ని ఆపేశారు, పంటలను ఎండబెట్టారు. కాంగ్రెస్‌కు రైతుల ఊసురు తగులుందని హరీష్‌రావు వంటి నేతలు మరో అడుగు తరువాయి 2లో



# మాటలు జారొద్దు

### సుప్రియ, దిలీప్ ఘోష్‌లకు ఇసిఐ హెచ్చరిక

**న్యూఢిల్లీ:** ఎన్నికల సమయంలో మాటలు జారొద్దని కాంగ్రెస్ నాయకురాలు సుప్రియ శ్రీనాతే, బిజెపి నేత దిలీప్ ఘోష్‌లను భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) హెచ్చరించింది. మహిళలపై వీరిద్దరూ అభ్యంతరకమైన వ్యాఖ్యలు తరువాయి 2లో

## కమలానికి ఓటెయ్యండి... కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

**హర్యానా :** కాంగ్రెస్‌పాత కాపులను గెలిపించేందుకు కమలానికి ఓటెయ్యండి అనే జోక్ ఇప్పుడు హర్యానా రాష్ట్రంలో వైరల్‌గా మారింది. ఎందుకంటే అక్కడ బిజెపి తరుపున పది స్థానాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులలో ఆరడజన్ మందిమాజీ కాంగ్రెస్ నేతలే కావడం విశేషం. వాస్తవానికి మరో ఇద్దరు మాజీ కాంగ్రెస్ నేతలను కూడా బరిలో దింపేందుకు బిజెపి ప్రయత్నించింది. అయితే కాంగ్రెస్ నుండి బిజెపిలోకి చేరిన సోనిపట్ ఎంపి రమేశ్ కౌశిక్‌పై లైంగిక ఆరోపణలు రావడంతో చివరి నిమిషంలో ఆయనకు టిక్కెట్ ఇవ్వలేదు. మరో మాజీ కాంగ్రెస్ నేత చివరి నిమిషంలో బిజెపి నుండి తిరిగి కాంగ్రెస్‌లో చేరిపోయారు. బిజెపి తరుపున పోటీ చేస్తున్న ఆరుగురు మాజీ కాంగ్రెస్ నేతలలో మాజీ పిసిసి అధ్యక్షుడు అశోక్ తన్వర్ (సిర్సా), కేంద్ర మాజీ మంత్రి రావ్ ఇందర్‌జిత్ సింగ్ (గుర్‌గ్రామ్), అరవింద్ శర్మ (రోహ్‌తక్), నవీన్ జిందాల్ (కురుక్షేత్ర), ధరమ్‌బీర్ సింగ్ (భవానీ–మహేంద్రగఢ్), రంజిత్ సింగ్ (హిస్సార్)లు ఉన్నారు.

## అభ్యర్థుల ప్రకటన (మొదటి పేజీ తరువాయి)

గానూ 8 స్థానాల్లో సిపిఐ చేస్తుందన్నారు. త్వరలోనే మరో నాలుగు స్థానాలైన హజారీబాగ్, కొడెర్మ, రాంచి, గొడ్డా లేదా జెమ్‌షెడ్‌పూర్‌లో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. తమ కేంద్ర కార్యవర్గం అభ్యర్థులను ఖరారు చేస్తుందని, ఇప్పటికే తమ సిఫార్సులను పంపామన్నారు. జార్ఖండ్‌లో ఇండియా కూటమి నుంచి కాకుండా తాము సొంతంగానే ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని పాఠక్ స్పష్టం చేశారు. బిజెపికి వ్యతిరేకంగా అన్ని పార్టీలను ఏకతాటిపైకి తీసుకురావడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. అందువల్ల తాము సొంతంగానే ఎన్నికల్లో పోటీచేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కాగా, అంతకు ముందే సిపిఐ(ఎం) రాజ్‌మహల్ లోక్‌సభ నుంచి తమ అభ్యర్థిని ప్రకటించింది. రాజ్‌మహల్, చాత్ర నుంచి పోటీచేయాలని సిపిఐ(ఎం) నిర్ణయం తీసుకోగా, మిగతా 12 స్థానాల్లో ఇండియా కూటమికి మద్దతు తెలపనుంది.

## రూ.70 లక్షలు సీజ్ (మొదటి పేజీ తరువాయి)

రాధాకిషన్‌రావు రిమాండ్ రిపోర్ట్‌లో పలు అంశాలను పొందుపర్చారు. పోలీసు విచారణలో రాధాకిషన్‌రావు అనేక కీలక విషయాలు వెల్లడించారని, ఎన్నికల సమయంలో ఎస్ఐబి, అందులో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక విభాగం పనితీరును కూడా దర్యాప్తు బృందం రాధాకిషన్‌రావు రిమాండ్ రిపోర్ట్‌లో చేర్చింది. ఈ కేసులో ఆయనను ఎ4 నిందితునిగా చేర్చింది. ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే 2018లో భవ్య సిమెంట్ యజమాని, ఆనంద్ ప్రసాద్ (టిడిపి శేరిలింగంపల్లి అభ్యర్థి) నుంచి రూ. 70 లక్షలు సీజ్ చేశామని రాధాకిషన్‌రావు వెల్లడించారు. అలాగే దుబ్బాక ఉప ఎన్నికల సందర్భంగా రఘునందన్ రావు, బంధువుల నుంచి రూ. కోటి సీజ్ చేయగా, మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా కోమటిరెడ్డి వెంకటరెడ్డికి చెందిన రూ. 3.50 కోట్లు సీజ్ చేశామని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ప్రభాకర్ రావు 2016లో ఒక సామాజిక వర్గానికి చెందిన అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో నల్లగొండ నుంచి ప్రణీత్ రావు, రాచకొండ భుజంగరావు, హైదరాబాద్ సిటీ తిరుపతిని నియమించుకున్నట్లుగా రిమాండ్ రిపోర్టులో పోలీసులు తెలిపారు. కాగా 2023 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి బిఆర్ఎస్‌ను అధికారంలో తీసుకొచ్చేందుకు ఎస్ఐబి పనిచేసిందని, ప్రతిపక్ష నేతలతో సహా బిఆర్ఎస్‌లో అసంతృప్తిగా ఉన్న నేతలు, కొందరు వ్యాపార వేత్తలపై ప్రత్యేక నిఘా పెట్టగా, కొందరి ఫోన్లను ట్యాపింగ్ చేసినట్టు రాధాకిషన్‌రావు అంగీకరించారు.

## మరింత తీవ్రం (మొదటి పేజీ తరువాయి)

వడగాల్పులు వీస్తాయి. ఈ పరిస్థితి సాధారణం కంటే నాలుగు నుంచి ఎనిమిది రోజులు ఉంటుంది. గుజరాత్, మధ్య మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తర ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వేడిగాలుల ప్రభావం ఎక్కువగా ఉండవచ్చు.

ఇదిలావుంటే, అధిక ఉష్ణోగ్రతల వల్ల గోధుమ పంటకు ఎలాంటి ప్రమాదం లేదని ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మొహాపాత్ర తెలిపారు. మధ్యప్రదేశ్ మినహా, గోధుమ ఎక్కువగా పండించే రాష్ట్రాలు, ప్రాంతాల్లో ఎండల తీవ్రత కారణంగా పంటలు దెబ్బతినే పరిస్థితులు తలెత్తవని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో ప్రస్తుతం 37 నుంచి 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు అవుతున్నది. ఇది 42 డిగ్రీలకు చేరే అవకాశం ఉందని వివరించారు. కాగా, మన దేశం 202223 ఆర్థిక సంవత్సరంలో 1.105.5 మిలియన్ టన్నుల గోధుమను ఉత్పత్తి చేసింది. ఇందులో 30.40 శాతం వాటా ఉత్తరప్రదేశ్‌ది. మధ్యప్రదేశ్ 20.56 శాతం, పంజాబ్ 15.18 శాతం, హర్యానా 9.89 శాతం, రాజస్థాన్ 3.62 శాతం చొప్పున వాటాను కలిగి ఉన్నాయి.

## మాటలు జారొద్దు (మొదటి పేజీ తరువాయి)

చేశారని పేర్కొంటూ, ఇకపై వారి ప్రచారం, ఉపన్యాసం, ప్రకటనలపై అధికారులు దృష్టి పెడతారని, సెన్సార్‌షిప్ వారికి అమలవుతుందని వివరించింది. దేశంలో మహిళలకు ఎంతో ఆదరణ ఉందని, వారిని గౌరవిస్తామని తెలిపింది. కానీ, వారిని కించపరిచేలా వీరిద్దరూ వ్యాఖ్యలు చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇకపైఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా పార్టీల అధిష్టానాలకు కూడా సూచించింది. సమస్యలను సృష్టించే ప్రమాదం ఉన్న వ్యాఖ్యలు చేయకుండా సంయమనం పాటించాలని తమతమ నాయకులు, కార్యకర్తలకు స్పష్టం చేయాలని పార్టీలను ఇసిఐ కోరింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సినీ నటి కంగనా రనౌత్‌పై సుప్రియ వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. ఆమె ప్రతిష్టను దెబ్బతీసే విధంగా మాట్లాడింది. కాగా, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కుటుంబం గురించి దిలీప్ ఘోష్ అభ్యంతరకమైన విమర్శలు చేశారు. సుప్రియపై ఇసిఐకి బిజెపి, పోల్ ప్యానెల్‌కు టిఎంసి ఫిర్యాదు చేశాయి. ఈ ఫిర్యాదులపై స్పందించి ఇసిఐ, సుప్రియా, దిలీప్ ఘోష్‌లకు హెచ్చరిక నోటీసులు పంపింది.

## మాటలన్నీ అబద్ధాలే (మొదటి పేజీ తరువాయి)

అన్నారు. వచ్చే ఏప్రిల్, మే నెలల్లోనూ సరిపడా విద్యుత్ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించామని, దేశమంతా గ్రిడ్ అనుసంధానం 2013 లోనే యుపిఎ ప్రభుత్వం చేసిందని ఆయన చెప్పారు.

### ఎన్ని హామీలు నెరవేర్చారో చెప్పాలి

పదేండ్ల పాలనలో కెసిఆర్ ఎన్ని హామీలు నెరవేర్చారో చెప్పాలని భట్టివిక్రమార్క డిమాండ్ చేశారు. అందరికీ రెండు పడకల గదులు ఇల్లు నిర్మించి ఇచ్చారా? ప్రతి మండలంలో బాలబాలికలకు ఇంగ్లీష్ మీడియం స్కూల్, ప్రతి నియోజకవర్గంలో కేజీ టు పీజీ విద్యాలయాలు నిర్మించారా? దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేశారా? రైతులకు రుణమాఫీ ఐదేళ్లలో పూర్తి చేశారా? వర్షాకాలంలో అధికారంలో ఉన్నది ఎవరు? వాన నీటిని రిజర్వాయర్లు నింపే పరిస్థితి లేకుండా చేసింది ఎవరు? అని ఆయన ప్రశ్నించారు. ప్రపంచంలోనే అత్యద్భుతం అని చెప్పిన కాళేశ్వరం కృంగిపోయిందని, అన్ని లెక్కలతో చర్చలకు రావడానికి తాను సిద్ధమని, మీరు సిద్ధమా? అని బిఆర్ఎస్ నేతలకు భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. గత బిఆర్ఎస్ పాలకులు అస్తవ్యస్తంగా చేసిన పాలనను కాంగ్రెస్ ప్రభుత్వం గాడిన పెడుతుటే తట్టుకోలేక అక్కసుతో కెసిఆర్ కాంగ్రెస్‌పై అబద్ధపు, మోసపూరిత ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నీరు విడుదల (మొదటి పేజీ తరువాయి)

అడుగులు కాగా.. ఇది 312.50 టిఎంసిలకు సమానం. ప్రస్తుత నీటి మట్టం సోమవారం సాయంత్రం నాటికి 513.40 అడుగులు, 137.5158 టిఎంసిలుగా ఉంది. అయితే ప్రస్తుతానికి రిజర్వాయర్ నుంచి ఎడమ కాలువ ద్వారా 2500 క్యూసెక్కుల నీరు ఔట్ ఫ్లో గా విడుదల అవుతూ ఉండగా రిజర్వాయర్‌కు ఎటువంటి ఇన్ ఫ్లో రావటం లేదు. అదేవిధంగా ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి ఎటువంటి విద్యుత్తు ఉత్పత్తి జరగడం లేదు.

# అధిక ఉష్ణోగ్రతలపై ముందస్తు జాగ్రత్తలు

### జిల్లా కలెక్టర్లకు సిఎస్ శాంతికుమారి ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రస్తుత ఏప్రిల్, మే మాసాల్లో అధిక ఉష్ణోగ్రతతో కూడిన ఎండలు ఉన్నందున వడదెబ్బ, డీహైడ్రేషన్ తదితర వ్యాధుల భారిన పడకుండా ప్రజలను చైతన్యవంతులను చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఉదయం 11 గంటలనుండి సాయంత్రం 4 గంటల మధ్య పిల్లలు, వృద్ధులు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలనిసూచించారు. రాష్ట్రంలో తాగు నీటి సరఫరా, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ధాన్యం కొనుగోలు అంశాలపై జిల్లా కలెక్టర్లతో సోమవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు బుర్రా వెంకటేశం, దాన కిషోర్, క్రిష్టినా చోంగ్తు, సందీప్ సుల్తానియా, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్, సిడిఎంఎ దివ్య, విద్యా శాఖ కమిషనర్ దేవసేన, కుటుంబ ఆరోగ్య శాఖ కమిషనర్ కర్ణన్, జల మండలి ఎండి సుదర్శన్ రెడ్డి, సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ, ఈ రెండు మాసాల్లో రాష్ట్రంలో ప్రధానంగా ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో 45 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరుకుని, తీవ్రమైన వడగాలులు వీచే అవకాశముందని తెలిపారు. ఈ సందర్భంగా వేసవిలో చేపట్టాల్సిన ముందు జాగ్రత్తలపై ప్రజలఉ పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే అన్ని జిల్లాలకు ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, ఐ.వీ ఫ్లూయిడ్లు, ఇతర మందులను పెద్ద మొత్తంలో పంపిణీ చేశామని, వాటన్నింటినీ సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో అందుబాటులో ఉంచామని శాంతి కుమారి వెల్లడించారు. అలాగే ఓఆర్ఎస్ పాకెట్లను కూడా ప్రతీ ఆశా కార్యకర్తల వద్ద అందుబాటులో ఉన్నాయని, ఉపాధి హామీ పనుల కేంద్రాలవద్ద కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు.

### మంచినీటి సరఫరా పర్యవేక్షణకు స్పెషల్ అధికారులు

రాష్ట్రంలో మంచినీటి సరఫరాను మరింత సమర్థవంతంగా చేసేందుకు ప్రతీ మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్టు శాంతికుమారి తెలిపారు. ప్రతీ రోజు మంచినీటి సరఫరా ను పర్యవేక్షించడానికి ప్రతీ మండలానికి జిల్లా స్థాయి అధికారిని, ప్రతీ వార్డు, గ్రామానికి మండల స్థాయి అధికారిని నియమిస్తున్నట్టు చెప్పారు. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో మొత్తం జిల్లాలో మంచినీటి సరఫరాను పర్యవేక్షిస్తారన్నారు. ఏగ్రామంలో నైనా మంచినీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే, ఆయా గ్రామాల్లోని వ్యవసాయ బావుల నుండి అద్దె ప్రాతిపదికపై నీటిని సరఫరా చేయాలని సూచించారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని అందించాలన్నారు. ఇప్పటికే, అన్ని గ్రామాలు, వార్డులలోని బోరుబావుల మరమ్మతులు, ఫ్లషింగ్ లను పూర్తి చేయడంతోపాటు పైప్ లైన్ల లీకేజీలను అరికట్టడం జరిగిందని తెలియచేశారు.

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుండి పాలేరు జలాశయానికి తాగునీటి అవసరాలకు సోమవారం ఉదయం కృష్ణా జలాలను విడుదల చేశామన్నారు. ఈ జలాలు పాలేరు ప్రాజెక్టుకు చేరుకునేలా నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల కలెక్టర్లు తగు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు.



### ధాన్యం కొనుగోలుకు 7149 కేంద్రాల ఏర్పాటు

రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోలుకు 7149 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, మరో నాలుగైదు రోజుల్లో ఈ కేంద్రాలన్నీ ప్రారంభమవుతాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ఇప్పటికే, ప్రారంభమైన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. గ్రామాల్లో ప్రైవేటు కాంటాలను తెరిచి ఎం.ఎస్.పీ కన్నా తక్కువ ధరకు కొనుగోళ్లు చేసే వారిని గుర్తించి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో మనవూరు మనబడి కార్యక్రమం కింద అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనులన్నింటినీ సంబంధిత ఏజెన్సీల ద్వారా వెంటనే ప్రారంభించి, వాటి పురోగతిని పర్యవేక్షించాలని కలెక్టర్లను సిఎస్ శాంతికుమారి ఆదేశించారు

## జ్యుడిషియల్ కస్టడీ (మొదటి పేజీ తరువాయి)

అంగీకరించింది. ఆ తర్వాత ఇడి అధికారుల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకొని ఆయన కస్టడీని ఏప్రిల్ ఒకటో తేదీ వరకూ పెంచింది. కస్టడీ ఈనెల ఒకటో తేదీ, సోమవారంతో ముగియడంతో అధికారులు ఆయనను కోర్టులో హాజరుపరిచారు. కాగా, విచారణకు కేజ్రీవాల్ సహకరించడం లేదని ఆరోపించిన ఇడి అధికారులు మరికొంతకాలం కస్టడీకి ఇవ్వాలని కోరారు. కేసు పూర్వాపరాలు, వాదనలు విన్న తర్వాత, కేజ్రీవాల్‌ను జ్యుడిషియల్ కస్టడీకి ఇస్తున్నట్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా ఆదేశాలు జారీ చేశారు. ఆ సమయంలో ఢిల్లీ మంత్రులు అతిషి, సౌరభ్ భరద్వాజ్, కేజ్రీవాల్ భార్య సునీత తదితరులు కోర్టు హాల్‌లోనే ఉన్నారు. న్యాయమూర్తి ముందు హాజరయ్యేందుకు వచ్చిన కేజ్రీవాల్, కోర్టు ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ తప్పు చేస్తున్నారని, ఆయన చర్యలు దేశానికి నష్టం చేసేవిలా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఇలావుండగా, విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పిటిఐ వార్తాకథనం ప్రకారం తీహార్ జైల్‌లోకేజ్రీవాల్‌కు జైలు నెంబర్ 2 ను కేటాయిస్తారు. ఆయనకు టీవీ చూసే సౌకర్యాన్ని కల్పిస్తారు. ఆయన మొత్తం 18 నుండి 20 చానల్స్‌ను చూసే అవకాశం కల్పించారు. కేజ్రీవాల్ డయాబెటిక్ పేషెంట్ కావడంతో, ఆయనకు క్రమం తప్పకుండా వైద్య సేవలు అందించడానికి 24 గంటలు మెడికల్ స్టాఫ్ అందుబాటులో ఉంటారు. వారంలో రెండుసార్లు కుటుంబ సభ్యులను కలుసుకునే వీలును కల్పించారు. అయితే కుటుంబ సభ్యుల జాబితాను నిర్ధారించుకున్న తర్వాతే జైలు అధికారులు వారిని అనుమతిస్తారు. జైలులో కేజ్రీవాల్ దినచర్య ఇతర ఖైదీలతోపాటే ఉదయం ఆరున్నర గంటలకు ప్రారంభమవుతుంది. ఉదయం బ్రేక్ ఫాస్ట్ గా టీ, బ్రెడ్ ఇస్తారు. ఆ తర్వాత తన కేసు విచారణ ఉంటే కోర్టుకు, లేదంటే తన న్యాయవాదుల బృందంతో కేజ్రీవాల్ సమావేశం అవుతారు. పదిన్నర గంటల నుండి 11 గంటల వరకు లంచ్ ఇస్తారు. ఇందులో పప్పు, కూరలు రొట్టెలు కానీ అన్నం కానీ పెడతారు. ఆ తర్వాత మూడు గంటల నుండి ఖైదీలను సెల్‌లోనే ఉంచుతారు. మూడున్నర గంటలకు టీ, రెండు బిస్కెట్లు ఇస్తారు. ఆపై లాయర్లను కలవచ్చు. ఇక జైలులో సాయంత్రం ఐదున్నర గంటలకు డిన్నర్ ఉంటుంది. అనంతరం ఏడు గంటల నుండి జైలు గదిలోనే ఉంటారు. ఇలా ఆయన దినచర్య కొనసాగుతుంది. కాగా, తనను అక్రమంగా అరెస్టు చేశారంటూ కేజ్రీవాల్ మండిపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ప్రతిపక్ష పార్టీల నాయకులను ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపిస్తున్నారు.

## గుజరాత్‌లో బిజెపికి ఇంటిపోరు

**అహ్మదాబాద్ :** గడిచిన 22 సంవత్సరాలలో గుజరాత్‌లో బిజెపి మొదటి సారి తీవ్రమైన అంతర్గత పోరును ఎదుర్కొంటోంది. ముఖ్యంగా 26 స్థానాలలో 5చోట్ల వర్గ పోరు స్పష్టంగా కనపడుతోంది. మొదట్లో ఒక నియోజకవర్గంలో అసంతృప్తి మొదలై, అది క్రమంగా విస్తరించి అరడజన్ స్థానాలకు పాకింది. సబర్‌కాంతా, రాజ్‌కోట్, వడోదర, వల్సాద్ జిల్లాల్లో అంతర్గత పోరు బిజెపికి సవాలుగా మారింది. జునాగఢ్ నియోజకవర్గ అభ్యర్థిని మార్చాలం టూ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు సిఆర్‌పాటిల్‌కు జన్‌సంఘ్ నేత రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పార్టీ స్థానిక నాయకత్వం ఒత్తిడి మేరకు ఇప్పటికే వడోదర నియోజక వర్గంలో అభ్యర్థి రంజన్ భట్‌ను మార్చగా, మార్చిన అభ్యర్థి డాక్టర్ హేమంగ్ జోషిని కూడా మార్చాలంటూ డిమాండ్ వస్తుండడంతో బిజెపి తలపట్టుకుంటోంది. సబర్ కాంత నియోజకవర్గ అభ్యర్థి విషయం లో వివాదం ఇప్పటివరకు పరిష్కారం కాలేదు. మరోవైపు కేంద్ర మంత్రి, రాజ్‌కోట్ నియోజకవర్గం అభ్యర్థి పురుషోత్తం రూపాలా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి.

## ఉత్తర్‌ప్రదేశ్‌లో 'మిషన్ 80' కష్టమే

**లక్నో :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం 80 ఎంపి స్థానాలను కైవసం చేసుకోవాలనే బిజెపి 'మిషన్ 80' కలలు నెరవేరడం కష్టమేనని పరిశీలకులు భావిస్తున్నారు. గతంలో నరేంద్ర మోడీ ప్రధాని అభ్యర్థిగా 2014 ఎన్నికల్లో ప్రచారం చేసినప్పుడు ఆ రాష్ట్రంలో గరిష్ఠంగా 71 స్థానాలను బిజెపి గెలుచుకొంది. 2019 లోక్ సభ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ, బిఎస్‌పి మహాకూటమిగా ఏర్పడగా, బిజపి 16 స్థానాలను కోల్పోయింది. ఇప్పుడు మొత్తం 80 స్థానాల లక్ష్యం ఆషామాషీ కాదని, అది నెరవేరకపోతే 400 పార్ అనే బిజెపి నినాదం సుసాధ్యం కాదని భావిస్తున్నారు. ఇప్పటికే మెజారిటీ స్థానాలకు అభ్యర్థులను బిజెపి ప్రకటించింది. సమాజ్‌వాదీ పార్టీ కుటుంబ స్థానమైన మెయిన్‌పురి స్థానం, కాంగ్రెస్ కంచుకోట రాయ్ బరేలి స్థానంలో కాషాయ జెండా ఎగరడం దాదాపు సాధ్యం కాదనే చెప్పవచ్చు. ఒకవేళ రాహుల్‌గాంధీ గతంలో ఓడిపోయిన అమేథీ నియోజకవర్గం నుండి ఈసారి పోటీ చేయాలనుకుంటే , అక్కడ గెలుపొందిన కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీకి మరో విజయం అంత సులువేమి కాదని స్థానికులు చెబుతున్నారు. కొన్ని స్థానాలలో కొత్త అభ్యర్థులను బరిలో దింపాలని ఓటర్లు భావించినప్పటికీ, బిజెపి అధిష్టానం రామ మందిరం ప్రచార హోరులో అన్ని స్థానాలను కైవసం చేసుకుంటామనే అతి విశ్వాసంతో సిట్టింగ్ ఎంపిలకు లేదా గతంలో ఓడిపోయిన వారికే టిక్కెట్లు ఇచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు. 2014 లోక్ సభ ఎన్నికల్లో మాదిరిగా ఈ చతర్ముఖ పోటీతో పాటు , ముస్లింల ఓట్ల చీలికతో బిజపి లబ్ధి పొంది, 71 స్థానాలను గెలుచుకోగలిగింది. కాని ఈ సారి పరిస్థితి అలా లేదు. అలాగే 2019లో ఎస్‌పి– బిఎస్‌పి కూటమి మధ్య సీట్ల సర్దుబాటులో ఎస్‌పికి కేటాయించిన 37 స్థానాలలో , 35 చోట్ల దళిత ఓట్లు ప్రభావంతో బిజెపి గెలవగలిగింది. ఈసారి తీవ్రమైన వేసవి కూడా ప్రభావం చూపిస్తుందని, ఎలాగైనా బిజెపికే సానుకూల వాతావరణం ఉన్నదని, పార్టీ ఓటర్లు ఓటేయ్యకపోతే ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నట్లు బిజెపి నేతలే చెబుతున్నారు.

## రాజకీయ పోట్లాట (మొదటి పేజీ తరువాయి)

ముందుకేసి తెగ విమర్శలు చేస్తున్నారు. రెండు రోజులుగా బిఆర్ఎస్ కరువు సంబంధించి చేస్తున్న విమర్శలపై కాంగ్రెస్ కూడా దీటుగానే స్పందిస్తుంది. ఖజానా ఖాళీ చేశారు, ప్రాజెక్టులు ఖాళీ చేశారు... ప్రాజెక్టులలో నీరు లేకుండా పంట పొలాలను ఎలా కాపాడాలని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా మొదటి పంటకే నీరు ఇవ్వలేక చేతులు ఎత్తేసిన బిఆర్ఎస్ నేతలు.... ఇప్పుడు నీరు ఇవ్వలేదంటూ కాంగ్రెస్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ మంత్రులు బిఆర్ఎస్‌పై ఎదురు దాడి చేస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నల్లగొండ జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు కెసిఆర్ లక్ష్యంగా పదునైన విమర్శలు చేస్తున్నారు. ఇక తాగునీటికి సంబంధించి తమ హయాంలో ఏ మహిళ బిందె పట్టుకుని రోడ్డెక్కలేదని కానీ, మూడు నెలల పాలనలోనే నీళ్ల కోసం ప్రజలు రోడ్డెక్కుతున్నారని బిఆర్ఎస్ అంటుంటే... మిషన్ భగీరథలోని లోపం తెలంగాణ ప్రజల పాలిట శాపంగా మారిందని కాంగ్రెస్ ప్రతి విమర్శ చేస్తున్నది. కరువు తర్వాత పార్లమెంటు ఎన్నికల వేళ రైతు మరోసారి రాజకీయ వస్తువుగా మారిపోయాడు. 200 మంది రైతులు మూడు మాసాల కాలంలో ఆత్మహత్యలు చేసుకున్నారని రైతాంగాన్ని దెబ్బతీసిన ఊసురు కాంగ్రెస్‌కు తగులుతుందని బిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వానికి శాపనార్థాలు పెడుతున్నారు. తాము నిరంతర విద్యుత్, రుణమాఫీ ఇచ్చి రైతులను ఆదుకుంటే కాంగ్రెస్ రైతులను ఇబ్బందులు పెడుతుందని ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిన పోలాలకు ఎకరాకు రూ. 30 వేలు చెల్లించాలని బిఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తుంటే అసలు మీరు ఎప్పుడైనా రైతులకు పరిహారం చెల్లించారా అని కాంగ్రెస్ ఎదురు దాడి చేస్తుంది. గతేడాది ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి ఏ మేరకు పరిహారం చెల్లించారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. రూ. 150 కోట్లు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకున్నారని అది కూడా పదేళ్ల కాలంలో మొదటిసారి చెల్లించారని కాంగ్రెస్ నేతలు ప్రతి విమర్శలు చేస్తున్నారు. ఇక రెండు పార్టీలు రైతు బంధుపై విమర్శ, ప్రతి విమర్శలకు దిగుతున్నాయి. పార్లమెంటు ఎన్నికల వేళ జరుగుతున్న ఈ విమర్శలు రాజకీయ వేడిని పుట్టిస్తున్నాయి.

ఇది ఇలా ఉంటే అసలు కరువును ఎదుర్కొనేందుకు ఇరు పార్టీలు కార్యాచరణను చూపించడం లేదని విమర్శలు, ప్రతి విమర్శలతోనే సరి పుచ్చుకుంటున్నారని కాంగ్రెస్, బిఆర్ఎస్ యేతర పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. మొత్తంగా పార్లమెంటు ఎన్నికల నామినేషన్లకు మరో 15 రోజుల గడువు ఉందనగా రాష్ట్రంలో కరువు పేర రాజకీయం ఊపందుకోగా మళ్లీ రైతే ప్రచార అస్త్రంగా మారాడు.

## చర్యలు తీసుకోబోం (మొదటి పేజీ తరువాయి)

చేసిన పిటిషన్‌పై వాదనలను జూలై 24వ తేదీ నాటికి సుప్రీం కోర్టు ధర్మాసనం వాయిదా వేసింది. కాంగ్రెస్ పార్టీ తరుపున సుప్రీం కోర్టుకు హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ దీనిపై హర్షం వ్యక్తం చేశారు. కోర్టులో సవాలు చేసిన 2016 తీర్పు ఆధారంగా, ఐటి విభాగం రూ.1,700 కోట్ల పన్ను చెల్లించాలని డిమాండ్ నోటీసు జారీ చేసిందని మెహతా తెలిపారు. పిటిషనర్ రాజకీయ పార్టీ అని, ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్నాయని, ఏ పార్టీకీ సమస్య రాకూడదని, ఎన్నికల తరువాత జూలైలో చేపట్టే ఈ కేసుకు సంబంధించి రూ.1,700 కోట్ల బకాయిలు చెల్లించకపోతే తాము చర్యలు తీసుకోబోమని స్పష్టం చేశారు. 2016 మార్చి 23లో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఏర్పాటు చేసుకున్న పరిమితుల ఆధారంగా 2021లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఐటి నోటీసులు ఇచ్చారని, అందులో 20 శాతం చెల్లించాలని అవకాశం ఇచ్చినప్పటికీ చెల్లించలేదని సొలిసిటర్ జనరల్ మెహతా కోర్టుకు తెలియజేశారు. ఆ తరువాత కూడా ఏమి చెల్లించలేదని, దీంతో 2021లో జారీ చేసిన నోటీసుకు సంబంధించి రూ.135 కోట్లను 2024లో ఐటి విభాగం రికవరీ చేసుకున్నదన్నారు. ఆ నిబంధనల ప్రకారమే తాజాగా రూ.1700 కోట్లు చెల్లించాలని డిమాండ్ నోటీసు ఇచ్చామని మెహతా వెల్లడించారు. 2016 హైకోర్టు తీర్పునకు వ్యతిరేకరంగా దాఖలైన ప్రధాన పిటిషన్‌పై ఐటి విభాగం జవాబు ఇవ్వాల్సి ఉన్నదని పేర్కొన్నారు. మరి అలాంటప్పుడు డిమాండ్ నోటీసును నిలుపుదల చేయాలా అని బెంచ్ ప్రశ్నించగా, ఆ అవసరం లేదని, వచ్చే వాయిదా వరకు ఎలాంటి చర్యలు తీసుకోబోమని మెహతా అన్నారు. సింఘ్వీ తన వాదనలు వినిపిస్తూ మార్చి మాసంలో అనేక డిమాండ్ నోటీసుల జారీ చేశారని, వాటి విలువ రూ.1700 కాదని, సుమారు రూ.3500 కోట్లు అని, అవి ఐదేళ్ళకు సంబంధించినవని వివరించారు. తాజా నోటీసు ద్వారా, ఆదాయపన్ను విభాగం కాంగ్రెస్ పార్టీని మొత్తం రూ.3567 చెల్లించాలని కోరిందన్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం తాజాగా జారీ చేసిన నోటీసులు 2014–15 (రూ.663 కోట్లు), 2015–16 ( సుమారు రూ.664 కోట్లు), 2016–17 (సుమారు రూ.417 కోట్లు) కు సంబంధించినవి. అందుబాటులో ఉన్న పన్ను రాయితీని నిలిపివేసి కాంగ్రెస్ పార్టీకి సంబంధించి మొత్తం విరాళాలపై ఐటి విభాగం పన్నులు విధించిందని సింఘ్వీ తెలియజేశారు. 2017 నుండి 2021 వరకు నాలుగు సంవత్సరాలకు సంబంధించిన పన్నుల పునః అంచనాపై మార్చి 28న కాంగ్రెస్ సవాలు చేస్తూ వేసిన పిటిషన్లను హైకోర్టు తిరస్కరించింది. మార్చి 22న దాఖలు చేసిన మరో పిటిషన్‌నుకూడా హైకోర్టు తిరస్కరించింది. ఈ నేపథ్యలంలో కాంగ్రెస్ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఐటి నోటీసులకు సంబంధించి అధికార బిజెపి, ప్రతిపక్ష కాంగ్రెస్ ల మధ్య తీవ్రమైన మాటల యుద్ధం సాగుతోంది. ఎన్నికలలో దెబ్బ తీసేందుకే కేంద్ర ప్రభుత్వం తన ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తున్నదని, ఇది పన్ను ఉగ్రవాదమని కాంగ్రెస్ విరుచుకుపడింది. మరోవైపు సిపిఐకి సైతం రూ.11 కోట్లు చెల్లించాలని ఐటి విభాగం డిమాండ్ నోటీసు జారీ చేసింది.

# రైతులకు తిప్పలు

(మొదటి పేజీ తరువాయి)

కాలంలో రూ.5వేల కోట్ల నుండి రూ.6 వేల కోట్ల వరకు పంట నష్టం జరిగిందని, 2017లో వరదలు అధిక వర్షాలతో 12లక్షల ఖరీఫ్ పంట, 5 లక్షల ఎకరాల రబీ పంట నష్టం జరిగిందని వివరించారు. 2023లో 12 లక్షల ఖరీఫ్, 5 లక్షల రబీ పంట నష్టం జరిగిందని, ప్రస్తుతం అన్ని రకాల పంటలకు 10 లక్షల ఎకరాలకు నష్టం జరిగిందని తెలిపారు. జూన్ 1 నుండి సెప్టెంబర్ 30 వరకు కృష్ణా బేసిన్‌లో 1033 మిల్లీ మీటర్లు వర్షం పడిందని, జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు పైనుండి చుక్కనీరు రాలేదని, వచ్చిన చుక్కనీరు కూడా రాయలసీమ లిఫ్ట్‌కు, లేదా పోతిరెడ్డిపాడుకు పోయాయని వివరించారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్ట్ అంశంలో బిఆర్ఎస్ పోరాటం చేయలేదని, ఆ సమయంలో వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి సిఎంగా ఉంటే, ప్రస్తుత బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు మంత్రిగా ఉన్నారని గుర్తు చేశారు. ఆ తర్వా త రాయలసీమ ఎత్తిపోతలను బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, తద్వారా ప్రస్తుతం కృష్ణా బేసిన్ ఎండిపోవడానికి ప్రధాన కారణమన విమర్శించారు.

### నిరుపయోగంగా కేంద్ర నిధులు

కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులలో రాష్ట్ర వాటా కింద మ్యాచింగ్ ఫండ్స్‌ను చెల్లించపోవడంతో కేంద్ర కేటాయింపులను కూడా గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉపయోగించలేదని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. 2021–22లో రూ.449 కోట్లు, 2022–23లో రూ.472 కోట్లు , 2023–24లో రూ.495 కోట్లు, 2024–25లో 521 కోట్లు, 2024–25లో రూ. 546 కోట్లు , మొత్తం కేంద్రం నుండి రావాల్సిన మొత్తం రూ. 2483 కోట్లలో రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ ఫండ్స్‌గా రాష్ట్ర ప్రభుత్వం నుండి రూ.150 కోట్లు, రూ. 157 కోట్లు, రూ. 165 కోట్లు, రూ. 173, రూ.182 కోట్లు మొత్తాన్ని చెల్లించలేదన్నారు. ఫలితంగా కేంద్ర నిధులను ఉపయోగించలేకపోయిందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర నిధులను ఉపయోగించునేలా రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ ఫండ్స్‌ను చెల్లించి, ఆ నిధులను వాడుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. పది లక్షల ఎకరాలకు ముందుగా ప్రతి ఎకరాకూ రూ.10వేల చొప్పన తక్షణమే విడుదల చేయాలని కోరారు.

### తైబందీని పట్టించుకోని కెసిఆర్

ఉన్న నీటిని లెక్కవేసి, వాటిని సాగు, వ్యవసాయరంగాలకు షిఫ్ట్ పద్ధతిలో పంపిణీ చేసేలా 'తై బందీ' విధానాన్ని కెసిఆర్ మర్చిపోయారని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. నవంబర్‌లో కొద్ది కొద్ది నీటిని రైతులు వాడుకున్నారని, ఖమ్మం, పాలేరు, వైరా వంటి ప్రాంతాల్లో రైతులు నీటి కోసం రొడ్డెక్కితే, అప్పటికీ మిగిలిన నీటిని ఆ రైతులకు వదిలేశారని వివరించారు. ఇది ఎవరి పాపమని ప్రశ్నించారు. నీటి నిర్వహణ కాంగ్రెస్‌తో కావడం లేదని, తనతో గొప్పగా అవుతుందని చెబుతున్న కెసిఆర్, గతంలోనే తైబందీ నిర్వహణ చేసి ఉంటే, ఇటువంటి పరిస్థితి వచ్చేది కాదా అని నిలదీశారు. యాసంగి పంట నిర్వహణ పంటల విధానాన్ని ఎవరు పట్టించుకోలేదని, యాసంగిలో నీటి తక్కువగా ఉంటుందని, తద్వారా ఆరు తడి పంటల వైపు వెళ్లాలని, కానీ వరి పంటకే నీరు ఎక్కువగా వదిలారని, వరి ధాన్యగారం మోజులో గత ప్రభుత్వం చిన్న పంటలను వదిలేసిందని, తద్వారా విదేశాల నుండి పప్పులను దిగుమితి చేసుకునే దుస్థితికి వచ్చామని ఆందోళన వ్యక్తం చేశారు. మనకు 30 లక్షల టన్నులు కూరగాయాలు అవసరమతే, 20లక్షల టన్నులు మాత్రమే పంటలు పండుతున్నాయన్నారు. యాసంగి పంటల విధానాన్ని రూపకలప్పన చేయకపోవడం కెసిఆర పాపం అని అన్నారు.

### నాడు సిపిఐ ఎంఎల్ఎను తీసుకెళ్లలేదా...

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ కోసం జాతీయ పార్టీల్లో మొట్టమొదటి సారి పోరాటం చేసిన పార్టీ సిపిఐ అని, అటువంటి సిపిఐకి చెందిన ఎంఎల్ఎను గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో తీసుకెళ్లిందని కూనంనేని సాంబశివ రావు ప్రశ్నించారు. మునుగోడులో బిఆర్ఎస్‌కు సహాయం చేస్తే ఆ పార్టీకి కనీసం కృతజ్ఞత ఉండాలి కదా? అని మండిపడ్డారు. ఫిరాయింపులపై ఇప్పుడు కెసిఆర్, బిఆర్ఎస్ నేతలు మాట్లాడడం విడ్డూరంగా ఉన్నదన్నారు. పాపాల ఊబిలో పడిన కెసిఆర్‌ను పైకి లేపేందుకు ఎవ్వరూ లేరన్నారు. డబ్బు, సెంటిమెంట్ ఇప్పుడు బిఆర్ఎస్‌కు పనిచేయడం లేదిన, ఆ పార్టీకి కార్యకర్తలు లేకపోగా ఏ సామాజిక వర్గ అండ కూడా లేదని విమర్శించారు. అధికారం కోల్పయిన తర్వాత ఆయా రాజకీయ పార్టీలు కనీసం తమ స్థాయిలో కూడా నిలబడలేవన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రొత్సహించడం లేదని, తక్షణమే రాజీనామా చేయాలనే చట్టం ఉండాలని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని పరిపూష్టి చేయాలని కోరారు.

## ఎన్‌డిఎకు 270 సీట్లు రావడమే కష్టం

### సయ్యద్ అజీజ్ పాషా

రాజ్యసభ మాజీ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా ఇండియా కూటమికి దేశ వ్యాప్తంగా మంచి సానుకూల వాతావరణం నెలకొన్నదన్నారు. నాలుగువందలకుపైగా స్థానాలు వస్తాయని గొప్పలు చెప్పుకుంటున్న ఎన్‌డిఎ కూటమికి కనీసం 270 స్థానాలు కూడా రావడం కష్టసాధ్యమేనని వ్యాఖ్యానించారు. 'ఇండియా' కూటమి ఐక్యతగా వెళ్తే మరింత మంచి ఫలతాలు వస్తాయని అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రిని, జార్ఖండ్ మాజీ సిఎంను జైల్లో పెట్టడంతో సానుభూతి ఉన్నదన్నారు. పశ్చిమ బెంగాల్‌లో సిఎఎ ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నారు. గుజరాత్, హర్యానా , ఢిల్లీలో దాదాపూ పూర్తి స్థానాలు దక్కించుకున్న బిజెపి, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఉన్న స్థానాలను ఎలా దక్కించుకుంటుందన్నారు. పశ్చిమ భారతంలో మహారాష్ట్రలో ఉద్ధవ్ థాక్రే, శరద్ పవార్ పార్టీలపై సానుభూతి నెలకొన్నదని, ఇవన్నీ చేస్తుంటే అబ్‌కీ బార్ 400 పార్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

### కెసిఆర్‌వి ముసలి కన్నీరు ..: చాడ

చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పంటలు ఎండిపోతున్నాయని కెసిఆర్ ముసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. 2014లో కెసిఆర్ సిఎం అయినా తర్వాత 2015లో రైతుల ఆత్మహత్యల పరంపర జరిగితే, ఆయన కనీసం పరామర్శించలేదని విమర్శించారు.రైతుఆత్మహత్యల నివారణపై రైతు, వామపక్షాలు, ఆందోళన చేపట్టాయని, బస్సు యాత్ర నిర్వహించిన విషయాన్ని గుర్తుకు చేశారు. కరువు సహాయక చర్యల్లో భాగంగా రైతులకు రూ.25వేలే కాదని ఎంత ఇచ్చిన రైతులకు తక్కువేనని, కానీ సిఎంగా ఉన్నప్పుడు రైతులకు కెసిఆర్ ఎంత ఇచ్చారని నిలదీశారు. సిపిఐ చేసిన పోరాట ఫలితంగా ఏర్పడిన మిడ్ మానేరులో నీళ్లు ఉండడంతోనే పూర్తిగా నీటి నిల్వకు అవకాశం ఉన్నదన్నారు. పాలకులు స్వామినాథన్ సిఫార్సులు అమలు చేసి ఉంటే రైతుల ఆత్మహత్యలకు, కరువుకు సంబంధించి నివారణ చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉండేదన్నారు. పార్టీ ఫిరాయింపులకు బారులు తెరిచిందే కెసిఆర్ అని అన్నారు. ఫిరాయింపుల చట్టం విష కోరలు లేని నాగు లాగా ఉన్నదని ఎద్దేవా చేశారు.

# తప్పుతోవ పట్టించే యత్నం

## సిజెఐకి కొందరు అడ్వొకేట్ల లేఖపై ఎఐఎల్‌యు ఖండన

**న్యూఢిల్లీ :** అవినీతి కేసుల్లో న్యాయవ్యవస్థపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయంటూ సుప్రీంకోర్టు సీనియర్ అడ్వొకేట్‌లు హరీష్ సాల్వే, అదిష్ అగర్వాల్ సహా 600మంది న్యాయవాదులు గతవారం ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్‌కు రాసిన లేఖ ప్రజల్లో తప్పుడు అభిప్రాయం కలిగించేందుకు, తప్పుత్రోవ పట్టించేందుకు ఉద్దేశించినదిగా వామపక్ష భావజాలం కలిగిన అఖిల భారత లాయర్స్ యూనియన్ (ఎఐఎల్‌యు) పేర్కొన్నది. అది ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు తీర్పుతో బహిర్గతమైన అవినీతి పర్యవసానంగా వ్యాఖ్యానించారు. వారి లేఖ న్యాయవ్యవస్థ స్వతంత్రం కోసం, రాజ్యాంగం మౌలిక స్వరూపం పరిరక్షణ కోసం నిలకడగా పోరాడుతున్న బాధ్యతాయుతులైన లాయర్లు, లాయర్ల సంఘాలపై నిందారోపణలు చేసిందని ఎఐఎల్ యు నాయకులు సీనియర్ లాయర్, రాజ్యసభ ఎంపి బికాస్ రంజన్ భట్టాచార్య, సీనియర్ లాయర్ పి.వి.సురేంద్రనాథ్ అన్నారు.

బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు పార్లమెంటు అత్యున్నతాధికారం పేరుతో "న్యాయ సమీక్ష"పై రాజ్యాంగ "మౌలిక స్వరూపం"పై దాడిచేశారని, జడ్జీల ఎంపికలో కార్యనిర్వాహకవర్గం పాత్రను నిర్ణయించాలని కోరారని ఎఐఎల్‌యు నాయకులన్నారు.

# భక్తుల ఇంటికే భద్రాచలం కల్యాణ తలంబ్రాలు

## రూ.151 చెల్లిస్తే చేరవేయనున్న టిఎస్ఆర్‌టిసి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో జరగబోయే శ్రీ సీతారామచంద్రుల కల్యాణోత్సవ తలంబ్రాలను భక్తులకు అందజేయాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ(టిఎస్ ఆర్‌టిసి) యాజమాన్యం నిర్ణయించింది. గత ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా



తెలంగాణ దేవాదాయ శాఖ సహకారంతో రాములవారి కల్యాణ తలంబ్రాలను భక్తుల ఇళ్ల వద్దకు చేరవేసే పవిత్ర కార్యానికి శ్రీకారం చుట్టింది. ఎంతో విశిష్టత కలిగిన ఈ తలంబ్రాలు కోరుకునే భక్తులు టిఎస్ ఆర్‌టిసి లాజిస్టిక్స్ కేంద్రాల్లో రూ.151 చెల్లించి, వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. శ్రీ సీతారామచంద్రుల కల్యాణోత్సవం అనంతరం ఈ తలంబ్రాలను భక్తులకు టిఎస్ ఆర్‌టిసి హోం డెలివరీ చేస్తుంది. హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో సోమవారం భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్ పోస్టర్‌ను టిఎస్ ఆర్‌టిసి ఎం.డి. వి.సి. సజ్జనర్ ఆవిష్కరించారు. తలంబ్రాల బుకింగ్‌ను ఆయన ప్రారంభించారు. నియమ నిష్టలతో ధాన్యాన్ని గోటితో ఒలిచి తీసిన కోటి బియ్యం గింజలను తలంబ్రాలుగా ఎన్నో ఏళ్లుగా సీతారామ కల్యాణంలో ఉపయోగిస్తున్నారు. విశిష్టమైన ఈ తలంబ్రాలను భక్తుల ఇంటికి చేర్చాలని రెండేళ్ల క్రితమే టిఎస్ ఆర్‌టిసి యాజమాన్యం నిర్ణయించింది. 2022లో దాదాపు 89 వేల మంది భక్తులకు తలంబ్రాలను బుక్ చేసుకోగా, గత ఏడాది 1.17 లక్షల మంది భక్తులకు తలంబ్రాలను సంస్థ అందజేసిందని సజ్జనర్ తెలిపారు. భద్రాద్రిలో ఈ నెల 17న అంగరంగ వైభవంగా జరిగే శ్రీరామనవమి వేడుకలకు వెళ్లలేని భక్తులు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని టిఎస్ ఆర్‌టిసి లాజిస్టిక్స్ కౌంటర్‌లలో తలంబ్రాలను బుక్ చేసుకోవచ్చని చెప్పారు. తలంబ్రాల సేవను పొందాలనుకునే భక్తులు టిఎస్ ఆర్‌టిసి కాల్ సెంటర్ ఫోన్ నెంబర్లలో 04023450033, 040 69440000, 04069440069 సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎస్ ఆర్‌టిసి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సిఓఓ) డాక్టర్ వి.రవిందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణకాంత్, సిటిఎం (మార్కెటింగ్, కమర్షియల్) శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# చేసింది చెప్పుకోవడంలో విఫలమయ్యాం : కెటిఆర్

**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ చెప్పిన అబద్ధాలకు ప్రజలు బోల్తా పడ్డారు.. కాంగ్రెస్ పాలనపై ప్రజలలో వ్యతిరేకత వచ్చి గులాబీకి



జోష్ నెలకొన్నది. ఇదే జోష్ రెట్టింపు ఉత్సాహంతో పార్లమెంటు ఎన్నికల్లో గెలుపు దిశగా పోరాడాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపునిచ్చారు. నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జిల్లా కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించారు. సమావేశానికి కెటిఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బిఆర్ఎస్ హయాంలోనే ఉద్యోగాల నోటిఫికేషన్ వేసి పరీక్షలు నిర్వహిస్తే సీఎం రేవంత్‌రెడ్డి ఆర్డర్ పత్రాలు ఇచ్చి గొప్పలకు పోతున్నారన్నారు. ఉద్యోగాలు ఇచ్చి కూడా ప్రచారం చేసుకోలేకపోయామని నిరుద్యోగులను, ఉద్యోగులను రెచ్చగొట్టి కాంగ్రెస్ లాభం పొందిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రుణమాఫీ చేయిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్‌కు రుణమాఫీ అయినవారు ఆ పార్టీకి ఓట్లు వేయాలి.. కానివారు బిఆర్ఎస్‌కు ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, జెడ్‌పి చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులున్నారు.

# మెదక్ ఎంపి స్థానంలో త్రిముఖ పోటీ

## పట్టుకోసం బిజెపి, కాంగ్రెస్ పరువుకోసం బిఆర్ఎస్ ప్రయత్నం

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** మెదక్ పార్లమెంట్ స్థానానికి ప్రధాన పార్టీలైన బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ అభ్యర్థులను ఖరారు చేశాయి. ఇక ప్రజా క్షేత్రంలో అభ్యర్థులు తమ భవితవ్యం తేల్చుకోవాల్సి ఉంది. మెదక్ పార్లమెంటు స్థానానికి బిజెపి అభ్యర్థిగా రఘునందన్‌రావు, బిఆర్ఎస్ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా నీలం మధుకు ప్రధాన పార్టీలు టికెట్లను కేటాయించాయి. దీంతో మెదక్ స్థానానికి త్రిముఖ పోటీ నెలకొంది. అయితే మెదక్ పార్లమెంటు సెగ్మెంట్‌లో మెదక్, సిద్దిపేట, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్ చేరువు, దుబ్బాక, గజ్వేల్ అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో మెదక్,ఆందోల్ కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లగా, బిఆర్ఎస్ పార్టీ మిగతా స్థానాలను కైవసం చేసుకొని ఆశించిన స్థాయిలో విజయం సాధించినా రాష్ట్రంలో అధికారం కోల్పోయింది. దీంతో ఈ పార్టీకి పార్లమెంట్ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. ముఖ్యంగా గజ్వేల్ నుంచి మాజీ సిఎం కెసిఆర్, సిద్దిపేట నుంచి మాజీ మంత్రి హరీష్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో మెదక్ పార్లమెంట్ సీటును ఎలాగైనా కైవసం చేసుకొని పరువు నిలబెట్టుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మెదక్ లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా అందులో ఆరింట బిఆర్ఎస్ అభ్యర్థులే గెలుపొందారు. దీంతో మెదక్ సీటు బిఆర్ఎస్‌కే దక్కుతుందని ధీమాతో ఉన్నారు. మెదక్ పార్లమెంటు స్థానాన్ని రెండు పర్యాయాలు బిఆర్ఎస్ కైవసం చేసుకుని కంచుకోట గా పేరు తెచ్చుకుంది. గత ఎన్నికల్లో మెదక్ లోక్‌సభ సెగ్మెంట్‌లో బిఆర్ఎస్‌కు 2.40 లక్షల ఓట్ల మెజార్టీ లభించింది. ఇప్పటికే మాజీ మంత్రి హరీష్‌రావు సంగారెడ్డి, మెదక్ అసెంబ్లీ సెగ్మెంట్లలో క్యాడర్‌ను సన్నద్ధం చేసేందుకు సమావేశాలు నిర్వహించి ఓటర్లను చైతన్యం చేస్తున్నారు.

**గెలుపుపై బిజెపి అభ్యర్థి రఘునందన్ ధీమా**

తెలంగాణ ఉద్యమకారుడు,దుబ్బాక మాజీ ఎమ్మెల్యే బిజెపి అభ్యర్థిగా రఘునందన్‌రావు బరిలో నిలిచారు. అన్ని పార్టీల కంటే ముందుగా బిజెపి మొదటి జాబితాలోనే రఘునందన్‌రావుకు టికెట్టు కేటాయించింది. దీంతో ఆయన మెదక్ అసెంబ్లీ సెగ్మెంట్ తో పాటు ఇతర నియోజకవర్గాలలో ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రధాని మోడీ చరిష్మా, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూనే ప్రత్యర్థి పార్టీలపై విరుచుకుపడుతున్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టు.. ఫోన్ ట్యాంపరింగ్ కేసులో మాజీ సిఎం కెసిఆర్, హరీశ్‌రావులను ప్రధాన ముద్దాయిలుగా టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనపై విమర్శలు చేస్తూ మెదక్ సీటును బిజెపి కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే రఘునందన్‌రావు ఆయా సెగ్మెంట్లలో సుడిగాలి పర్యటన చేస్తూ నాయకులను కార్యకర్తలను,ఓటర్లను సమాయత్తం చేస్తున్నారు.


**బిసి కార్డుతో నీలం మధుకు గెలుపుపై ఆశ**

మెదక్ ఎంపీ సీటుపై కాంగ్రెస్ అభ్యర్థి విషయంలో చివరి వరకు తీవ్ర ఉత్కంఠకు గురి చేసిన అధిష్ఠానం చివరకు బిసి సామాజిక వర్గానికి చెందిన నాయకునికి పట్టం కట్టింది. అసెంబ్లీ టిక్కెట్ అడిగి బంగపడ్డ బిసి నేత, పటాన్ చెరువుకు చెందిన నీలం మధుకు హస్తం పార్టీ టికెట్టు ఖరారు చేసింది. నీలం మధు గతంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొని బిఆర్ఎస్ పార్టీలో పనిచేస్తూ పలు పదవులను అలంకరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పటాన్ చెరువు టికెట్టు ఆశించినా బిఆర్ఎస్ నిరాకరించడం, కాంగ్రెస్ పార్టీలో సైతం భంగపడడంతో బిఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు.

అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి మెదక్ ఎంపీ టికెట్ కోరిన విషయం తెలిసిందే. అధిష్టానం సైతం మధుకే టికెట్టు కేటాయించడం జరిగింది. బిసి నేతగా, సామాజిక సేవతో గుర్తింపు పొందిన నీలం మధుకు బలమైన బిజెపి, బిఆర్ఎస్ ప్రత్యర్థులను ఎలా కట్టడి చేస్తారో వేచి చూడాల్సిందే.

మరోవైపు బిఆర్ఎస్ నుండి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడం మంచి పరిణామం అయినప్పటికీ వారందరినీ కలుపుకొని గెలుపుబాట వైపు పయనించడానికి తీవ్ర కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జాతీయ పార్టీ నుండి పోటీ చేసే అవకాశం లభించడం, ముదిరాజ్ సామాజికవర్గం బలంగా ఉన్న నియోజకవర్గంలో ఓట్లు రాబట్టడం కోసం నీలం మధు ఏ విధంగా సఫలం అవుతారో చూడాల్సిందే. మెదక్ పార్లమెంట్ పరిధిలో 6 లక్షల కు పైగా ముదిరాజ్ సామాజిక వర్గానికి సంబంధించిన ఓట్లు, అలాగే నీలం మధు కు బిసి కార్డు సెంటిమెంట్ కలిసివచ్చే అంశంగా చెప్పవచ్చు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో ఎస్సి,ఎస్టీ,మైనార్టీ ఓట్లు అదనపు బలమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.







# త్వరలోనే కెసిఆర్ జైలుకు వెళ్లడం ఖాయం

## దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి చేసిన అవినీతి కార్యక్రమాలకు త్వరలోనే జైలుకెళ్లడం ఖాయమని దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. సోమవారం సాయంత్రం వరంగల్ తూర్పు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి కొండా సురేఖతో పాటు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, డాక్టర్ కడియం కావ్యలు పాల్గొన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ కెసిఆర్ కొత్త డ్రామాకు తెరతీస్తారని అన్నారు. గతంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వారిని కనీసం పట్టించుకోకపోగా ఆర్థిక సహాయంచేసిన పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలే అయిందని, ఈ లోపే వర్షాకాలం వచ్చినట్లు, ప్రాజెక్టులు ఎండిపోయినట్లు, నీళ్లు అందించక పంటలు ఎండిపోయినట్లు, దానికి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు కెసిఆర్ డ్రామాలు మొదలుపెట్టడం ప్రజలు చీత్కరించుకుంటున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతితో పాటు ప్రభుత్వంలో అనేక అవినీతి అక్రమాలు జరిగాయని, వాటన్నింటిపై చట్టపరంగా చర్యలు మొదలయ్యాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నూటికి నూరు శాతం ప్రజలు ఆకాంక్ష మేరకు ప్రజాపాలన కొనసాగుతుందని అన్నారు. ఎన్నికల ముందు ఎఐసిసి నాయకురాలు సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం జరుగుతుందన్నారు. వంద రోజుల్లోపే ఐదు గ్యారెంటీలను అమలు చేయడం జరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలో దెబ్బతిన్నదని, దెబ్బతిన్న రెండు ప్రాజెక్టుల



రూపకల్పన చేసిన ఇంజనీరింగ్ కూడా కేసీఆరేనని అన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ త్వరలో కనుమరుగవుతుందని అన్నారు.

**కాంగ్రెస్ వరంగల్ అభ్యర్థిగా డాక్టర్ కావ్య**

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** వరంగల్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థిగా డాక్టర్ కావ్యను త్వరలో అధిష్టానం ప్రకటిస్తుందని దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. సోమవారం ఉదయం హనుమకొండలోని రాంనగర్‌లో మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండ మురళీధర్ దంపతులను స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ కావ్యలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరస్పరం సత్కరించుకున్నారు. కొండా మురళి, సురేఖతో పాటు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రాజకీయంగా స్నేహబంధం ఉన్నప్పటికీ టీఆర్ఎస్ ప్రభుత్వంలో, కాంగ్రెస్ ప్రభుత్వంలో కలిసి పని చేస్తున్నారు. ఈ సందర్భంగా వారి మధ్య పార్లమెంట్ ఎన్నికలు వరంగల్ ఉమ్మడి జిల్లా రాజకీయాలపై సుదీర్ఘ చర్చ జరిగింది.ఈ సందర్భంగా కొండ సురేఖ మాట్లాడుతూ డాక్టర్ కడియం కావ్యను అధిష్టానం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత పార్టీ పరంగా ఆమె గెలుపుకు కృషి చేయడం కాకుండా భారీ మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు. అనంతరం వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు డాక్టర్ కావ్యలు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అక్కడి నుండి హనుమకొండలోని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు డాక్టర్ కావ్యలు కలిసి ఘనంగా సత్కరించారు. ఒకేరోజు వరంగల్ పార్లమెంట్ పరిధిలోని వరంగల్, వర్ధన్నపేట, హనుమకొండ నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిసినప్పటికీ రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సందర్భంగా మీడియాతో



కడియం శ్రీహరి మాట్లాడుతూ వరంగల్ సమగ్రాభివృద్ధికి అందరం కలిసి ప్రణాళికబద్ధంగా కృషి చేస్తామని చెప్పారు.

# మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసన మండలి ఉప ఎన్నిక కౌటింగ్ జూన్ 2 కు వాయిదా

**ప్రజాపక్షం /మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ఈ నెల 2వ తేదీన జరగనున్న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసన మండలి ఉప ఎన్నిక కౌటింగ్ ను జూన్ 2 తేదీకి వాయిదా వేస్తూ, జూన్ 5 వతేదీ లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు సోమవారం సోటిఫికేషన్ జారీ చేసినట్లు, రిటర్నింగ్ అధికారి,జిల్లా జి.రవి నాయక్ తెలిపారు.కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ మార్చి 16న ప్రకటించినందున అదే రోజు నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినట్లు,ఎం.ఎల్.సి ఉప ఎన్నిక కౌంటింగ్ పార్లమెంట్ ఎన్నికల పై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున కేంద్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నిక కౌంటింగ్ జూన్ 2వ తేదీకి వాయిదా వేస్తూ, ఎన్నికల ప్రక్రియ జూన్ 5 లోగా పూర్తి చేయాలని నోటిఫికేషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నా రు.



# సరుకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే పనితీరు అత్యుత్తమం

## అరుణ్ కుమార్ జైన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దక్షిణ మధ్య రైల్వే గత ఆర్థిక సంవత్సరం 2023–24లో సరుకు రవాణ రంగానికి సంబంధించిన ఆదాయంలో అత్యుత్తమ పనితీరును నమోదు చేసింది. జోన్ మునుపెన్నడూ లేని విధంగా మొట్టమొదటిసారిగా సరుకు రవాణలో140 మిలియన్ టన్నుల మార్కును అధిగమించి 141.117 మిలియన్ టన్నుల సరుకు లోడింగ్‌ను సాధించింది. ఇది గత సంవత్సరం కంటే 8.785 మిలియన్ టన్నుల అధికం. జోన్ 202324 ఆర్థిక సంవత్సరంలో సరుకు రవాణ ఆదాయంలో మొట్ట మొదటిసారి రూ.13,000కోట్ల రూపాయలను అధిగమించి, రూ. 13,438.76 కోట్లకు చేరుకుంది. ఇది గతేడాది కంటే రూ.506 కోట్లు ఎక్కువగా ఆదాయం సాధించడం విశేషం. ఈ అత్యుత్తమ విజయానికి కృషిచేసిన ఉద్యోగులు, సిబ్బంది, ఆపరేటింగ్, కమర్షియల్ బృందాన్ని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అభినందించారు.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు చేయాలి

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేలా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు.

బేగంపేటతో పాటు శంషాబాద్ విమానాశ్రయం లో కూడా తనిఖీలనులుఇపినిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పొరుగు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినప్పుడు సరిహద్దు జిల్లాల్లో డ్రై డేలను తెలియజేయాలన్నారు. **మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై బి.ఆర్. అంబేద్కర్ :** సచివాలయంలో అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల పరిస్థితి, చెక్పోస్టులలో సీజ్ చేసిన నగదు, ఓటర్లను ప్రభావితం చేసే ఇతర వస్తువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్మగ్లర్లు ఉపయోగించే రహస్య మార్గాలను గుర్తించాలని, తద్వారా సీజ్లకు సహాయపడే నిఘా పెంచాలని ఆమె అటవీ శాఖ అధికారులను ఆదేశించారు.

అన్ని పొరుగు రాష్ట్రాలతో అంతర్రాష్ట్ర సమావేశాలు నిర్వహించామని, రాష్ట్రంలో 85 సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని డిజిపి రవిగుప్తా తెలిపారు. ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ లు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు నిఘాను పెంచాయని, దీని ఫలితంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన ఈ పక్షం రోజులలో సుమారు రూ.35 కోట్లు స్వాధీనం చేసుకోగలిగామని అధికారులు సి.ఎస్ కు వివరించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకటించిన తర్వాత సమీకృత సరిహద్దు చెక్‌పోస్ట్ ల ద్వారా వాణిజ్య పన్నుల శాఖ నిఘాను పెంచిన ఫలితంగా రూ. 5.19 కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టికె శ్రీదేవి వివరించారు. వాణిజ్య పన్నుల శాఖ రాష్ట్రం నుండి బయటకు వచ్చే, వెళ్లే వస్తువులను కూడా మ్యాప్ చేసిందని, ఫలితంగా నేరస్థులను పట్టుకోవడం సులబతరం అయిందని, ఓటర్లను ప్రభావితం చేసే వస్తువుల తయారీ, వ్యాపార గోడౌన్లపై కూడా నిఘా పెంచామని టికె శ్రీదేవి తెలిపారు. వాణిజ్య పన్ను లు, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, సీనియర్ పోలీస్ అధికారులు మహేష్ భగవత్, సంజయ్ జైన్, రవాణా, రోడ్లు భవనాల శా ఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస్ రాజు, రవాణా శాఖ కమిషనర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# కెసిఆర్‌లో నైరాశ్యం

## మాజీ సిఎం ప్రతి మాట అబద్ధమే

## మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/ హైదరాబాద్:** మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు నైరాశ్యంలో ఉన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం పోయింది. పార్టీ కూడా పోతుంది అనే భయం ఆయనకు ఉంది. పొంకణాలకు పోయి.. బిఆర్ఎస్ ఉనికి లేకుండా మారింది. టిఆర్ఎస్.. బిఆర్ఎస్... విఆర్ఎస్ కూడా అవుతుం ది. కెసిఆర్ ప్రతి మాట అబద్ధమే. వాస్తవాలు వక్రీకరించండం ఆయనకే దక్కింది' అని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల తరవత బిఆర్ఎస్ మిగలదని, బిఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదన్నారు. కెసిఆర్, ఆయన కుటుంబ సభ్యులు తప్ప ఎవరూ పార్టీలో ఉండరన్నారు. కెసిఆర్ ఎప్పుడైనా రైతుల దగ్గరికి వెళ్ళాడా, ఇప్పుడు నైరాశ్యం లో రైతుల దగ్గరికి వెళ్ళాడని ఆయన అన్నారు. కెసిఆర్ మీడియా సమావేశం జనరేటర్ ద్వారా కరెంట్ సరఫరాతో పెట్టారని, కరెంట్ పోయింది అని తప్పుడు మాటలు చెప్పారని, జనరేటర్ ఆగిపోతే కూడా బాధ్యత మాదేనా అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తున్నదన్నారు. రాష్ట్రంలో 7149 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రతీ గింజ కొంటామని, మిల్లర్లు ఎంఎస్‌పి కంటే తక్కువ కొంటే చర్యలు తప్పవన్నారు. ఎన్‌టిపిసి 4000 మెగావాట్ల పవర్ ఉత్పత్తి చేస్తున్నదని కెసిఆర్ అన్నారని, వాస్తవానికి 1600 మెగావాట్లే చేస్తుందని, టిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్‌టిపిసితో కోఆపరేట్ ఉంటే 4 వేళా మెగావాట్ల విద్యుత్ రాష్ట్రం పరిధిలో ఉండేదని, యాదాద్రి కి ఎక్కడ నష్టం అవుతుందోనని, ఎన్‌టిపిసికి కెసిఆర్ సహకరించలేదన్నారు.

**రైతులకు కెసిఆర్ క్షమాపణ చెప్పాలి**

రైతులకు కెసిఆర్ క్షమాపణ చెప్పాలని, పంట నష్టం పథకం రద్దు చేసుకున్నారని, వరద వస్తే రైతులకు పైసా ఇవ్వలేదని ఉత్తంకుమార్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ముందు రెండు జిల్లాల్లో కెసిఆర్ నాటకం ఆడారని, అక్కడ కూడా రైతులకు డబ్బులు ఇవ్వలేదన్నారు. సాగునీటి రంగాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని, ఇందుకు మాజీ సిఎం కెసిఆర్ సిగ్గు పడాలని, తలవంచుకోవాలన్నారు. ఇంత దోపి డీ దేశంలో ఎక్కడా జరగలేదని, కాళేశ్వ రం గురించి మాట్లాడాలంటే..కామన్ సెన్స్ ఉండాలని, కెసిఆర్ సిగ్గు పడాల్సింది పోయి ఎక్కువ మాట్లాడుతున్నారన్నారు. కెసిఆర్ మాట లు వికారంగా ఉన్నాయని, సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారన్నారు. 'నువ్వు కట్టిన ప్రాజెక్టు.. నీ హయాంలో కూలింది.. సిగ్గు పడు. మేడిగడ్డ నుండి నీళ్ళు వదిలింది కెసిఆర్ ప్రభుతం. ఇప్పుడు కాంగ్రెస్ మీద నిందలు వేస్తున్నారు. ప్రాజెక్టు ఎక్కడ కూలిపోతుందో అని నీళ్లు కిందకు వదిలింది కెసిఆర్.23 టిఎంసిల నీళ్లు సముద్రంలో వదిలేసింది కెసిఆర్ హయాంలోనే' అని మంత్రి ఉత్తంకుమార్ అన్నారు. వర్షాలు తక్కువ పడ్డాయని, నీళ్లు తక్కువ ఉన్నాయని, రైతులను ఆదుకోవడానికి ప్రణాళిక వేస్తున్నామని మంత్రి ఉత్తంకుమార్ చెప్పారు. వేసవిలో మంచి నీటి కోసం ప్లాన్ చేస్తున్నామన్నారు. జూరాల లో ప్రస్తుతం 154 టిఎంసిల ఇన్‌ఫ్లో, 2022 లో 1229 టిఎంసి వచ్చిందని, ఇది ప్రకృతి కరువా..కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువా ప్రజలు ఆలోచించాలన్నారు. కెసిఆర్, జగన్ దోస్తీతో నీళ్ల దోపిడీ జరిగిందన్నారు. కృష్ణ నీళ్లను ఎపి దోచుకుంటున్నా కెసిఆర్ నోరు మెదపలేదన్నారు. ప్రభుత్వ కొత్త పథకాలు ఎన్నికల నియమావళి అమలులో ఉన్న సమయంలో అమలు కావన్నారు. రైతుల పంటలకు బోనస్‌పై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

**నా ఫోన్ కూడా ట్యాప్ చేశారు :** 'నా ఫోన్ కూడా ట్యాప్ చేశారు. ఫోన్ ట్యాప్ కేసు చాలా సీరియస్‌గా ఉంటుంది. ఎవరి అనుమతి ఉంది అనేది తేలాలి. అనుమతి లేకుండా ట్యాప్ చేయడం తప్పు' అని రాష్ట్ర మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నా రు. పోలీసు శాఖను ఎక్కువ ఉపయోగించుకుంది కెసిఆరేనని, ఫోన్ ట్యాపింగ్ చేసింది కూడా ఆయనని మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి ఆరోపించారు. ఇప్పుడు పోలీసులు తటస్థంగా ఉండాలనడం హాస్యాస్పదమన్నారు. గాంధీభవన్‌లో సోమవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రైతుల ఆత్మహత్యలపై కెసిఆర్ అబద్ధాలు చెప్తున్నారని, కెసిఆర్ చెప్పినట్లు రాష్ట్రంలో 200 మంది రైతుల ఆత్మహత్యలు జరగలేదు కానీ.. 200 మంది బిఆర్ఎస్ పార్టీని నేతలు వదిలేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో పెద్ద తలకాయలు జైల్‌కు పోయేట్టు ఉన్నాయన్నారు. ఓ వైపు కూతురు జైలులో ఉందని, కాళేశ్వరంలో ఇంకా ఏమౌతుందో తెలియదని, రూ.40 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారని, సిఎంతో సహా తామంతా పనిలో ఉన్నామని, కెసిఆర్ మాదిరిగా ఫామ్‌హౌస్‌లో లేమని ఆయన అన్నారు.


# రైతుల పేరిట రాజకీయాలు చేయొద్దు

## రాష్ట ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధిః** కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేయాలనే కుట్రతో రైతుల పేరిట రాజకీయాలు చేయవద్దని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రతిపక్షాలకు హితవు పలికారు.సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో రాష్ట్రంలో కొంతమేర పంట నష్టం జరిగితే దానిని రాజకీయంగా వాడుకునేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నాలు చేస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ఈ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే బిఆర్ఎస్ పార్టీ రాజకీయం చేస్తోందని ఆయన దుయ్యబట్టారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి రైతులను పట్టించుకోకుండా ఇపుడు ఎంపి సీట్ల కోసమే మాజీ సీఎం కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆనాడు ఈనాడు రైతు సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. లక్షల కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో మంథని ప్రాంతంలో ఏ ఒక్క రైతుకు చుక్క నీరు అందించని ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. భారీ బడ్జెట్‌తో నిర్మించామని గొప్పలు చెప్పుకున్నారని మూడు పిల్లర్లు కుంగిపోయి ప్రాజెక్టు ఉనికికే ప్రమాదం ఏర్పడిందని, ఈ పాపం గత పాలకులు, ప్రభుత్వానిది కాదా అని ఆయన ప్రశ్నించారు.

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంఏర్పాడ్డాకే కరెంట్ కోతలుఉన్నాయనిబదనాం చేస్తున్నారని, విద్యుత్ కొరత లేకుండా ఉండేందుకు గత ప్రభుత్వ ం ఫిబ్రవరి, మార్చ్ మాసాల్లో వినియోగించిన కరెంటు కంటే ఎనిమిది శాతం అధికంగా కరెంటు కొనుగోలు చేసి మరీ సరఫరా చేస్తున్నామని ఆయన వివరించారు.

ప్రకృతి వైపరీత్యాలతో కొంత పంట నష్టం జరిగిందని, నిజంగా నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఎన్నికల తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతామని, ఆరు గ్యారెంటీల్లో ప్రతి పథకానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తామని ఆయన స్పష్టం చేశారు. అలాగే ఐదేండ్ల లోపు ప్రతిపాక రిజర్వాయర్ పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు విజయ రమణరావు, ఠాకూర్ మక్కాన్ సింగ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం

మంగళవారం, ఏప్రిల్ 02

# ప్రతిపక్షంపై 'పన్ను టెర్రరిజం'

ఎన్నికల్లో ప్రతిపక్షపార్టీల అవకాశాలను దెబ్బతీసి తమ అధికారాన్ని పదిలం చేసుకునేందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం ఎంపిక చేసుకున్న ప్రతిపక్ష నాయకులపై ఇడి, సిబిఐ, ఐటి వంటి కేంద్ర సంస్థలను ప్రయోగించి వారిని బెదిరించటం, బాధించటం, లొంగదీసుకోవటం కొన్ని సంవత్సరాలుగా సాగుతున్న వ్యవహారం. ఇప్పుడు ఏకంగా రాజకీయ పార్టీలపై ఆదాయపుపన్ను ఎగవేత పేరుతో ఐటిశాఖ, 'పన్ను టెర్రరిజానికి' పాల్పడుతున్నది. లోక్‌సభ ఎన్నికల తరుణంలోనే ప్రధాన ప్రతిపక్షపార్టీ అయిన కాంగ్రెస్‌పై అటువంటి దాడికి ఒడిగట్టటం దాని ఆర్థిక వెసులుబాటును దెబ్బతీయటమే కదా! కాంగ్రెస్ పార్టీ గత పన్ను రిటర్న్‌లను తిరగతోడి ఏకంగా దాని బ్యాంక్ ఖాతాలు స్తంభింపజేసి వాటినుంచి రూ.135కోట్లు జమచేసుకోవటం దాని ఆర్థిక రెక్కలను కూల్చటమే కాదా? అంతేనా వివిధ సంవత్సరాల రిటర్న్‌లను పునఃమదింపుచేసి అసలు, వడ్డీలు, పెనాల్టీలు వెరసి మొత్తం రూ.3500 కోట్లకు నోటీసులు పంపి దిమ్మ తిరిగినంత పనిచేసింది. దీనిపై కాంగ్రెస్ సుప్రీంకోర్టుకు వెళ్లగా, ఎన్నికలు ముగిసే వరకూ జులై 24 వరకు, ఆ సొమ్ము వసూలుకు నిర్బంధపు చర్యలేమీ ఐటి శాఖ తీసుకోదని దాని తరఫు న్యాయవాదులు సోమవారం ధర్మాసనానికి తెలియచేయటమే ప్రస్తుతానికి కాంగ్రెస్‌కు లభించిన ఊరట! అంతేకాదు, కార్యకర్తలు, సభ్యులు, సానుభూతిపరులనుంచి విరాళాల వసూళ్లపై ఆధారపడి పార్టీని నడుపుకునే భారత కమ్యూనిస్టుపార్టీకి కూడా రూ.11కోట్ల పన్ను చెల్లింపునకై ఐటి శాఖ నోటీసు జారీ చేసిందట. పాత పాన్ కార్డు ఉపయోగించటంవల్ల ఈ తేడా వచ్చిందట. సాంకేతికలోపాన్ని సరిదిద్దుకునే అవకాశం ఇచ్చేబదులు ఏకంగా పన్ను డిమాండ్ నోటీసు ఇవ్వటం సమంజసమా?

బిజెపికి వేలకోట్ల రూపాయల ఆదాయమున్నా దాని లెక్కల జోలికి ఆదాయపు పన్ను శాఖ పోదు. అక్రమమైన ఎన్నికల బాండ్ల రూపంలో కార్పొరేట్ రంగంనుండి అదిరించి బెదిరించి వసూలు చేసిన డబ్బుకు తోడు ప్రైవేటు వసూళ్లతో నగదు మూలుగుతోంది. అందువల్ల అది ప్రచారంపై విరివిగా ఖర్చు చేయగలుగుతోంది. స్థానికంగా అభ్యర్థులు వెచ్చించే భారీ మొత్తాలకు ఇది అదనం. ఎన్నికల తేదీల ప్రకటనవరకు ప్రధానమంత్రి పర్యటనలు, 'వికసిత్ భారత్' పేరుతో సర్వ ప్రచార మాధ్యమాల ద్వారా గావించిన ప్రచార వ్యయభారం ప్రభుత్వ ఖాతాలోకే. ప్రతిపక్షపార్టీలు ఎలా పోటీపడగలవు. ఎన్నికల కమిషన్ ఎన్నికల్లో అన్ని పక్షాలకు సమాన స్థాయి క్షేత్రం కల్పించటం అనేది వినసొంపుగా వుంటుందిగాని ఆచరణలో అగాధం ఎప్పుడూ ఉంది. ఎన్నికల్లో అభ్యర్థులు చేసే ఖర్చుకు మాటమాత్రంగానైనా పరిమితి ఉన్నా రాజకీయపార్టీ చేసే ఖర్చుకు అవధులు లేవు. అభ్యర్థులు సమర్పించేవి దొంగలెక్కలనీ తెలిసినా ఇసి చేయగలిగింది లేదు. ఎన్నికల్లో డబ్బు ప్రభావం తగ్గించే చర్యలగూర్చి ఎన్ని కమిటీలు ఎన్ని సిఫార్సులు చేసినా వాటిని ప్రభుత్వాలు అటకెక్కించాయి. ప్రాంతీయ,కుల–మత ప్రభావాలతోపాటు ధనప్రవాహం, ప్రభావం వాటి తలదన్నుతుంది. ప్రజాస్వామ్య ప్రక్రియగూర్చి మనం ఎంత గొప్పగా చెప్పుకుంటున్నా ఎన్నికల ప్రజాస్వామ్యం వక్రీకరణ పొందుతున్నది. ఎన్నికల్లో పారదర్శకత్వ మరీ ముఖ్యం. ఓటింగ్ యంత్రాలను తొలగించి బ్యాలెట్ పద్ధతికి తిరిగి వెళ్లాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నా అధికారంలో ఉన్న పార్టీ సాంకేతిక కారణాలతో అంగీకరించదు.

ఎన్ని లోపాలున్నా మనది అతిపెద్ద ప్రజాస్వామ్యం. ఇదొక పెద్ద పండగ. అయితే అన్ని రాజకీయ పక్షాలకు సమానస్థాయి అవకాశాలు ముఖ్యం. ప్రస్తుత ఆర్థిక టెర్రరిజంవల్ల ప్రతిపక్ష కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంపై ఏమీ వెచ్చించలేని నిస్సహాయతలోకి నెట్టివేయబడింది. ఐటి శాఖ కోర్టుకు హామీ ఇచ్చినట్లు ఎన్నికల తదుపరి వరకు బలవంతపెట్టే చర్యలు తీసుకోకపోవటమే కాదు, కాంగ్రెస్ పార్టీ తమ బ్యాంక్ ఖాతాల్లోని డబ్బును ఉపయోగించుకునే అవకాశం కల్పించాలి.

# అవగాహనతోనే ఆటిజం అంతం

ప్రపంచంలో సుమారు 7 కోట్ల యాభై లక్షల మంది ఆటిజం వ్యాధితో బాధపడుతున్నారు అని నివేదికలు చెబుతున్నాయి. ఈ ఆటిజం వ్యాధిపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి 2008 నుంచి ఏప్రిల్ 2వ తేదీన ' ఆటిజం అంతర్జాతీయ అవగాహన దినోత్సవం' నిర్వహిస్తున్నారు. ప్రపంచంలో ఖతార్, బ్రిటన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో ఆటిజం బాధితులు ఎక్కువగా ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. అమెరికాలో ప్రతీ వంద మందికి ఒక ఆటిజం వ్యాధిగ్రస్తుడు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఫ్రాన్స్, జర్మనీ, ఐస్ లాండ నార్వే వంటి దేశాల్లో ఆటిజం బాధితులు తక్కువగా ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇక మన భారతదేశంలో ఒక కోటి యనభై లక్షల మంది అనగా దాదాపు 2 కోట్ల మంది ఆటిజంతో బాధపడుతున్నారు అని నివేదికలు చెబుతున్నాయి. ఈ ఆటిజం బాధితుల వివిధ సమస్యలు పరిష్కారం కోసం, అవగాహన కల్పించుట నిమిత్తం ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు ఏప్రిల్ 2వ తేదీన ప్రతీ సంవత్సరం వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు..




అసలు ఆటిజం అంటే చిన్నతనంలోనే సంభవించే దీర్ఘకాలిక మానసిక అనారోగ్యం. దీనిని మూడు సంవత్సరాల వయసులోనే గుర్తించవచ్చు. ఎదుగుదల లోపం, ఒంటరిగా ఉండటం, హైపర్ ఏక్టివ్ నెస్, భాషా, వినికిడి లోపం వంటి సమస్యలతో బాధపడుతూ ఉంటారు. ఆడపిల్లల కంటే మగపిల్లల్లో మూడు రెట్లు అధికంగా ఈ ఆటిజంతో బాధపడుతున్నారు అని తెలిపారు. మన భారతదేశంలో ప్రతీ 68 మందిలో ఒకరికి ఈ ఆటిజం వ్యాధితో బాధపడుతున్నారు. ఆటిజం వ్యాధికి ప్రధాన కారణాలు జన్యుపరమైన సమస్యలు, మేనరికం వివాహాలు, తల్లికి మానసిక అనారోగ్యం, ఒత్తిడి, డిప్రెషన్, గర్భిణీ సమయంలో విటమిన్ డి, ఫోలిక్ యాసిడ్ లోపం, అధికంగా రసాయనాలు వాడిన పదార్థాలు తినడం వల్ల ఈ ఆటిజం సమస్యలు సంభవిస్తాయి అని వైద్యులు చెబుతున్నారు. అందరూ జాగ్రత్తలు తీసుకోవాలి.

ఇటువంటి పరిస్థితుల్లో ఆటిజం మరియు దీంతో సంబంధించిన అనేక అనారోగ్యాలు నుంచి బయట పడాలంటే 'సమాచార నైపుణ్యాలే (కమ్యునికేషన్ స్కిల్స్)' కీలకం అని వైద్యులు చెబుతున్నారు. బిహేవియర్ థెరపీ, స్పీచ్ థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, స్పెషల్ ఎడ్యుకేషన్, ఒకేషనల్ ట్రయినింగ్ వంటి ద్వారా ఆటిజం రుగ్మతలు నివారించడానికి వీలవుతుంది. వీరికి ఉపయోగపడే పరి కరాలు ప్రభుత్వా లు, స్వచ్ఛంద సంస్థలు సమకూర్చాలి. విద్యా, ఉద్యోగాల్లో రాయితీలు కల్పించాలి. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. యోగా, ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడి డిప్రెషన్ నుంచి బయట పడాలి. గర్భిణీ స్త్రీలు పోషకాహారం తీసుకోవాలి. యవ్వన కాలంలోనే వివాహం చేసుకోవాలి. దగ్గర, రక్త సంబంధీకులతో వివాహాలు మానుకోవాలి. ఈ 2024లో 'ద కలర్ బ్లూ' థీమ్‌తో ఈ దినోత్సవం జరుపుతూ, ఆటిజం బాధితులకు మెరుగైన వైద్యం, అవగాహన కల్పించుట జరుగుతుంది. ముఖ్యంగా పౌరసమాజం అంతా ఆటిజం వ్యాధితో బాధపడుతున్న వారందరికీ తగు రీతిలో ఆదరణ అందించటమే ఈ దినోత్సవ ప్రాముఖ్యత.

# ప్రజాస్వామ్య ఉత్సవం అంటే ఇదేనా?

ప్రపంచాన్ని ఆకర్షించిన ప్రజాస్వామ్య ఉత్సవం "లోక్‌సభ ఎన్నికలు" అని భారత ఎన్నికల సంఘం ప్రవచించింది. నూటికినూరు శాతం ఇది నిఖార్సయిన సత్యం. ఈ 18వ లోక్‌సభ ఎన్నికలను వీక్షించేందుకు, పరిశీలించేందుకు అనేకమంది ప్రజాస్వామ్యవాదులు, ప్రముఖులు, రాజనీతిజ్ఞులు భారతదేశంలో పర్యటిస్తున్నారు. దీనిని 'ఎలక్షన్ టూరిజం'గా కేంద్రప్రభుత్వం అభివర్ణించింది. ప్రపంచంలో ముఖ్యంగా ఆసియాలో అతిపెద్ద రెండవదేశంగా ఉన్న భారత్‌లో ఎన్నికల ఉత్సవం ఈసారి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అందుకనుగుణంగానే సుమారు 30,000మంది విదేశీ ప్రముఖులు భారతదేశానికి చేరుకున్నారు. ఈ సంఖ్య ఇంకా పెరగవచ్చుకూడా. ఇది కేంద్ర పర్యాటకశాఖకు, అతిథేయరంగానికి ప్రయోజనకరమైనదే. ఎందుకంటే 17వ లోక్‌సభ ఎన్నికలలో కేవలం 10,000మంది మాత్రమే ప్రముఖులు భారతదేశంలో పర్యటించారు. ఈసారి ఈ ప్రాధాన్యత పెరగటానికి అనేక కారణాలున్నాయి. మనదేశ ప్రజాస్వామ్యాన్ని చాలా చిన్నచిన్న దేశాలు నమూనాగా భావిస్తున్నాయి. ఇది ఒక సామాజిక ప్రయోగశాల. 140కోట్ల జనాభాలో 97కోట్లమంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించటానికి సిద్ధంగా ఉన్నారు. ఉరకలెత్తే ఉడుకురక్తపు యువతరం సంఖ్యవాటా చాలా అధికం. గోప్యతతో మౌనంగా శాఖోపశాఖలుగా విస్తరిస్తున్న చైనాను మినహాయిస్తే ఆర్భాటపు అమెరికా తరువాత ప్రపంచ ప్రజాస్వామ్య వ్యవస్థలో భారతదేశానిదే కీలకపాత్ర. మరి ఎన్నోదేశాలు మనల్ని నమూనాగా భావిస్తున్నప్పుడు మనదేశంలో అంతర్గత పరిస్థితులు ఎలాఉన్నాయి అనేది మనచుట్టూ ఉన్న దేశాలన్నీ డేగకళ్లతో పరిశీలిస్తున్నాయి.



18వ లోక్‌సభ ఎన్నికలు 75ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో అత్యంత కీలకమైనవి. స్వాతంత్ర్యపోరాటం తరువాత మొట్టమొదటిసారి స్పష్టమైన రెండు శిబిరాలమధ్య ఒక మహాయుద్ధానికి తెరలేచింది. దేశ చరిత్రను మలుపుతిప్పే ఎన్నికలివి. నెహ్రూ కుటుంబ పరిపాలన తరహా ప్రజాస్వామ్యం తరువాత జరిగిన సంఘర్షణలోంచి సంకీర్ణ ప్రభుత్వ శకం ప్రారంభమైంది. ఈ సంకీర్ణ ప్రభుత్వ ప్రయోగం అనుభవాలతో రాటుదేలింది. ఈ దశలోనే మతోన్మాదశక్తులు పడగవిప్పాయి. సిద్ధహస్తులైన లౌకిక, ప్రజాస్వామ్య అభ్యుదయ సైద్ధాంతిక వేత్తలు ఏనాడో హెచ్చరించిన విధంగా దేశంలో ప్రజాస్వామ్య ప్రయాణంలో జరిగిన తీవ్రమైన తప్పిదాల కారణంగా మెజారిటీ మతోన్మాదం విజృంభించింది. ఈ సమకాలీన సమాజంలో జర్మనీసహా పలుదేశాల్లో ఈ మితవాదశక్తులు జూలువిప్పి తాండవం చేస్తున్నాయి. భారత కమ్యూనిస్టుపార్టీ హెచ్చరిస్తున్న విధంగానే మనదేశ ప్రజాస్వామ్యంలో అపరిపక్వత, పేదరికం, నిరుద్యోగం, అవినీతి నిర్మూలనలో ఏర్పడిన లోపాలు, ఆయారాం–గయారాంల రాజకీయాలకే ప్రాముఖ్యత సరిదిద్దలేని సమస్యగా మారింది. వీటినే మతోన్మాదశక్తులు తమకనుకూలంగా కొత్తరూపంలో కొనసాగిస్తున్నాయి. ప్రజలను మభ్యపెట్టటం, అవినీతికి రాజముద్రవేయటం, ఆయారాం – గయారాంలను పెంచిపోషించటమే ఒక ఎన్నికల ప్రక్రియనుంచి మరో ఎన్నికల ప్రక్రియవరకు నిరంతరాయంగా కొనసాగటానికి తోడుగా మైనారిటీ మతస్థులను బాహాటంగా అణచివేయటం, వేలాదిమంది త్యాగాలతో నిర్మించిన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వ్యవస్థను నీరుగార్చేందుకు ప్రయత్నించటం కీలకఅంశాలుగా తెరమీదకు రావటంతో ప్రపంచ ప్రజాస్వామ్యవాదులలో ఆసక్తి పెరిగిం ది. అందుకే గతంకంటే ఈనాడు ఎలక్షన్ టూరిజానికి అత్యధిక ప్రాముఖ్యత ఏర్పడింది. రాజనీతిజ్ఞుల అంచనా ప్రకారం ప్రజాస్వామ్య భారతావనిలో విదేశీ జోక్యం పెరిగింది. పరిపాలనా వ్యవస్థలో బలహీనతలు, లోపాలు ఉన్నప్పుడు ఆ లోపాలు బాహ్యప్రపంచంమీద కూడా తీవ్ర ప్రభావం చూపిస్తున్నప్పుడు దేశ పాలనలో విదేశీ జోక్యం పెరుగుతుంది. లౌకిక ప్రజాస్వామ్య భావజాలంతో పరిపాలన సాగినంత కాలం విదేశీజోక్యం ప్రత్యక్షంగా భారత్‌పై ప్రభావం చూపించలేదు. బిజెపిరూపంలోని హిందుత్వ శక్తులు అధికార స్థానాల్లోకి ఎగబాకి, బలపడి రెండు విడతలు పరిపాలన పూర్తిచేశాక ఈ ఎన్నికలవేళ వెనక్కితిరిగి పరిశీలిస్తే దేశ భవిష్యత్తు అగమ్యగోచరంగా కనిపిస్తోంది.

అంకెలగారడీలు, తప్పుడు లెక్కలు, తిమ్మినిబమ్మిని చేసే తకరాలు, తంత్రాలు, ప్రజల మధ్య 'బరిగీతలు' గీసి వీధిపోరాటాలకు సిద్ధం చేసే ఘర్షణాత్మక ఆలోచనలు అవలోకమవుతున్నాయి.

అరబ్ ప్రపంచాన్ని ఆగ్రహానికి గురిచేసిన నుపూర్ శర్మ, మణిపూర్‌లో నిరుపేద మహిళలను నగ్నంగా వీధుల్లో తిప్పుతూ వరుస అత్యాచారాలు చేస్తూ రావణాకాష్టానికి తెరతీసిన బిరేన్‌సింగ్, కర్నాటక విద్యాలయాల్లో ఏకరూప దుస్తుల పేరుతో చిచ్చురేపిన నాటి బిజెపి ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై , అన్నంపెట్టే రైతులపై కక్షకట్టి తన కొడుకు(ఆశిష్‌మిశ్రా)తో హత్యచేయించిన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి అజయ్ మిశ్రా తేని, మహిళా మల్లయోధులవెంట విదేశాలకు వెళ్లి లైంగిక వేధింపులకు గురిచేసి దేశ క్రీడారంగానికి మాయని మచ్చ తెచ్చిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్, కేంద్ర దర్యాప్తు సంస్థలను అడ్డంపెట్టుకుని మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడి ప్రభుత్వాన్ని కుప్పకూల్చి, శాసనసభా వ్యవస్థను రచ్చకీడ్చి అపహాస్యం పాలుచేసిన ఏక్‌నాథ్ షిండే, దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్‌ల దుష్టకూటమి, గుజరాత్‌లో బిల్కిస్ బానో పై సామూహిక అత్యాచారం చేసిన 11మంది దోషులను పవిత్రమైన స్వాతంత్ర్య దినోత్సవంనాడు అడ్డతోవన విడుదలచేసిన బిజెపి ఉన్మాద ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, 'ఇండియా: ది మోడీ క్వశ్చన్' బిబిసి డాక్యుమెంటరీని అప్రజాస్వామ్యబద్ధంగా అణచివేయటంతో ప్రపంచవ్యాప్తంగా చెలరేగిన వివాదం, 370వ అధికరణ రద్దు, ఎన్నికల ప్రయోజనాలకోసం సంధించిన అస్త్రం పౌరసత్వసవరణ చట్టం అమలు, ఉమ్మడి పౌరస్మృతి ... ఇలా లెక్కకు మిక్కిలిగా దేశ పరువుప్రతిష్టలను భ్రష్టుపట్టించిన కాషాయ సైనికుల నిర్వాకాలు, చట్టాలు వంటివన్నీ ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదుల దృష్టిలో పడ్డాయి. అన్నింటికంటే ముఖ్యంగా దేశంలో పౌరహక్కుల అణచివేత, సాక్షాత్తు దేశ అత్యున్నత చట్టసభల్లో ప్రజాస్వామ్య మౌలిక ఆభరణమైన అసమ్మతి గళాన్ని వినిపించే రాజ్యాంగ హక్కుల అణచివేత భారతదేశ పరువు ప్రతిష్టలకు తీవ్ర భంగకరంగా మారాయి. దేశ రాజ్యాంగ పునాదులను కదిలించివేశాయి. మోడీ ప్రభుత్వ విధానాలు అల్లకల్లోలం రేపుతున్నాయి.

## ప్రత్యామ్నాయం ఎవరు?

తాను తప్ప దేశానికి ప్రత్యామ్నాయం లేదని మోడీ గాండ్రిస్తున్నారు. ఇది వాస్తవమేనా? ప్రతిపక్షాల మెడమీద కత్తిపెట్టి పాయింట్ బ్లాంక్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఇన్‌కంటాక్స్ డిపార్టుమెంట్, సిబిఐ దర్యాప్తు సంస్థలు పిస్తోలు గురిపెట్టి నిలబెడితే మోడీ ఒక్కడే ఎన్నికల గ్రౌండ్‌లో నిలబడి పరుగుపందేనికి బయలుదేరినట్టు సామాజిక మాధ్యమాలు వ్యంగ్యచిత్రాలు ప్రదర్శిస్తున్నాయి. ఈ సత్యావిష్కరణ ప్రజాస్వామ్య పరిశీలకుల దృష్టిలో ఉంది. ఈ ఎన్నికలలో కొత్తగా తెరమీదకు వచ్చిన పదం 'మోడీ వాషింగ్ పౌడర్'. అవినీతిపరులకు క్లీన్‌చిట్ ఇవ్వటం తనలో కలిపేసుకోవటం, దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనతను బయటపడేసిన అదానీ అవినీతి వ్యవహారంలో అతగాడికి సంపూర్ణ రక్షణ ఇచ్చి తిరిగి అతడి సంపద పెరిగేందుకు సహాయకారి కావటం కాషాయకూటమి ఆర్థిక అవినీతికి చిహ్నాలు. చట్టం ముసుగులో 8,500కోట్ల రూపాయలు ఎన్నికల బాండ్ల ద్వారా సమకూర్చుకోవటం దేశ చరిత్రలో ఎన్నడూలేని అవినీతి చర్యలకు తార్కాణం. దీనిపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు జరగాలని ప్రతిపక్షాలు, ఎన్నికల సంస్కరణలకోసం పోరాడుతున్న అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్ డిమాండ్ చేస్తున్నాయి. వీటిని మోడీ కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన వ్యవహారంగా భారత లోక్‌సభ ఎన్నికలు మారిపోయాయి. నిజాయితీపరులకు, ప్రజాస్వామ్య లౌకికవాదులకు తావులేకుండా లోక్‌సభ నియోజకవర్గాల్లో ధనరాజకీయాలు నడుస్తున్నాయి. భారత్‌కు పరిశీలకులుగా వచ్చిన వేలాదిమంది విదేశీ ప్రజాస్వామ్యవాదులు, హక్కుల ఉద్యమ నాయకులు, రాజనీతిజ్ఞుల మాటల్లో చెప్పాలంటే భారత ప్రజాస్వామ్యం కత్తిమీద సాము చేస్తోంది. ఈ 18వ లోక్‌సభ ఎన్నికలు పాలకులను ఎన్నుకునే ప్రజలకు అసిధారావ్రతంగా మారింది. ఈనాడు ఎన్నికల ఖర్చు అనధికారికంగా రికార్డుస్థాయిలో రూ.1.2 ట్రిలియన్లు దాటిపోతుందని ముందస్తు అధ్యయనాలు చెబుతున్నాయి. నేర చరిత్రగల అభ్యర్థులు సహా పాలక పార్టీలన్నీ ప్రజలను ప్రలోభపెట్టి అవినీతిపరులుగా మారుస్తున్నాయి. మన ప్రజాస్వామ్యం 2024 క్రోధి నామ సంవత్సరంలో అత్యంత ప్రమాదంలో పడింది.


## ఇది సైద్ధాంతిక పోరాటం

18వ లోక్‌సభ ఎన్నికలు దేశానికి అత్యంత ప్రతిష్టాత్మకం. ఎందుకంటే ఇప్పుడు జరుగుతున్నది సైద్ధాంతిక పోరాటం. కాషాయ మత శక్తులకు, లౌకిక ప్రజాస్వామ్య శక్తులకు మధ్య ప్రత్యక్ష పోరాటం. ఈ పోరాటంలో "ఇండియా కూటమి" చాలా స్పష్టమైన ఎజండాతో ఉంది. నితీష్‌కుమార్ లాంటి ఆషాఢభూతులు, చంద్రబాబునాయుడులాంటి అవకాశవాదులు, టిఆర్ఎస్ లాంటి భూస్వామ్య నియంతృత్వశక్తులు, దేశ ప్రయోజనాలగురించి మాట్లాడటం లేదు. దేశం లో అసమానతలు గతం కంటే ఘోరంగా పెరిగాయని అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాలకు విలువ ఇవ్వడం లేదు. పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి జాబితాలో రాష్ట్రాల అధికారాలను కేంద్రం కబళిస్తున్నది. రాజ్యాంగానికి ఆత్మలాంటి 21వ అధికరణను కేంద్రప్రభుత్వం చెరబట్టింది. పౌరుల సర్వోన్నత స్వేచ్ఛకు తీవ్ర భంగం వాటిల్లింది. దారిద్ర్యం 5శాతంకంటే తక్కువస్థాయికి తగ్గిపోయిందని పచ్చి అబద్ధాలు చెలామణిలోకి వచ్చాయి. మేకిన్ ఇండియా దేశ స్వయంసమృద్ధి నినాదం చతికిలపడింది. ద్రవ్యలోటు అనూహ్యంగా పెరిగింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వంటనూనెలు, పప్పుదినుసుల ఉత్పత్తుల పంట విస్తీర్ణం పెరగలేదు. గడచిన పదేళ్లుగా వ్యవసాయ శాస్త్రవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. సాగు ఖర్చు గుదిబండగా మారి చిన్నసన్నకారు రైతులు కాడి వదిలేస్తున్నారు. విద్య, వైద్యరంగాలు, నైపుణ్యం అథమస్థాయికి దిగజారుతున్నాయి. కోర్ సెక్టార్‌లో వృద్ధి నానాటికీ దిగజారిపోతున్నది. రాష్ట్రాలకి రావలసిన వాటాలు చెల్లించకుండా కేంద్రప్రభుత్వ పథకాల భారాలు నెత్తిన పడేయటంతో వెసులుబాటులేక కేరళ వంటి రాష్ట్రాలు న్యాయస్థానాలను ఆశ్రయించి ఉత్తర్వులు తెచ్చుకోవలసి వస్తున్నది. మార్చి 23వ తేదీ నాటికి రికార్డు స్థాయిలో డాలరుతో రూపాయి మారక విలువ 83.4250 స్థాయికి దిగజారింది. ఇన్ని ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ మోడీ 400 సీట్లు గెలుస్తామని ధీమాతో ఉన్నారు. ఈ ధీమాకు కారణమేమిటి? ఆలోచిస్తే 'పథకం ప్రకారం కాషాయకూటమి చేసే వక్రభాష్యం' కారణం. భావోద్వేగాలను మోడీ నమ్ముకున్నారు. చాలా రాష్ట్రాలలో ఎన్‌డిఎ అతి బలహీనంగా ఉంది. ఒంటరిగా మారింది. ప్రతిపక్షాలు స్వేచ్ఛగా ఎన్నికలలో పోటీచేసే వాతావరణాన్ని కూడా మోడీ తిరస్కరిస్తున్నారు. ప్రజలు వీటిని అర్థం చేసుకుంటున్నారు. నిరుద్యోగ సమస్య ఇప్పుడు ఎన్నికలలో ప్రధాన ఎజండాగా ముందుకు వచ్చింది. ఈ సమస్యలన్నీ మోడీకి సంకటంగా మారక తప్పదు. దేశంలో ప్రజాస్వామ్యం నేతిబీరకాయలో నెయ్యిగా మారింది.

తారా

# ముదురుతున్న ఎండలు.. ఎండుతున్న సరస్సులు

తెలంగాణ రాష్ట్రంలో ఎండలు ముదురుతున్నాయి. ఫలితంగా అన్ని ప్రధాన రిజర్వాయర్లలో నీటిమట్టం గణనీయంగా పడిపోతున్నది. రాష్ట్రంలో కొనసాగుతున్న రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు సాగు నీరు అందించడానికి తీవ్రమైన కొరత నెలకొంటున్నది. తాగునీటి ఎద్దడి కూడా ముంచుకొస్తున్నది. రాష్ట్ర వ్యవసాయ శాఖ నివేదికను అనుసరించి, ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం కారణంగా రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి. గత ఏడాది అక్టోబర్ నుండి డిసెంబరు వరకు ఈశాన్య రుతుపవనాల సగటు సాధారణ వర్షపాతం 113.20 మిల్లీ మీటర్లు. కానీ వాస్తవ వర్షపాతం 52.70 మిల్లీ మీటర్లు . అంటే వర్షపాతం లోటు 53.45 శాతం. చలికాలంలో, అంటే ఈ ఏడాది జనవరి నుండి ఫిబ్రవరి వరకు సాధారణ వర్షపాతం 12 మిల్లీమీటర్ల నుండి 90.83 శాతం విచలనంతో కేవలం 1.1 మిల్లీ మీటర్లు మాత్రమే. ఇక ఈ ఏడాది మార్చి నుంచి మే మధ్య కాలాన్ని ఎండాకాలంగా పేర్కొంటారు. ఈ సమయంలో సాధారణ వర్షపాతం 3.9 మిల్లీ మీటర్లు ఉండాలి, కానీ ఇప్పటివరకు 0.2 మిల్లీ మీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఫలితంగా కృష్ణా బేసిన్‌లోని జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, శ్రీపాదసాగర్, నిజాంసాగర్, మిడ్ మానేరు, దిగువ మానేరు, కడెం దాదాపు అన్ని ప్రధాన రిజర్వాయర్లలో నీటి మట్టాలు బాగా తగ్గాయి. ప్రస్తుతం మిలియన్ క్యూబిక్ అడుగుల (టిఎంసిలు) నీటి మట్టం మాత్రమే ఉంది. శ్రీశైలంలో మొత్తం సామర్థ్యం 215.8 టిఎంసిలకుగాను 34.65 టిఎంసిల నీటి లభ్యత మాత్రమే ఉంది. గోదావరి బేసిన్‌లోని శ్రీపాద సాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్టులో మొత్తం సామర్థ్యం 20.175 టిఎంసిలకుగాను 8.15 టిఎంసిల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. మార్చి చివరి నాటికి అన్ని ప్రధాన రిజర్వాయర్లలో సంచిత నిల్వ 287.06 టిఎంసిలు. గత సంవత్సరం ఇదే రోజున 432.13 టిఎంసిలతో పోలిస్తే ఇది చాలా తక్కువ. కాగా, మేడిగడ్డ బ్యారేజీకి తీవ్ర నష్టం వాటిల్లడం, గోదావరి నదిపై కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఇంజినీరింగ్ లోపాల వల్ల ఈ బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయలేక పోవడంతో నిపుణులను రంగంలోకి దించక తప్పలేదు. దీనితో ఈ సీజన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు కింద పంటలకు సాగునీటి సౌకర్యం కరువైంది. గత వర్షాకాలంలో శ్రీపాదసాగర్ ఎల్లంపల్లి జలాశయం, మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యామ్‌లకు నీరు వచ్చినా గోదావరి బేసిన్‌లో నీటి లభ్యత దాదాపుగా లేదు. ఈ పరిస్థితుల్లో రైతులు భూగర్భ జలాల సాగుపైనే ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది, దీంతో భూగర్భజలాలు కూడా క్షీణించాయి. వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం, రాష్ట్రంలో సగటు భూగర్భ జలమట్టం ఫిబ్రవరి 2023లో 7.34 అడుగుల నుండి ఫిబ్రవరి 24నాటికి 8.70 అడుగులకు పడిపోయింది. రైతులు ఎప్పటిలాగే ఎక్కువ నీరు వినియోగించే వరి, మొక్కజొన్న వంటి పంటలను విత్తుకునేందుకు వెళ్లారు. వరి సాధారణ పంట విస్తీర్ణం 4.05 మిలియన్ ఎకరాలకు వ్యతిరేకంగా, రైతులు 5.13 మిలియన్ ఎకరాల్లో వరిని సాగు చేశారు, అయితే గత రబీ సీజన్‌లో 5.64 మిలియన్ ఎకరాలతో పోలిస్తే ఇది తక్కువ విస్తీర్ణం. సాగునీటి కష్టాలు ఇలావుంటే, తాగు నీటి సంక్షోభం కూడా ముంచుకొస్తున్నది. అనేక





సరస్సుల్లో నీటి మట్టాలు తక్కువగా ఉండటం, వర్షాభావ పరిస్థితుల కారణంగా తెలంగాణ వ్యాప్తంగా ఇప్పటికే తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో మిషన్ భగీరథ (ప్రతి ఇంటికి పైపుల ద్వారా నీటి సరఫరా) ద్వారా సరిపడా సరఫరా లేకపోవడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. కరీంనగర్‌లో రెండు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. అయితే అధికారులు ఆకస్మిక ప్రణాళికలు రూపొందిస్తున్నందున భయపడాల్సిన అవసరం లేదని ప్రభుత్వం భరోసా ఇస్తున్నప్పటికీ, ప్రజల్లో మాత్రం భయాందోళనలు తగ్గడం లేదు. ఇక రాష్ట్ర రాజధాని హైదరాబాదులో, శివార్లలోని ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాలు పౌరుల రక్షణకు వచ్చాయి, కృష్ణా, గోదావరి బేసిన్ కింద ఉన్న రిజర్వాయర్లు ఎండిపోతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్ నుండి తగినంత నీటి సరఫరా కారణంగా నగరానికి తాగునీటి వనరులు నిలిచిపోతాయని గత బిఆర్ఎస్ ప్రభుత్వం చెప్పిన రెండు రిజర్వాయర్లు ఇవి. ఈ రిజర్వాయర్లకు 10 కిలోమీటర్ల పరిధిలో అన్ని రకాల నిర్మాణాలను నిరోధించే ప్రభుత్వ ఉత్తర్వును కూడా గత ప్రభుత్వం రద్దు చేసింది. మొత్తం మీద చెరువులు, కుంటలు, బావుల పూడ్చివేతలు... ఆక్రమణలు.. అక్రమ నిర్మాణా లు.. మితిమీరిన పట్టణీకరణ.. వర్షం నీరు భూమిలోకి ఇంకడానికిగానీ, సరస్సుల్లోకి చేరడానికిగానీ సరైన మార్గాలు లేకపోవడం వంటి ఎన్నో కారణాలు నీటి సమస్యను పెంచుతున్నాయి. దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్తులో ఎక్కడ చూసినా నెర్రలుబారిన పొలాలు... ఎండిన గొంతులే దర్శనమిస్తాయి.

# చిన్నారుల్లో సృజనాత్మకత పెరగాలంటే.. పుస్తక పఠనం తప్పనిసరి


'నేటి బాలలే రేపటి పౌరులు' కాబట్టి నేటి బాలలు అన్ని రంగాల్లో అంటే 'శారీరకంగా, మానసికంగా' అభివృద్ధి చెందేలా చూడాల్సిన బాధ్యత మనదే. నేటి చిన్నారి బాలలకు చదువుతోపాటు ఆటపాటలపై, 'పుస్తక పఠనం' పై ప్రత్యేక ఇష్టం కలిగేలా తయారు చేయవల్సిన బాధ్యత మన మీద ఉంది. ఆటలు శారీరక వికాసాన్ని, పుస్తకాలు చదవడం వారిలో ఉన్న 'సృజనాత్మకత'ను వెలికితీయడానికి ఉపయోగ పడతాయి. పుస్తక పఠనం చేయగల పిల్లలు చదువులో కూడా ముందుంటారనీ అందరికీ తెలిసిందే. అందుకోసం బాలల సాహిత్యాన్ని చదవడానికి ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పిల్లల్లో పుస్తకాలు చదివే అలవాటును ప్రోత్సహించడంలో భాగంగా ప్రతి సంవత్సరం 'ఏప్రిల్ 2వ' తేదీన 'అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని'జరుపుకుంటారు. డెన్మార్క్‌కు చెందిన ప్రఖ్యాత బాల సాహిత్య రచయిత 'హాన్స్ క్రిస్టియన్ అండర్సన్' జయంతి సందర్భంగా ఈ ఉత్సవాన్ని జరుపుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా పిల్లలను అమితంగా ఆకర్షించిన 'ది లిటిల్ మర్మెయిడ్, 'ది అగ్లీ డక్లింగ్' పుస్తకాలను రాసి పిల్లలకు చాలా ఇష్టమైన వాడిగా మారాడు. 'హాన్స్ క్రిస్టియన్ అండర్సన్' పై అభిమానంతో 1967 నుంచి 'ఇంటర్నేషనల్ బోర్డ్ ఆన్ బుక్స్ ఫర్ యంగ్ పీపుల్' అనే స్వచ్ఛంద సంస్థ బాలల పుస్తక దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. మొదట స్విట్జర్లాండ్ దేశంలో ఈ ఉత్సవం ప్రారంభం అయినప్పటికీ ఇప్పుడు 80కి పైగా దేశాల్లో నిర్వహిస్తున్నారు. మన దేశంలో కూడా బాల సాహిత్యం కొరకు పూర్వ కాలం నుండి కూడా ప్రత్యేక కథలు ఉన్నట్టు మనం గుర్తించవచ్చు. అందుకు మంచి ఉదాహరణగా 'పంచతంత్రం' చెప్పవచ్చు. విద్యా బుద్ధులతో, ఆటపాటలతో ఆనందంగా సాగే బాల్య దశ ప్రతి మనిషి జీవితంలో మరపురాని మధురస్మృతిగా ఉండాలంటే చిన్ననాటి నుండే మంచి అలవాట్లు నేర్పుతూ ఉండాలి. చిన్నారులు, బొమ్మలతో కూడిన కథల పుస్తకాలను చదవడానికి ఎక్కువ ఇష్టపడతారు. పుస్తకాలు చదవడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగడమే కాక భాష పరిజ్ఞానం, భాష మీద ఆసక్తి పెరుగుతు ఏకాగ్రతని కూడా పెంచుతుంది. దీనివల్ల ఊహాశక్తి పెరుగుతుంది. విద్యార్థుల సమగ్ర వికాసానికి పాఠ్యాంశాల బోధనతోపాటు వారిలో ఉన్న సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీయడానికి బాల సాహిత్య పఠనాభిరుచి పెంపొందించడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయవలసిన అవసరం ఉన్నది. పిల్లల సృజనాత్మక అంశాలకు సంబంధించి కథలు, కవితలు, పద్యాలు, వ్యాసాలు లాంటి వాటిపై రచనలు చేయిస్తూ ఉండడం కూడా ఒక మంచి ప్రయత్నం. మనం ఎంతగా అభివృద్ధి చెందినా, పుస్తకాలు లేని సమాజాన్ని ఊహించలేం. పుస్తకం 'హస్తభూషణం' కాబట్టి ఎప్పుడూ పిల్లల చేతిలో ఏదో ఒక పుస్తకం ఉండేలా చూద్దాం. నేటి బాలలే రేపటి పౌరులు. వాళ్ళకు సరైన దిశానిర్దేశం కోసం సంస్కారంతో పాటు సాహిత్యం దోహదపడుతుంది. పిల్లల కోసం ప్రత్యేక పుస్తకాలు ముద్రించడం, పంపిణీ చేయడం లాంటి బాధ్యతను నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా, సాహిత్య అకాడమీల వంటి జాతీయ సంస్థలు మరికొన్ని స్వచ్ఛంద సంస్థలు ఈ మధ్య కాలం లో చేస్తున్నాయి. పాఠశాలల్లో బాలల గ్రంథాలయాలను ఏర్పా టు చేసుకొని, ప్రతి విద్యార్థి చదివేలా ప్రోత్సహించాలి. చిన్నారులకు ప్రతి సందర్భంలో 'పుస్తకాలను' బహుమతిగా ఇచ్చి, చదివించేలా ప్రోత్సహించాలి.

గడప రఘుపతిరావు, 9963499282

# మందులు కొనడం కష్టమే!

కొత్త ఆర్థిక సంవత్సరం వచ్చింది. సామాన్యుడిని మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టే కొత్తకొత్త నిబంధనలను, మార్పులను తీసుకొచ్చింది. వాటిలో ప్రధానమైనది ఔషధాల ధర. యాంటిబయాటిక్స్ నుంచి పెయిన్ కిల్లర్స్ వరకూ ఏ మందు కొనాలన్నా కష్టంగా మారుతున్నది. డిక్లోఫెనాక్, ఇబుప్రోఫెన్, మెఫె నామిక్ యాసిడ్, పారాసెట్మోల్, మార్ఫిన్ వంటి పెయిన్ కిల్లర్స్ ఖరీదు పెరిగింది. అదే విధంగా అమికాసిన్, బెడాక్విలిన్, క్లారిథ్రోమైసిన్ వంటి యాంటీ టిబి మందు లు, క్లోబాజమ్, డయాజెపామ్, లోరాజెపామ్ వంటి యాంటీకాన్వల్సెంట్స్ ధర లు సైతం సగటు మనిషికి అందుబాటులో లేకుం డా పోతున్నాయి. ఫోలిక్ యాసిడ్, ఐరన్ సుక్రోజ్, హైడ్రాక్సోకోబాలమిన్ వంటి రక్తహీనత మందులు, ఫ్లూనారిజైన్, ప్రొప్రానోలోల్, డోనెపెజిల్, అబాకవిర్, లామివుడిన్, జిడోవుడిన్, ఎఫావిరెంజ్, నెవిరాపైన్, రాల్టెగ్రావిర్, డోలుటెగ్రావిర్, రిటోనావిర్, క్లోట్రిమాజోల్, ఫ్లూకోనజోల్, ముపిరోసిన్, నైస్టాటిన్, టెర్బినాఫిన్ తదితర మందుల ధరలకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రెక్కలు వచ్చాయి. వీటితో పాటు డిలిటాజెమ్, మెటోప్రొలోల్, డిగోక్సిన్, వెరాప్రమిల్, అమ్లోడిపైన్, రామిప్రిల్, టెల్మిసార్టెన్ వంటి



హృదయనాళ మందులు, ఆర్టెసునేట్, ఆర్టెమెథ ర్, క్లోరోక్విన్, క్లిండమైసిన్, క్వినై న్, ప్రిమాక్విన్ వంటి మలేరియా కు వాడే మందులు, 5 ఫ్లోరోరాసిల్, ఆక్టినోమైసిన్‌డి, ఆల్‌ట్రాన్స్ రెటినోయిక్ ఆమ్లం, ఆర్సెనిక్ ట్రైఆక్సైడ్, కాల్షి యం ఫోలినేట్ వంటి కేన్సర్ చికిత్స మందులు, క్లోరోహెక్సిడిన్, ఇథైల్ ఆల్కహాల్, హైడ్రోజన్ పెరాక్సైడ్, పోవిడిన్ అయోడిన్, పొటాషియం పర్మాంగనేట్ వంటి క్రిమినాశక మందులేగాక, సాధారణ మత్తుమందులు, హాలో థేన్, ఐసోఫ్లురేన్, కెటమైన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి ఆక్సిజన్ ఔషధాలపైనా ధరల పెంపు ప్రభావం పడనుంది. మొత్తం మీద ఇకపై ఏది కొనాలన్నా కష్టమే.

## వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా కడియం కావ్య



**న్యూఢిల్లీ :** వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా కడియం కావ్య పేరును ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఈ మేరకు ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఓ ప్రకటన విడుదల చేశారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య ఆదివారం కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. సిఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ వారికి కండువా కప్పి ఆహ్వానించారు. అంతకుముందు కడియం కావ్యకు బిఆర్‌ఎస్ వరంగల్ లోక్‌సభ టికెట్ ఇవ్వగా.. ఆ పార్టీ నుంచి పోటీ చేసే ఉద్దేశం తనకు లేదంటూ ఆమె నిరాకరించారు. తెలంగాణలోని మొత్తం 17 లోక్‌సభ స్థానాలకుగానూ కాంగ్రెస్ ఇప్పటి వరకు 14 నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించింది. హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్ స్థానాలకు ఇంకా అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది.

## 8,9 తరగతులకు ఉదయమే పరీక్షలు నిర్వహించాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క పూట బడులు నిర్వహిస్తున్న నేపథ్యంలో సమ్మెటివ్ అసైన్మెంట్ 8,9 తరగతులకు మధ్యాహ్నం కాకుండా ఉదయమే పరీక్షలు నిర్వహించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో స్టేట్ స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ సెక్రటరీ మదన్‌మోహన్‌ను కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మ ణ్ మాట్లాడుతూ మధ్యాహ్నం పరీక్షలు నిర్వహించడం ద్వారా విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఈ కార్యక్రంలో ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ , రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే నిరుపేదల అభివృద్ధి

### ఎంఎల్ఎ వీర్లపల్లి శంకర్




**ప్రజాపక్షం/కేశంపేట:** కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాల నిరుపేదలు అభివృద్ధి చెందారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కేశంపేట మండలంలోని లేమామిడి బిఆర్‌ఎస్ నాయకుడు కావలి వెంకటేష్ ఆధ్వర్యంలో సుమారు 30 మంది నాయకులు, కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద వర్గాలకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే పార్టీ జెండాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూడ వీరేష్, నాయకులు ప్రకాష్‌గౌడ్, సుందరయ్య, లక్ష్మ య్య, రఘుపతి, శ్రీనాథ్‌లతో కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

**ప్రజాపక్షం/కొత్తూరు**: అక్రమంగా తరలిస్తున్న గోవులను పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి కొత్తూరు మున్సిపాలిటిలో నిలిచి ఉన్న కంటైనర్‌ను స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో పోలీసులు రంగంలోని దిగి విచారణ మొదలు పెట్టగా విజయవాడ నుండి హైదారాబాద్‌కు తరలిస్తుండగా కొత్తూరు మున్సిపాలిటిలో తెలిసిన వ్యక్తులు ఉండటంతో వారి వద్దకు కంటైనర్ వచ్చింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కంటైనర్ తెరిచి చూడటంతో అందులో 80నుండి 90వరకు గోవులు ఉన్నట్లు తెలిపారు. ఆర్యసమాజ్ తెలంగాణ అధ్యక్షుడు దీఫక్ సింగ్‌తోపాటు యువకులు తమ దృష్టికి తీసుకువచ్చి రక్షించడం ఎంతో అభినందనీయమని పోలీసులు తెలిపారు. కంటైనర్‌తోపాటు యువకులను ఆదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు వివరించారు.

## ఓటుహక్కు నమోదుపై అవగాహన




**ప్రజాపక్షం/కొత్తూరు:** ఓటు హక్కు నమోదుపై ప్రజలందరు అవగాహన పెంచుకోవాలని కొత్తూరు మున్సిపల్ కమీషనర్ బాలాజీ సూచించారు. సోమవారం కొత్తూరు మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో ఓటు హక్కు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ బాలాజీ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఓటర్ జాబితాలో ఏమైన తప్పులు ఉంటే సరి చేసుకొవడంతోపాటు నూతన ఓటర్ నమోదుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఓటు నమోదు చేసుకునే కరపత్రాలను వార్డుల్లో ప్రజలకు పంపిణీ చేశారు. నూతన ఓటర్లతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మున్సిపల్ సానిటేషన్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** బార్ అసోసియేషన్‌కు సంబంధించిన అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు నూతన అధ్యక్షుడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ రాజు వివరించారు. సోమవారం షాద్‌నగర్ కోర్టు సముదాయంలో నూతనంగా ఎన్నికైన బార్ అసోసియోషన్ అధ్యక్షుడు రాజశేఖర్ రాజుతోపాటు నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు ఘనంగా పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రాజు మాట్లాడుతూ న్యాయవాదులు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాము సిద్దంగా ఉన్నట్లు వివరించారు. నూతనంగా ఎన్నికైన అసోసియోషన్ కార్యవర్గాన్ని న్యాయవాదులు కంచి రాజగోపాల్, ఎంప కరీంఖాన్, జగన్మోహన్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, వేణుగోపాల్‌రావు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

**నూతన కార్యవర్గం :** షాద్‌నగర్ బార్ అసోసియోషన్ అధ్యక్షుడిగా రాజశేఖర్ రాజు, ఉపాధ్యక్షులుగా టి.శ్రీనివాస్ యాదవ్, విజయభాస్కర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీధర్, సంయుక్త కార్యదర్శిగా సిహెచ్ మధుసూదన్‌రావు, నరేంద్రనాథ్, ట్రెజరర్‌గా రాఘవేంద్రచారి, లైబ్రేరియన్‌గా లక్ష్మ య్య, మహిళా అధ్యక్షురాలిగా జయమ్మ, కార్యవర్గ సభ్యులుగా డి.శంకర్, కె.శివకుమార్‌యారిలు ఎన్నికయ్యారు.

## ఓటుశాతం పెంచేందుకు ర్యాలీ




**ప్రజాపక్షం/ నార్సింగి:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఓట్ల శాతం పెంచేందుకు ఓటరుగా నమోదు ఓటరు అవగాహన కార్యక్రమం ర్యాలీనిశంషాబాద్ మున్సిపల్ కమిషనర్ బి సుమన్ రావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ శంషాబాద్ మున్సిపల్ ఆఫీస్ నుండి బస్టాండ్ అంబేద్కర్ స్టాచ్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం స్విఫ్ ఆక్టివిటీ నోడల్ అధికారి బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు ఓటర్ అవగాహన పెంచుదామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ మున్సిపల్ కార్పొరేష న్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య , ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ అనిల్ కు మార్, పారిశుద్ధ్య కార్మికులు ,నగర దీపికలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## కేశంపేటలో చలివేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/కేశంపేట:** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కేశంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం కాంగ్రెస్ నాయకుడు పల్లె ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పల్లె పద్మమ్మవెంకటయ్యల జ్ఞాపకార్థం వారి కుమారుడు, కాంగ్రెస్ నాయకుడు పల్లె ఆనంద్‌కుమార్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. గత 10 సంవత్సరాలుగా ఆనంద్‌కుమార్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి అందజేస్తున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శ్రీధర్‌రెడ్డి, రాజు, కాంగ్రెస్ నాయకులు అనసూయమ్మ, మల్లేష్ గౌడ్, సంతోష్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

# మంచినీళ్లివ్వండి మహాప్రభో

### జలమండలి కార్యాలయాన్ని ముట్టడించిన మహిళలు

### ట్యాంకర్‌కు రూ.2వేలు ఇచ్చి మేమెలా బతికేదని మేనేజర్‌ను నిలదీసిన మహిళలు



**ప్రజాపక్షం/రాజేంద్రనగర్ :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 1వ వార్డులోని వెంకటేశ్వర నగర్ కాలనీలో గత పన్నెండు ఏళ్లుగా మంచినీరు లేక నరకం చవి చూస్తున్నాం.... రోజు కూలీ నాలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాం.. .ఒక ట్యాంకర్‌కు 2వేలు చొప్పున రెండు ట్యాంకర్లకు నెలకు 4వేలు ఏలా చెల్లించి కొనుకుంటాం....సారూ...ఇప్పటికైన మాకు మంచినీళ్లు ఇవ్వండి మహాప్రభో అంటూ మహిళలంతా సోమవారం బండ్లగూడ చౌరస్తాలోని హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సేవరేజ్ బోర్డు కిస్మత్‌పూర్ సెక్షన్ మేనేజర్ కార్యాలయాన్ని ముట్టడించారు. స్థానిక కార్పొరేటర్ తలారి చంద్ర శేఖర్‌తో కలిసి మహిళలంతా మేనేజర్ టీ.శ్రీనివాస్‌కు తమ గోడంతా వెల్లబోసుకున్నారు.ఈసందర్భంగా కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల క్రితం 1వ వార్డులోని బైరాగి గూడలో కోట్లాది రూపాయలు వెచ్చించి మిషన్ భగిరథ కింద ట్యాంకును నిర్మాణం చేశారు. కానీ తూతూ మంత్రంగా పనుల పూర్తి కాక ముందే గత ఎన్నికలకు ముందు ఆగామేఘాల మీద ఎన్నికల కోడ్ వస్తుందనే ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అక్టోబర్ 19న ట్యాంకర్‌ను ప్రారంభించారన్నారు. ట్యాంకు నిర్మాణం పూర్తి చేసిన అధికారులు ఎంఎల్ఎ ఒత్తిడితో మంచినీటి సరఫరా కనెక్షన్ ఇవ్వకుండానే ట్యాంక్‌లోకి చుక్క నీరు రాకుండానే ఎన్నికలల్లో ఓట్లు పొంది గెలుపొందాలనే ప్రారంభించారన్నారు. గత ఆరు మాసాల క్రితం ట్యాంకు ప్రారంభమైన ఇంత వరకు ట్యాంక్‌లోకి చుక్కనీరు కూడా రాలేదు.ప్రజల దాహార్థి తీరలేదు.కాని మళ్లి ఎన్నికల కోడ్ వచ్చిన పేదలకు మంచినీరు అందలేదని కార్పొరేటర్ అధికారులపై తీవ్రంగా మండిపడ్డారు. అనంతరం కాలనీ అధ్య క్షులు తలారి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయిన వెంటనే స్థానికులతో కలిసి జలమండలి అధికారులను ప్రశ్నిస్తే జనవరి వరకు పైప్‌లైన్ పనులు పూర్తవుతాయని వెంటనే మీకు నీటి సరఫరా అవుతందని హామీ ఇచ్చారన్నారు. ఇందుకు స్పందించిన మేనేజర్ మరో రెండు నెలల వరకు ఓపిక పట్టండి మీకు మంచినీటి తప్పని సరిగా అందిస్తామని హామి ఇవ్వగా అందుకు మహిళలంతా రెండు నెలలకు మా కాలనీకి మంచినీరు అందిస్తామని హామీ ఇస్తు రాతపూర్వకంగా రాసి ఇవ్వాలని పట్టుబట్టారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర నగర్ కాలనీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్,స్థానికలు కృష్ణ సాగర్,సైదులు,నాగిరెడ్డి,కోటేశ్వరి,వజ్ర,కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య రాకుండా చర్యలు

### జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రతిమాసింగ్

### యాచారం, గున్‌గల్ గ్రామాల్లో ఆకస్మిక పర్యటన



**ప్రజాపక్షం/యాచారం :** వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. సోమవారం యాచారం మండల పరిధిలోని గున్‌గల్, యాచారం, గాండ్లగూడ గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు సకాలంలో కురవక పోవడంతో భూగర్భజలాలు అడుగంటి పోయాయి. చెరువు కుంటలని ఎండి ఎండిపోయాయని అన్నారు. గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితులున్నాయన్నారు. అందుకు అనుగుణంగా ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్రాగునీరు అందించే బోరు మోటార్లు ఎండి పోతె గ్రామ పంచాయతి నుండి ప్రత్యేకంగా తాగునిటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలరు. మే నెలలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందన్నారు. మిషన్ భగీరథ కింద కట్టిన వాటర్ టాంకులు, పైప్‌లైన్‌లు ఏ విధంగా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. నర్సరీలు ఎండి పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. గాండ్ల గూడ గ్రామ ప్రజలు కేవలం కృష్టా వాటర్‌పైననే అధారపడి ఉన్నారు. ఆ నీరు బందయితే ఇబ్బంది అవుతుందన్నారు. ప్రత్యామ్నాయంగా కళాశాల అవరణలో ఉన్న బోరును వాడుకోవాలని ఆమె సూచించారు. అనంతరం డిపిఒ అయా గ్రామా పంచాయతీల్లో పంచాయతి రికార్డులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా డిపిఒ సురేశ్ మోహన్,డిఎల్‌పిఒ సాధన, అర్‌డబ్యూస్ డిఈ అనిరుధ్, ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి, ఎంపిఒ ఉమారాణి, అర్‌డబ్యూస్ ఎఈ రజిత పంచాయతి కార్యదర్శులు తిరుపతయ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే కెసిఆర్ అబద్ధపు ప్రచారం

### టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ అబద్ధపు ప్రచారంతో అప్రతిష్ట పాలు చేసేందుకు కెసిఆర్ పొలంబాట పేరిట కొత్త నాటకానికి తెరలేపాడని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విమర్శించారు. గాంధీ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎక్కడా విద్యుత్ కొతల కారణంగా గుంట భూమి కూడా ఎండిపోలేదన్నారు. అధికారం లేకపోయేసరికి కెసిఆర్‌కు రైతులు గుర్తుకు రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో ఖమ్మంలో మిర్చి రైతులకు బేడీలు వేసిన సంగతి ఇంకా రైతులు మరిచిపోలేదన్నారు. జనగామలో 190 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, పంటలు ఎండిపోతే, కొనుగోలు కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారో కెసిఆర్ తెలుసుకోవాలన్నారు. 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, కెసిఆర్ అవాస్తవాలు చెబుతున్నారని అన్నారు. గత ప్రభుత్వం కంటే ఇపుడే విద్యుత్ సరఫరా బాగున్నదని, 24 గంటల విద్యుత్ అంతటా ఇస్తున్నామని, ఎక్కడైనా రాలేదని కెసిఆర్ నిరూపిస్తారా అని ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే కెసిఆర్ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాడని విమర్శించారు.

## అనుమతి లేని ప్రాజెక్టులలో కొనుగోలు చేయొద్దు

### తెలంగాణ స్టేట్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లలో ప్రీ లాంచ్ కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ స్టేట్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ( టిఎస్ రేరా ) సోమవా రం విడుదల చేసిన ఒక ప్రకటనలో హెచ్చరించింది. ప్రీ లాంచింగ్‌తో పాటు రేరా నిబంధనలు ఉల్లఘించిన 27 ప్రాజెక్టలకు నోటీసులు జారీ చేసింది. రూ. 21 కోట్ల అపరాధ రుసుము విధించింది. బిల్డాక్స్ కంపెనీకి గుండ్ల పోచంపల్లిలో భువి, వాసవి ప్రాజెక్ట్‌కు మాత్రమే రేరా రిజిస్ట్రేషన్ ఉంది. మిగతా చోట్ల ఈ కంపెనీకి ఎలాంటి అనుమతులు లేనందున ఇందులో ఎవరు కొనుగోలు చేయవద్దు అని ప్రజలకు సూచించింది.

## రాజేంద్ర నగర్ సర్కిల్‌లో వేర్వేరు చోట్ల రెండు భారీ అగ్ని ప్రమాదాలు

**ప్రజాపక్షం/రాజేంద్రనగర్:** జిహెచ్‌ఎంసీ రాజేంద్ర నగర్ సర్కిల్ 11 పరిధిలో రెండు వేర్వేరు చోట్ల భారీ ఆగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అయితే ఈ ప్రమాదంలో ఏలాంటి ప్రాణనష్టం జరగలేదు కాని ఆస్థి నష్టం సంభవించింది. ఈ ఘటనలు సోమవారం తెల్లవారు జామున అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అత్తాపూర్ రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న అట్టపెట్టేల గోదాంలో భారీ ఆగ్ని ప్రమాదం చోటు చేసుకోగా మైలార్‌దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం టాటా నగర్ కాటన్ బెడ్ గోదాంలో మంటలు చేలరేగాయి. పూర్తి వివరాలు పోలీసులు,స్థానికలు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. అత్తాపూర్ రింగ్ రోడ్డు సమీపంలో కార్డు బోర్డు స్క్రాపు అట్టపెట్టెల గోదాంలో తెల్లవారు జామున ఆకస్మత్తుగా చేలరేగిన మంటలు చేలరేగాయి. దీన్ని గమనించిన స్థానికులు వెంటనే అత్తాపూర్ పోలీసులకు,ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా పోలీసులు వెంటనే రెండు ఫైరింజన్‌లతో హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే స్థానికంగా దట్టంగా పొగలు కమ్ముకోవడంతో ఒక్కసారిగా అక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గుర్తైయ్యారు. అనంతరం రెండు ఫైరింజన్‌లు మంటల ను అదుపు చేశాయి. విద్యుత్ షాట్ సర్క్యూట్ కారణంగా అకస్మాత్తుగా మంటలు చేలరేగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సుమారు రూ. 7లక్షల వరకు ఆస్థినష్టం వాటిల్లినట్లు పోలీసులు అంచనా వేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మరో సంఘటనలో...** మైలార్‌దేవ్‌పల్లి టాటా నగర్‌లో కాటన్ బెడ్ కంపెనీలో సోమవారం ఉదయం భారీ ఆగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో స్థానికులు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు,ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిని ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అతి తక్కువ సమయంలోనే అంతమయ్యే పార్టీ బిఆర్‌ఎస్

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎద్దేవా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో రాష్ట్రంలో అతి తక్కువ సమయంలోనే అంతమయ్యే పార్టీ బిఆర్‌ఎస్ అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బిఅర్‌ఎస్ అవశ్యకత లేదన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెటిఆర్‌పైన జాలి చూపాలని, ఆయన సిఎం అవుతానని కన్న కలలు విఫలమయ్యాయని, అందుకే కెటిఆర్ ఏదైనా మాట్లాడుతారన్నారు. తండ్రి, కొడుకుల చేతిలో తెలంగాణ ప్రజలు దోపిడీకి గురయ్యారన్నారు. ప్రధాన మంత్రి మోడీ చేసిన కార్యక్రమాలనే బిజెపి ఎన్నికల ఏజెండాగా ప్రచారం చేస్తామన్నారు. 34 లక్షల కోట్ల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. బిజెపి అధికారం చేపట్టనప్పటి నుంచి దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న సంస్కరణలతో విద్యుత్ ను సరిసరిగా దేశ వ్యాప్తంగా 22గంటలు అందిస్తున్నామని వివరించారు. ఎన్నికల్లో గెలిచేందుకు ఉచితాలు ఇవ్వడం వంటి ఆలోచనల నుంచి బయటపడి, దీర్ఘకాలంలో ఆర్థికంగా, సామాజికంగా లాభాన్ని చేకూర్చేలా కార్యక్రమాలను రూపొందించామన్నారు. గత పదేళ్లలో భారతదేశం గణనీయమైన ప్రగతిని సాధించిందని కిషన్ రెడ్డి తెలిపారు.

## రైతుల ఆత్మహత్యలకు గత ప్రభుత్వ వైఫల్యమే కారణం

### తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు శ్రీహరి రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొత్త ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకొన్నారంటే అది ముమ్మాటికీ గత ప్రభుత్వ వైఫల్యమే అని తెలంగాణ రైతు రక్షణ సమితి(టిఆర్‌ఎస్) అధ్యక్షులు పాకాల శ్రీహరి రావు అన్నారు. గత 25 సంవత్సరాలకు పైగా రాష్ట్రంలో అత్మాహత్య చేసుకున్నా అనేక కుటుంబాలను తాము పరమార్శించి, వారికి ప్రభుత్వం తరపున అందాల్సిన సహకారం వందలాది మందికి అందించగలిగామని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. వడగండ్ల వానలతో పంట నష్టం జరుగగానే, రాష్ట్రంలో రైతులు కానీ, రైతు సంఘాలు కానీ, నష్ట పరిహారం రైతులకు అందించాలని పెద్ద ఎత్తున ఉద్యమించక ముందే కొత్త ప్రభుత్వం విపత్తుల నిధుల నుంచి ఎకరా పంట నష్టానికి రూ. 9000 నష్టపరిహారం ఇయ్యవచ్చని, విధి విధానాలు ఉన్నప్పటికీ బాధిత రైతు కుటుంబాలకు మరింత అండగా ఉండాలని తనకు తానుగా ఎకరా పంట నష్టానికి రూ. 10000 చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించిందన్నారు. ఇందుకుగాను రాష్ట్ర రైతుల తరుపున రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రైతు రక్షణ సమితి కృతజ్ఞతలు తెలుపుతుందన్నారు. పంట నష్టం జరిగినందున మానవతా ధృక్పథంతో రాష్ట్రంలో ఎండిన పంటలకు కూడా పరిహారం వెంటనే ప్రకటించాలన్నారు. అధికారుల ద్వారా పంట నష్టం వివరాలను నమోదు చేసే కార్యక్రమం ప్రారంభించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## జలమండలిలో 16 మంది ఉద్యోగులు పదవీ విరమణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జీవితంలో పదవీ విరమణ అనేది ఒక ముఖ్యమైన ఘట్టమని జలమండలి ఎం.డి. సుదర్శన్ రెడ్డి అన్నారు. జలమండలి పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు జనరల్ మేనేజర్‌లతో సహా 16 మంది ఉద్యోగులకు పదవీవిరమణ కార్యక్రమం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ సమయంలో అందులోనూ జలమండలి లాంటి అత్యవసర సేవల విభాగంలో పనిచేసిన వారికి సొంత వారితో సమయం గడిపే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. ఉద్యోగ రీత్యా కుటుంబ సభ్యులతో గడపలేని వాళ్లు, రిటైర్‌మెంట్ తర్వాత ఆ లోటును పూడ్చుకోవచ్చన్నారు. భవిష్యత్తులో మరింత సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. పదవీవిరమణ పొందిన వారిని అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. పదవీవిరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, ఆపరేషన్స్ డైరెక్టర్స్ స్వామి, విజయ రావు, సిజిఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జిఎం సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



# విధులపట్ల అప్రమత్తం

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ప్రిసైడింగ్ అధికారులు అన్ని విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల విధులు పూర్తి అవగాహనతో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా,రీపోలింగ్‌కు అస్కారం లేకుండా విధులు నిర్వర్తించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక అన్నారు. సోమవారం పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో విధులు నిర్వహించే రాజేందర్ నగర్ నియోజకవర్గ సిబ్బందికి సోమవారం రాజేందర్ నగర్ మండలం, శివరాం పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, శేరిలింగంపల్లి నియోజకవర్గ సిబ్బందికి మాధాపూర్ శ్రీ వేంకటేశ్వర గ్రూప్ ఆఫ్ కాలేజ్ లో ప్రిసైడింగ్ అధికారులు (పి.ఒ ), సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ శశాంక పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారులు (పి.ఒ ), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఎ.పి.ఒ) ఎన్నికల రోజున విధులను నిర్వర్తించడంపై జిల్లా కలెక్టర్ శశాంక పలు సూచనలు,సలహాలు చేశారు.పి ఒ డైరీ,17 సి పై పూర్తి అవగాహన చేసుకోవాలన్నారు. పోలింగ్ రోజున అవసరమ్యే కవర్ లో సరైన సమాచారాన్ని నమోదు చేయాలని చెప్పారు.పోలింగ్ ప్రారంభానికి ముందే ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి వివిప్యాట్ లలో ఉండే స్లిప్‌లను ప్రత్యేక కవర్ లో ఉంచాలన్నారు.ఇవిఎం,వివి ప్యాట్ లపై పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. పిలు ఏమాత్రం కంగారు పడకుండా విధులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శశాంక స్పష్టం చేశారు.పోలింగ్ అధికారులు ముందుగానే అన్ని విషయాలను తెలుసుకుని ఉంటే విధులను సక్రమంగా నిర్వర్తించగలరని భరోసా కల్పించారు.పోలింగ్ అధికారే పోలింగ్ స్టేషన్ కి ముఖ్య అధికారి అని, పోలింగ్‌కి ముందు రోజు, పోలింగ్ రోజు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రిసైడింగ్ అధికారులు (పి.ఒ ), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఎ.పి.ఒ .) పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగం కొరకు ఫామ్ 12ని తప్పనిసరిగా నింపి సమర్పించాలని అన్నారు.పిఒ లు,ఎపిఒ లకు మూడు సార్లు శిక్షణ తరగతులు ఉంటాయని జిల్లా కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. ఈశిక్షణకార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు,సహాయ ప్రిసైడింగ్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు,రాజేందర్ నగర్ ఎఆర్‌ఒ వెంకట రెడ్డి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

**పోస్టల్ బ్యాలెట్ కోసం సకాలంలో ఫారం-12(డి) సమర్పించాలి**

పోస్టల్ బ్యాలెట్ కోసం అవకాశం కలిగి ఉండి, దానిని వినియోగించదల్చిన వారు ఈ నెల (ఏప్రిల్) 20వ తేదీ లోపు నిర్ణీత ఫారం12(డి) పూరించి సంబంధిత శాఖల నోడల్ అధికారుల ద్వారా నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేయాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ శశాంక సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో అత్యవసర సేవల పరిధిలోకి వచ్చే వివిధ శాఖల నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ కె.శశాంక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అత్యవసర సర్వీసులకు చెందిన వారికి ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తోందని అన్నారు. ఎన్నికల కమిషన్ ద్వారా మీడియా పాసులు కలిగిన జర్నలిస్టులకు కూడా ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎలక్షన్ కమిషన్ వెసులుబాటు కల్పించిందని అన్నారు.

## ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయం




ప్రజాపక్షం/శామీర్‌పేట : ప్రజల దాహార్తి తీర్చడానికి చలి వేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అలియాబాద్ మాజీసర్పంచ్ కమతం కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ ప్రధాన చౌరస్తాలో శ్రీరామ అటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమృత చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గాదె వెంకటేష్, ఆటో యూనియన్ అధ్యక్షుడు గొలుసుల కరుణాకర్, మాజి అద్యక్షుడు యాదగిరి, శ్రీనివాస్, చిరంజివి తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులతో మతసామరస్యం : స్పీకర్



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ నియోజకవర్గంలోని ముస్లింలకు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని చిగుళ్లపల్లి గ్రౌండ్‌లో స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులతో మతసామరస్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ఎమ్మెల్యే రమోహన్‌రెడ్డి, ఎంపి రంజిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ముస్లీం సోదరులు పాల్గొన్నారు.

## గోశాల అభివృద్ధికి కృషి చేస్తా

పట్లోళ్ళ బాల్‌రెడ్డి







ప్రజాపక్షం/తాండూరు: తాండూరులోని గోశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని గోశాల సేవా సమితి నూతన అధ్యక్షులు పట్లోళ్ళ బాల్‌రెడ్డి తెలిపారు. గోశాల సేవా సమితి నూతన అధ్యక్షులుగా పట్లోళ్ళ బాల్‌రెడ్డిని, కార్యవర్గాన్ని గత నెలలో ఎకగ్రీవంగా ఎన్నుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు సోమవారం గోశాలలో బాల్‌రెడ్డి గోశాల సేవా సమితి నూతన అధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేశారు. ముందుకు గోశాలలోని గోవులకు కుటుంబ సమేతంగా వేద పండితుల మంత్రోచ్చరణల మద్య పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అందరి సహకారంతో గోశాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. గోశాలకు మంచి పేరు ప్రతిష్టను మరింత పెంచుతామని తెలిపారు.గోశాలలో గోవుల సంరక్షణ కోసం దాతలు ఎవ్వరైన ముందుకు వచ్చి పశుగ్రాసం, ఇతర దానాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రధాన కార్యదర్శి కోట్రిక కిరణ్, కోశాధికారి మన్మోహన్ సార్డా, కౌన్సిలర్ నీరాజబాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం గోశాల సేవా సమితి సభ్యుల ఘన సన్మానించారు. గోశాల సేవా సమితి నూతన అధ్యక్షులు పట్లోళ్ళ బాల్‌రెడ్డిని కార్యవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆర్‌ఒబిఎల్ సీఈఒ బియ్యని శ్రీనివాస్‌రెడ్డి శాలువ కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో పాటు పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం సభ్యులు గోశాల సేవా సమితి సభ్యులను ఘనంగా సన్మానించారు.

## ధాన్యం విక్రయాల్లో దళారులను ఆశ్రయించవద్దు

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



ప్రజాపక్షం/బొమ్మరాస్‌పేట్ : బొమ్మరాస్‌పేట్ మండలం నాగిరెడ్డి పల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహించే వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ప్రారంభించారు. జిల్లాలో 122 వరి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 8 మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా ,మిగతా మండలాల్లో ఏప్రిల్ 4న పూర్తిస్థాయిలో కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఆయన పేరొన్నారు. రబీ 2023–24 సంవత్సరానికి గాను 1,93,350 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వచ్చే అంచనా నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రేడ్ వన్ ధాన్యానికి 2203 రూపాయలు కాగా. సామాన్య వరికి 2183 రూపాయల మద్దతు ధరను పొందవలసిందిగా అదనపు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుగుణ బాయి రాజేశ్వర్, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఈటలను గెలిపించాలి



ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి: మల్కాజ్‌గిరి పార్లమెంటు బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బిజెపి సీనియర్ నేత మోహన్ యాదవ్ కోరారు. సోమవారం మౌలాలీ డివిజన్ పరిధిలోని బూత్ నెంబర్ 262,265 పరిధిలోని హనుమాన్ నగర్‌లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మోడీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన ఓటర్లను కోరారు. మల్కాజ్‌గిరిలో ఈటలను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోహన్ యాదవ్, మనోజ్, మహేష్ యాదవ్, రాజు, మధు, శ్రవణ్, వేణు, సతీష్, ధనరాజ్, గణేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగ సందర్భంగా నిత్యావసర వస్తువులు అందజేత

ప్రజాపక్షం/ వికారాబాద్ ప్రతినిధి : రంజాన్ పవిత్ర మసాన్ని పురష్కరించుకోని ముస్లిం సోదరులు ఉపవాస ప్రార్థనల్లో పాల్గొంటారు. ప్రతి ఒక్కరూ అరోగ్యంగా, ఆర్థిక ఇబ్బందులు లేకుండా రంజాన్ పండగను జరుపుకోవాలని శివరెడ్డి పేట్‌కు చేందిన వ్యాపారవేత్త ఇక్బాల్ పౌష్టిక అహారానికి సంబందించిన సామగ్రిని పంపిణి చేశారు ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ రంజాన్ పండగను సుఖసంతోషలతో జరుపుకోవాలన్నారు. 14వందల మంది ముస్లింలకు 10 రకాల నిత్యావసర వస్తువులు అందజేయడం జరిగింది వారు తెలిపారు.

## ప్రమాదంలో హెల్పర్ మృతి

ప్రజాపక్షం/ఫేట్ బషీరాబాద్ : దూలపల్లి పారిశ్రామిక ప్రాంతంలో సోమవారం క్రేన్ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో క్రేన్ హెల్పర్ ఓం ప్రకాష్ మహతో తండ్రి రాజ్ కిషోర్ మహతో వయస్సు 49 సంవత్సరాలు మరణించాడు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బహదూర్‌పూర్, ఎక్మా, సరన్, ఏకం, బీహార్ రాష్ట్రం క్రేన్ ఆపరేటర్‌కు యంత్రాన్ని నడపడానికి సహాయం చేస్తోంది. క్రేన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా క్రేన్‌ను ఆపరేట్ చేయడంతో క్రేన్ నుండి బెల్ట్ అన్‌లాక్ చేయబడి ఓంప్రకాష్‌కు ఇనుప హుక్ తగిలింది. దీంతో అతనికి తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో ఓం ప్రకాష్ స్థానికంగా ఉన్నఆసుపత్రికి తరలించారు. అక్కడ అతను చనిపోయినట్లు ప్రకటించారు. సూపర్‌వైజర్, క్రేన్ ఆపరేటర్‌లు కార్మికునికి భద్రత కల్పించడంలో విఫలమయ్యారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇవిఎంల పనితీరుపై అవగాహన ఉండాలి

వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :పోలింగ్ ప్రక్రియలో నిర్వహించే విధులు, ఇవిఎం యంత్రాల పనితీరుపై ఎన్నికల సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి కోరారు. అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్స్, జిల్లా లెవల్ మాస్టర్ ట్రైనర్స్‌కు సోమవారం జరిగిన శిక్షణ శిబిరంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణలో భాగంగా శిక్షణ పోలింగ్ రోజు నిర్వహించే విధుల పట్ల ఎన్నికల సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివిప్యాట్లను పోలింగ్ కేంద్రాలలో అమర్చడం, మాక్ పోలింగ్ నిర్వహణపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. మొత్తం పోలింగ్ సామాగ్రిని సేకరించుకోవాలని, ఫారములు, కవర్స్ మెటీరియల్ ఇవిఎం యంత్రాలలో క్లోజ్, రిజట్లు, క్లియర్ వ్యవస్థాలపై వీవీప్యాట్లలో 7 సెకన్లలో వచ్చే స్లిప్స్‌పై అవగాహన పెంచుకోవాలని, ఓటింగ్ గోప్యత నిబంధనలు తెలుసుకోవాలన్నారు. పోలింగ్ సందర్భంలో వచ్చే టెండర్ ఓటు, ఛాలెంజ్ ఓటు, టెస్టు ఓట్లపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత కంట్రోల్ యూనిట్‌లో క్లోజ్ బటన్ పోలింగ్ ఏజెంట్లు ముందర చేసి డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. పిఓ డైరీ 17సిసిలో పోలింగ్ వివరాలు ఎలాంటి తప్పులు లేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వివరాలు ఇవ్వాలని, మీకు ఓటు హక్కు వేసే సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలోని 2,3, తేదీలలో బాలుర జునియర్ కళాశాలలో పరిగిలో, తాండూర్ 3,4 తేదీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల కొడంగల్ పిఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పి సిఇఓ సుధీర్, అధికారులు శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు పక్కా ప్రణాళికతో ముందుకెళ్ళాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను అదేశించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులలో కూలీల సంఖ్యను పెంచుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీ పనులలో లేబర్ సమీకరణ చేస్తు పద్ధతి ప్రకారం పనులు చేపడితే అనుకున్న లక్ష్యం చేరుకోవచ్చని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు, మండల స్పెషల్ అధికారులదేదన్నారు. వేసవి దృష్టిలో ఉంచుకోని గ్రామాలలో ప్రజలకు తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. వంద శాతం పనులు పూర్తి చేయాలని అధికరులను అదేశించారు.

## ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న లక్ష్మారెడ్డి



ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి: గౌతమ్‌నగర్ డివిజన్‌లోని హిల్‌టాప్ కానీలోని చర్చిల్లో జరిగిన ఈస్టర్ పండుగ కార్యక్రమాల్లో బిఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు క్రైస్తవ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా సోదరిమణులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, చర్చి చైర్మన్ రాబిన్ బోస్, స్పీకర్ రె.వె సంపత్‌కుమార్, పాస్టర్ రెవ.పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

సునీత మహేందర్‌రెడ్డి




ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మల్కాజ్‌గిరి ఎంపి కాగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సఫిల్‌గూడ మినీ ట్యాంక్ బండ్ వద్ద వాకర్స్ అసోసియేషన్ సభ్యులను ఆమె కలిసి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్, బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, సతీష్‌కుమార్, ఎస్ ఆర్ ప్రసాద్, రామచందర్, డివిజన్ అధ్యక్షుడు జిడి సంపత్‌గౌడ్ పాల్గొన్నారు.

**సాయినాథపురంలో...** ఎన్నికల ప్రచారంలో భాగంగా సాయినాథపురం ఆఫీసర్స్ కాలనీలో మార్నింగ్ వాకర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో సునీత మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని అభ్యర్థించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రజా సమస్యల పరిష్కారానికి అవకావం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మహిళలకే ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం

కొలను హన్మంత రెడ్డి



ప్రజాపక్షం/ నిజాంపేట్ : కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకే అధిక ప్రాధాన్యత ఉంటుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 33 డివిజన్‌ల మహిళా కాంగ్రెస్ సమావేశం బాచుపల్లిలో జరిగింది. ఈ సమావేశానికి కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డిలు విచ్చేసి 33 డివిజన్‌ల మహిళా కాంగ్రెస్ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా నియమితులైన డివిజన్ కమిటీ అధ్యక్షులకు నియామకపు పత్రాలను వారు అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో మహిళలకు ప్రత్యేకంగా గుర్తింపు ఉంటుందని, రేవంత్ రెడ్డి అధికారంలో మహిళల సంక్షేమానికి పథకాలను తీసుకువచ్చారని తెలిపారు. మహిళా కమిటీలు అర్హులైన మహిళలందరికి ప్రభుత్వ పథకాలు అందేవిధంగా కృషి చేయాలని సూచించారు. సమీపిస్తున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్ గిరి కాంగ్రెస్ అభ్యర్థి సునితా మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని, అందుకోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలంతా నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొలను రాజశేఖర్ రెడ్డి, ఇందిరా, షేక్ రఫియా బేగం, జాజుల రమ్య, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందుకు ఎంఎల్ఎకు ఆహ్వానం

ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి: రంజాన్ మాసం సందర్భంగా మంగళవారం నిర్వహించే ఇఫ్తార్ విందుకు హాజరు కావాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని ముస్లిం మైనార్టీ సోదరులు ఆహ్వానించారు. నేరేడ్‌మెట్‌లోని జికె సరస్వతి ఫంక్షన్ హాల్లో సాయంత్రం ఐదు గంటలకు నియోజకవర్గం ముస్లిం సోదరులు ఇచ్చే ఇఫ్తార్ విందుకు హాజరు కావాలని మైనార్టీ నేతలు మహమ్మద్ ఉస్మాన్, అమిరుద్దీన్ అలీ ఖాన్, ఇబ్రహీం అలీ, మహ్మద్ అఫ్జల్, మహ్మద్ జావిద్ పాషా తదితరులు ఎమ్మెల్యేను కోరారు.



## మరోసారి మోడీని ప్రధానిని చేద్దాం

ఈటల రాజేందర్



ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బిజెపికి ఓటు వేసి దేశ ప్రధానిగా మరో సారి మోడీని గెలిపిద్దామని మల్కాజ్‌గిరి ఎంపి బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మౌలాలీ డివిజన్‌లోని గీతానగర్ పార్కులో ఉదయం మార్నింగ్ వాకర్స్‌తో ఆయన సమావేశమై రానున్న ఎన్నికల్లో బిజెపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. దేశం భద్రంగా, ప్రశాంతంగా ఉండాలంటే దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుకునే బిజెపిని అధికారంలోకి తీసుకురావాలని, మళ్లీ ప్రధానిగా మోడి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్, బిజెపి సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ యాదవ్, మోహన్ యాదవ్, సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామదేవతలు తెలంగాణ సంస్కృతిలో భాగం

ఎంఎల్ఎ వివేకానంద



ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట : రంగారెడ్డి నగర్ డివిజన్ విజయపురి కాలనీలోని పోచమ్మ అమ్మవారి నూతన విగ్రహ పున:ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట, బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమ్మవారి ప్రతిష్ఠాపన మహోత్సవంలో నిర్వహిస్తున్న మహాగణపతి పూజ శాంతి హోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలలో గ్రామదేవతలు భాగమన్నారు. అమ్మవారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్, శేఖర్ గౌడ్, ఎండి.రియాజ్, మల్లం శ్రీనివాస్ గౌడ్, అధ్యక్షులు బాలు నేత, శ్రీధర్, సుజాత, మహేష్, చంద్రశేఖర్ గౌడ్, శశి నరసింహ గౌడ్, జల్ల లక్ష్మీ నాద్, భాస్కర్ గౌడ్, గణేష్, శ్రీనివాస్, మదన్ గౌడ్, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### నవగ్రహ దేవత విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం నందు నిర్వహించిన శ్రీ భద్రకాళి సహిత వీరభద్ర స్వామి, కాలభైరవ సహిత నవగ్రహ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఎమ్మెల్యే కేపీ. వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మాట్లాడుతూ దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం అమ్మవారు వివిధ రూపాలలో ఆవిర్భవించారని అందులో ఒకటే భద్రకాళి అవతారమన్నారు. అమ్మవారిని కొలవడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు కార్యసిద్ధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మూల బసవరాజ్, కళ్యాణ్ రావ్, రాజప్ప, రాజయ్య స్వామి, రామయ్య స్వామి, ప్రకాష్, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ జక్కుల కృష్ణ యాదవ్, సుభాష్ నగర్ డివిజన్ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు పోలే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై ఈటల అనుచరుల దౌర్జన్యం

అడ్డుకోబోయిన జర్నలిస్టులకు బెదిరింపులు

ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో దాడి ఘటన




ప్రజాపక్షం/బోడుప్పల్: బిజెపి మల్కాజ్‌గిరి ఎంపి అభ్యర్థి ఈటల రాజేందర్ అన్యాయాలపై గళమెత్తిన దళిత బాధితులపై తన అనుచరులతో దాడి చేయించిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో సోమవారం జరిగింది. తమ భూములు లాక్కుని తమపై కేసులు పెట్టారని ఆరోపిస్తూ పలువురు ఈటల బాధితులు ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. హుజురాబాద్‌లో తమ భూములు లాక్కుని, తమపై కేసులు పెట్టి వేధించారని వారు ప్రెస్‌మీట్‌లో చెప్పుకునేందుకు రాగా వారిపై ఈటల రాజేందర్ అనుచరులు బండ బూతులు తిడుతూ, ఈటలపై వ్యతిరేకంగా ప్రెస్‌మీట్ పెడతారా అంటూ రెచ్చిపోయారు. అక్కడ ఉన్న మీడియా లోగోలను ఆయుధాలుగా చేసుకుని దళితులపై విచక్షణారహితంగా కొట్టారు. అడ్డు వచ్చిన జర్నలిస్టులను సైతం బెదిరించారు. దీంతో ప్రెస్‌మీట్‌కు వచ్చిన దళితులు భయపడి రోడ్డుమీదకు పరుగులు తీశారు. వారిని వెంబడించి రాళ్లతో దాడి చేశారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### ప్రెస్‌క్లబ్‌లో దాడిని ఖండించిన టియుడబ్ల్యుజె

ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన దాడిని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరికి భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందని, ఇది గుర్తించి రాజకీయ నాయకులు మసులుకోవాలన్నారు. ఇది మీడియాపై జరిగిన దాడిగా తాము పరిగణిస్తున్నామని తెలిపారు. ఈటల అనుచరులుగా చెప్పుకునే బిజెపి నాయకులు ప్రెస్‌క్లబ్‌లో లోగోలు, మైకులు, కుర్చీలను లాక్కుని ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇందుకు బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### బిజెపి దాడిని ఖండిస్తున్నాం : సిపిఐ

**జగద్గిరిగుట్ట :** ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులపై దాడులకు పాల్పడిన బిజెపి నాయకులను వెంటనే అరెస్టు చేయాలని సిపిఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపించాలని డిమాండ్ చేశారు. నిజాలు చెప్పే వారంటే బీజేపీకి భయం అన్నారు. వాటిని అరికట్టడం కోసం భౌతిక దాడులకు దిగడం వారికి ఏపాటి ఓర్పు, సహనం ఉందో తెలుస్తోందన్నారు. మళ్ళీ బీజేపీ అధికారంలోకి వస్తే ప్రశ్నించిన వారే ఉండరన్నారు. ఎవరైన సరే విలేఖరులు కూడా బాధితులే కాబట్టి దేశంలో విద్వేశం తగ్గి శాంతి సామరస్యం ఉండాలంటే బీజేపీ చేస్తున్న అన్యాయాలను మీడియా ప్రచారం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి వారిని ఓడగొట్టాలని కోరారు. జర్నలిస్టులపై ఎటువంటి దాడి జరిగినా సీపీఐ ఖండిస్తుందన్నారు. పోలీస్ వారు కూడా నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

## దాడులకు పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

మేడ్చల్ జిల్లా టియుడబ్ల్యుజె (ఐజెయు) అధ్యక్షుడు

బాలరాజు డిమాండ్

ప్రజాపక్షం/నిజాంపేట్ : ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులపై దాడులకు పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా టియుడబ్ల్యుజె (ఐజెయు) అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు డిమాండ్ చేశారు. జిల్లా పరిధిలోని ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో విలేఖరుల సమావేశంలో జరిగిన దాడిని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్తుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ భావ ప్రకటన, స్వేచ్ఛ ప్రతి ఒక్కరికి ఉందని, ఇది గుర్తించి రాజకీయ నాయకులు మసులుకోవాలని, దాడులకు పాల్పడిన వారికి సూచించారు. మల్కాజ్‌గిరి బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్‌కు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో బిజెపి కార్యకర్తలు, నాయకులు కొందరు అక్రమంగా ప్రవేశించి దాడులకు పాల్పడడం దారుణమన్నారు. ఇది మీడియా పై జరిగిన దాడిగా మేము పరిగణిస్తున్నామని తెలిపారు. బిజెపి నాయకులు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించి విలేఖరుల వద్ద ఉన్న మైకులను లాక్కొని, కుర్చీలను ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నిజాలు చెప్పే వారంటే బీజేపీకి భయం అన్నారు. వాటిని అరికట్టడం కోసం భౌతిక దాడులకు దిగడం వారికి ఏపాటి ఓర్పు, సహనం ఉందో తెలుస్తోందన్నారు.ఈ ఘటనపై ఉప్పల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో దాడులకు పాల్పడినటువంటి బిజెపి నాయకులు, కార్యకర్తలను వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడులకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

# ఎలక్టోరల్ బాండ్‌లతో బయటపడ్డ మోడీ అవినీతి

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోడీ అవినీతి గురించి గత కొంత కాలంగా అందరికీ తెలిసిందేనని, ఎలక్టోరల్ బాండ్‌లు సమాచారం వెలుగులోకి వచ్చిన తరువాత అవినీతిని నిరూపించే బలమైన అంకెలు బయటపడ్డాయని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఎలక్టోరల్ బాండ్‌ల వ్యవహారం కేంద్ర ప్రభుత్వానికి ఎదురుదెబ్బ అనే వాదనను ప్రధాని నరేంద్ర మోడీ తిరస్కరిస్తూ, ఏ వ్యవస్థ పరిపూర్ణమైనదని కాదని, ఎలాంటి లోపాలు వచ్చినా సరి చేస్తామని ప్రధాని నరేంద్ర మోడీ ఒక ఛానల్‌లో మాట్లాడుతూ అన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ వ్యవహారాలో నాట్యం చేస్తున్న వారంతా దానిపై చింతిస్తారని అన్నారు. ప్రధాని మోడీ మాటలపై కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాను తీసుకువచ్చిన ఎలక్టోరల్ బాండ్‌ల విధానం కారణంగానే రాజకీయ పార్టీలకు నిధులు ఎక్కడి నుండి వచ్చాయి, వాటిని ఎలా వాడుతున్నారో తెలుస్తోందని ప్రధాని పచ్చి అబద్ధాలు ఆడారని మండిపడ్డారు. ఎలక్టోరల్ బాండ్ విధానంలో రాజకీయ పార్టీలకు ఎవరు నిధులు ఇస్తారనే విషయం ఏ మాత్రం తెలియదని, విరాళాలిచ్చే వారి పేర్లు పూర్తిగా గోప్యంగా ఉంటుందని , రాజకీయ పార్టీలకు వచ్చే నిధుల వివరాలను ప్రజలకు తెలియకుండా మోడీ పూర్తిగా దాచిపెట్టారని దుయ్యబట్టారు. గడిచిన ఆరేళ్ళలో (2018 నుండి 2024 వరకు) ఏ పార్టీకి ఏ దాత నుండి ఎంత మొత్తం వచ్చిందనే ఒక్క వివరం కూడా బైటికి పొక్కలేదని జైరామ్ రమేశ్ సోమవారం నాడు తన 'ఎక్స్' అకౌంట్‌లో పోస్ట్ చేశారు.

2024లో ఎలక్టోరల్ బాండ్‌లు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు తీర్పునిచ్చిందని, ఆ తీర్పు వచ్చే చివరి రోజు వరకు మోడీ ప్రభుత్వం ఎలక్టోరల్ బాండ్ పథకంలో దాతల వివరాల గోప్యతను కాపాడేందు కు మోడీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించిందన్నారు. చివరకు ఏ పార్టీకి ఎవరు నిధులు విరాళంగా ఇచ్చారో చెప్పాలని ఎస్‌బిఐకి సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చిందని, అయినప్పటికీ ఆ సమాచారం తమ వద్ద లేదని, సమాచారాన్ని క్రోడీకరించేందుకు మూడు నెలలు పడుతుందని, తద్వారా పార్లమెంటు ఎన్నికలు పూర్తయ్యే వరకు సమయం ఇవ్వాలంటూ రిమోట్ కంట్రోల్‌తో పనిచేస్తున్న ఎస్‌బిఐ అబద్దాలు చెప్పిందన్నారు. చివరకు సుప్రీం కోర్టు గట్టిగా ఆదేశించడంతో ఎస్‌బిఐ వివరాలను విడుదల చేయాల్సి వచ్చిందని జైరామ్ రమేశ్ గుర్తు చేశారు. వాస్తవానికి రాజకీయ పార్టీ, దాతల వివరాలు, ఏ పార్టీకి ఎవరు ఎంత ఇచ్చారనే సమాచారం తెలుసుకునేందుకు కేవలం 15 క్షణాలు పట్టిందని, ఎస్‌బిఐ మాత్రం మూడు నెలలు కోరిందన్నారు. ఏమి చేశామని ఎలక్టోరల్ బాండ్స్ విషయంలో తమ పార్టీకి ఎదురు దెబ్బ తగులుతుందని ప్రధాని అన్నారని, కాని సుప్రీం కోర్టు ఆదేశాలతో విడుదలైన సమాచారంతో ప్రభుత్వ భారీ అవినీతి బట్టబయలైందని విమర్శించారు. సుమారు రూ.4లక్షల కోట్ల విలువైన కాంట్రాక్టులు, ప్రాజెక్టులు, పర్యావరణ అనుమతులతో బిజెపికి కార్పొరేట్ దాతలు అందించిన వేల కోట్ల విరాళాలు ముడిపడి ఉన్నాయన్నారు. ఈ వ్యవహారంతో 'చందా ఇవ్వు, దందా చేసుకో' అని సూపర్ మార్కెట్ స్థాయికి దిగజారిన భారత ప్రభుత్వ విధానం బట్టబయలైందన్నారు.

సుమారు 40 ఐటి, ఇడి, సిబిఐ దాడుల తరువాత బిజెపికి భారీ ఎత్తున ఎలక్టోరల్ బాండ్స్ వచ్చిన బంఢారం కూడా బైట పడిందన్నారు. ప్రధాన మం త్రి, ఆయన ఆశ్రితులు పద్ధతి ప్రకారం హఫ్తా వసూలీకి పాల్పడ్డారని జైరామ్ రమేశ్ ఆరోపించారు. దురదృష్టవశా త్తు అవినీతికి సంబంధించి బలమైన అంకెలు ఆధారాలు దొరికినప్పటికీ ప్రధాని ఇంకా భారత ప్రజలకు అబద్ధాలు చెబుతూనే ఉన్నారని అన్నారు.

# ఐటి నోటీసులు ప్రతికార చర్యే

కేంద్ర సర్కార్‌పై ప్రియాంకాగాంధీ మండిపాటు

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ పార్టీకి ఆదాయపు పన్ను శాఖ నోటీసులు పంపడంపై ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ చర్యను ఆమె పక్షపాత చర్యగా అభివర్ణించారు. 140 కోట్ల భారతీయుల గళాన్ని అణచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను విజయవంతం కావడాన్ని ప్రజలు ఎప్పటికీ అంగీకరించబోరన్నారు. మొత్తంగా రూ. 3,567 కోట్ల డిమాండ్ పెంచుతూ ఆదాయపు పన్నుశాఖ కాంగ్రెస్ పలుమార్లు నోటీసులు పంపింది. 2014–15 నుంచి 2016–17 అసెస్‌మెంట్ సంవత్సరాలకు రూ. 1,745 కోట్ల పన్ను డిమాండ్‌ను పెంచుతూ తాజాగా ఆదాయపు పన్ను నోటీసులు అందాయని పార్టీ ఆదివారం తెలిపింది. రెండు రోజుల క్రితం దాదాపు రూ.1,823 కోట్లు చెల్లించాలని ఐటి శాఖ నుంచి నోటీసులు అందాయని పేర్కొంది. కాంగ్రెస్‌పై 3,567 కోట్ల రూపాయల జరిమానా ఎందుకు విధించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ 'ఎక్స్'లో హిందీలో పోస్ట్ చేశారు. 1994–95లో, మళ్లీ 2014–15, 2016–17లో పార్టీ ఖాతాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కొంత డబ్బును నగదు రూపంలో జమ చేశారనీ ఆరోపణలు వచ్చాయని, అయితే ఆ సమాచారం ఇప్పటికే ఆదాయపు పన్నుశాఖకు పంపినట్లు ప్రియాంక తెలిపారు. కానీ కాంగ్రెస్ సమాచారం ఇవ్వలేదని ప్రభుత్వం ఏకపక్ష ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఖాతా నుంచి ఆదాయపు పన్ను శాఖ 135 కోట్ల రూపాయలను విత్‌డ్రా చేసిందని, పార్టీకి 3,567 కోట్ల రూపాయల పెనాల్టీ నోటీసు జారీ చేసి, కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారని ఆమె ఆరోపించారు. బిజెపి నగదుకు సంబంధించి ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ప్రకారం... 2017–18లో, దాదాపు 1,297 మంది తమ పేరు, అడ్రస్, పూర్తి వివరాలు ఇవ్వకుండా బిజెపికి 42 కోట్ల రూపాయలు ఇచ్చారు. బిజెపికి చెందిన ఈ అనామక ఆదాయం రూ. 42 కోట్లపై ఆదాయపు పన్ను శాఖ ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేచేయడం గానీ, ఎలాంటి చర్యలు గానీ తీసుకోలేదని ప్రియాంక గాంధీ అన్నారు. కాంగ్రెస్‌కు వర్తింపజేస్తున్న నిబంధనలు బిజెపికి ఎందుకు వర్తించడం లేదని ఆమె ప్రశ్నించారు. 'వాస్తవానికి, ఎన్నికల సమయంలో 140 కోట్ల భారతీయుల గొంతును బలహీనపరిచేందుకే ఈ పక్షపాత చర్యను అవలంబిస్తున్నారని విమర్శించారు. దీనిపై తాము రెట్టింపు బలంతో పోరాడుతామన్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో బిజెపి 'పన్ను తీవ్రవాదం'లో మునిగిపోయిందని, ప్రధాన ప్రతిపక్ష పార్టీని ఆర్థికంగా కుంగదీసిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఇలా చేయడం ద్వారా ఎన్నికల సమయంలో తమ స్థాయికి ఆటంకం కలిగిస్తున్నారని కాంగ్రెస్ ఆరోపిస్తూ, ఈ విషయమై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు కూడా చేసింది.

# మార్చిలో రూ.1.75 లక్షలకోట్లు వసూళ్ళు

ఎనిమిదేళ్ళలో రెండోసారి అత్యధిక రికార్డు

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వ వస్తుసేవల పన్నులు (జిఎస్‌టి) మార్చి నెలలో రూ1.78 లక్షలకోట్ల మేరకు రికార్డుస్థాయిలో వసూళ్ళు జరిగాయి. ఎనిమిదేళ్ళక్రితం జిఎస్‌టి అమలులోకి వచ్చింన తర్వాత ఈ విధంగా అత్యధిక వసూళ్ళు జరగడం ఇది రెండోసారి. మార్చినెలలో ఈ వసూళ్ళు 11.5 శాతం మేరకు వృద్ధి చెందాయి. కేంద్ర ఆర్థికమంత్రిత్వశాఖ సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. గడచిన ఆర్థిక సంవత్సరం (2023 ఏప్రిల్ 1 నుండి 2024 మార్చి 31 వ తేదీ వరకూ జరిగిన జిఎస్‌టి వసూళ్ళు మొత్తం రూ.20.18 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2024లో సగటు నెలవారీ స్థాల జిఎస్‌టి వసూళ్ళు రూ.1.68 కోట్లుగా నమోదవుతున్నాయి. రూ.1.78 లక్షలకోట్ల మేరకు మార్చితో ముగిసిన నెలలో పెరిగాయి. ఏటికేడాది ఈ వసూళ్ళు 11.5 శాతం మేరకు పెరుగుతున్నాయి. దేశీయ లావాదేవీలు గణనీయంగా17.6 శాం మేరకు పెరుగుతూఉండటంతో వసూళ్ళు కూడాభారీగా పెరుగుతున్నాయి. గత ఏడాది ఏప్రిల్‌లో రికార్డుస్థాయిలో అత్యధికంగా రూ.1.87 లక్షలకోట్ల మేరకు వసూళ్ళు జరిగాయి. మార్చినెలలో ముగిసిన ఈ వసూళ్ళలో కేంద్రం జిఎస్‌టి రూ.3.76లక్షలకోట్లు కాగా, రాష్ట్ర జిఎస్‌టి రూ.4.71లక్షల కోట్లుగాఉంది. దిగుమతుల ద్వారా రూ.4.83 కోట్లు వసూలు కాగా, కేంద్ర రాష్ట్రాల జిఎస్‌టి మొత్తం రూ.10.27లక్షల కోట్లుగా నమోదైంది. దేశంలో రెండంకెల వృద్ధి కొనసాగుతుందనీ, అందువల్ల జిఎస్‌టి వసూళ్ళు కూడా పెరుగుతాయనీ ఐసిఆర్‌ఎ ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ అన్నారు.

## మార్కెట్‌యార్డులో భారీ ఆగ్ని ప్రమాదం

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ మార్కెట్‌లోని వ్యవసాయ గోదాంలో భారీ అగ్ని ప్రమాదానికి గురి అయ్యింది. 5000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంలోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాల్సిన ఖాళీ ధాన్యం గోదాములు, వరి ధాన్యం కూడా తగలబడిపోయాయి. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం బట్టి తెలిసింది. మంటలు పూర్తి స్థాయిలో అదుపులోకి వచ్చిన తర్వాత నష్ట తీవ్రతను అంచనా వేస్తామని మార్కెట్ యార్డ్ వర్గాలు ప్రాథమిక సమాచారాన్ని బట్టి నష్టం రూ.10 నుంచి 15 కోట్ల రూపాయలలో ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# లోక్‌సభ ఎన్నికల తర్వాత కొత్త టోల్‌గేట్ రేట్లు

ఇసిఐ అనుమతి

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల తర్వాత జాతీయ రహదారులపై టోల్‌గేట్ల వద్ద కొత్త రేట్లు అమలులోకి వస్తాయి. టోల్‌గేట్ల వద్ద కొత్త ధరలు అమలు చేసేవిషయంపై నిర్ణయానికి అవసరమైన గణాంకాలు వేసుకుని సిద్ధంగా ఉండేదుకు భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఎఐ)కు అనుమతి ఇచ్చింది. వాస్తవానికి కొత్త ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుండి ఈ ధరలు అమలు కావాల్సి ఉంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలో ఉన్నందు వల్ల ఇది వాయిదా పడింది. జాతీయ రహదారులపై కొత్త ధరల అమలును వాయిదా వేయాలని ఎన్‌హెచ్‌ఎఐని ఎన్నికల సంఘం కోరింది. ఈ విషయంలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ అభిప్రాయాన్ని ఇసిఐ కోరింది. ఈ వార్షిక టోల్‌గేట్ కొత్త ధరల పెంపు ఐదు శాతం మేరకు ఉంటుందని భావిస్తున్నారు. కొత్త టారిఫ్‌లు ఎన్నికల తర్వాతే అమలులోకి వస్తాయి. ఈ టోల్‌గేట్ల ధరల పెంపు ప్రతి ఏడాదీ జరుగుతున్నదేనని జాతీయ రహదారుల సంస్థ అధికారి ఒకరు చెప్పారు. ఏప్రిల్ 19 నుండి జూన్ 1వ తేదీ వరకూ ఏడు విడతలుగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయి.

# రైతు మరణంపై హర్యానా ప్రభుత్వ విజ్ఞప్తికి సుప్రీం తిరస్కృతి

**న్యూఢిల్లీ :** ఇటీవల రైతులు చేసిన ఆందోళన సందర్భంగా ఒక యువ రైతు మరణించిన ఘటనపై విచారణ చేయాలని కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు నిలిపివేయాలని హర్యానా ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని కోరుతూ ఫిబ్రవరి 21న రైతులు చేసిన ఉత్కంఠభరిత ఆందోళన సందర్భంగా హర్యానా పోలీసులు జరిపిన దాడిలో ఒక యువరైతు మరణించాడు. ఈ ఘటనపై ఒక కమిటీని నియమించి దర్యాప్తు జరపాలని పంజాబ్–హర్యానా హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ హర్యానా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీకోర్టును ఆశ్రయించగా జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం తిరస్కరించింది. హర్యానాకు చెందిన యువరైతు శుభకరన్ సింగ్ (21) ఫిబ్రవరి 21న హర్యానా పోలీసు దాడుల్లో సరిహద్దుల్లో మరణించారు. బారికేడ్లు దాటి వెళ్ళేందుకు రైతులు ప్రయత్నించినప్పుడు ఉద్రిక్తతలు చెలరేగాయి. శుభంకరన్‌కేసుపై కమిటీ ఏర్పాటు చేయడం ద్వారా దర్యాప్తు జరపాలన్న ఆలోచన పోలీసు నైతికస్థైర్యానిన దెబ్బతీస్తుందని హర్యానా ప్రభుత్వం తరపున కోర్టులో వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. ఈ కేసును ఈనెల 10వ తేదీన తిరిగి సుప్రీంకోర్టు విచారణ చేస్తుంది.

# కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**న్యూఢిల్లీ :** ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై విచారణ ఏప్రిల్ 4కు వాయిదా పడింది. తన కుమారుడి పరీక్షల దృష్ట్యా ఈ నెల 16 వరకు బెయిల్ మంజూరు చేయాలని మార్చి 26న ఆమె రౌస్ అవెన్యూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. కవిత పిటిషన్‌పై సమాధానం చెప్పాలని న్యాయస్థానం ఇడికి నోటీసులు జారీ చేస్తూ.. విచారణను వాయిదా వేసింది. గత నెల 15న హైదరాబాద్‌లోని తన నివాసంలో కవితను ఇడి అరెస్టు చేసి మరుసటి రోజు రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచిన సంగతి తెలిసిందే. ముందుగా ఇడి 10 రోజుల కస్టడీకి కోరగా.. న్యాయస్థానం ఏడు రోజులకు అనుమతి ఇచ్చింది. అనంతరం మరో ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరగా.. మూడు రోజులకు అనుమతించింది. ఇడి కస్టడీ మార్చి 26న ముగియడంతో.. అదే రోజు కోర్టులో దర్యాప్తు సంస్థ అధికారులు ఆమెను హాజరు పరిచారు. ఆ తర్వాత కవితకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో తిహార్ జైలుకు తరలించారు.

# భైరవమూర్తి విగ్రహం ఏర్పాటుకు విరాళం



**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజీ దగ్గర గల సుప్రసిద్ధమైన క్షేత్రం శ్రీ కోటిలింగేశ్వర దత్త దేవస్థానంలో ధ్యాన మం దిరంలో స్వర్ణకర్షణ భైరవ మూర్తి విగ్రహం ఏర్పాటు కోసం డిఎస్ఒ రేవతి లక్ష యాభై వేలు విరాళం అందించారు. పదవి విరమణ సందర్భం గా ఆలయానికి విచ్చేసిన రేవతిని ఆలయ కమిటీ శాలువా కప్పి సన్మానించారు. అనంతరం లక్ష యాభై వేల రూపాయల విరాళం ఆలయ ప్రధాన కార్యదర్శి రమాశ్ శేఖర్‌కి అందించారు.

# కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** యాసంగి 2023–24 సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎస్.మోహన్‌రావు సోమవారం ప్రారంభించారు. భూత్పూర్ మండలంలోని మద్దిగట్ల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఎసిఎస్ ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి వరి కొనుగోలు కేంద్రాలకు 1,32,676 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. జిల్లాలో 190 వరి ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అందులో పిఎసిఎస్ ద్వారా 87, ఐకెపి ద్వారా 98, డిసిఎంఎస్ ద్వారా 4, మెప్మా ద్వారా 1 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా 60 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు, మిగిత కొనుగోలు కేంద్రాలు వరి కోతలు ననుసరించి షెడ్యూల్ ప్రకారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా తాగునీరు, నీడ వసతి కల్పించేలా టెంట్ అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాల ప్రకారం విక్రయించి గ్రేడ్ ఏ ధాన్యం కు క్వింటాల్‌కు 2203 రూపాయలు, సాధారణ రకంకు 2183 రూపాయలు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్, జిల్లా సహకారం అధికారిణి ఏ.పద్మ, పౌరసరఫరాల సంస్థ డిఎం. ప్రవీణ్ వ్యవసాయ శాఖ పౌరసరఫరాల శాఖ సంబంధిత శాఖ ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** వేసవిలో గ్రామాల్లో పట్టణాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ భవనంలోని కలెక్టర్ కార్యాలయం నుండి వెబెక్స్ ద్వారా మండల, గ్రామ ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు, మిషన్ భగీరథ ఎఇలు, ఎంపిఒలు, పంచాయితీ కార్యదర్శులతో జిల్లా కలెక్టర్ తాగునీటి సరఫరాపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాపై పటిష్ట కార్యాచరణ రూపొందించాలన్నారు. తాగునీటి సమస్య ఉంటే రిపేర్‌లు చేపట్టాలని బోర్లను ఫ్లషింగ్ చేయాలని, మోటార్లను హ్యాండ్ పంప్స్ మరమ్మతులు చేయాలని, పైప్‌లైన్ల లీకేజిలు సరి చేయాలని ఆదేశించారు. అధికారులు తాగునీటిపై సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. జిల్లా అధికారులు, మండల అధికారులు, గ్రామ అధికారులు గ్రామాలు సందర్శించి త్రాగునీటి సరఫరాపై సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లో నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రమం తప్పకుండా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. నీటికి ఇబ్బందులు ఉన్నచోట రైతులు బోర్లు, ప్రైవేట్ బోర్ల ద్వారా నీటిని సేకరించి సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో డిపిఒ వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు.

# ఎన్నికలు విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష




**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికలకు అవగాహన కలిగి ఎన్నికలు విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ మీటింగ్ హాల్‌లో జిల్లా అధికారులతో కన్వెర్జెన్స్ మీటింగ్‌పై సమీక్షా చేస్తూ ట్రైనింగ్ టూ ఎలక్షన్ స్టాఫ్ , పిఒ, ఏపిఓలకు ఈ నెల 2న టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ ఎర్రగుట్ట యాదగిరి రోడ్ నారాయణపేటలో నిర్వహించే శిక్షణకు అందరు హాజరు కావాలని సూచించారు. హెల్ప్ డెస్క్‌లో ఏపిఓలు ఎపిక్ కార్డులు రేపు ఇవ్వాలని అన్నారు. ఫారం 12 పోస్టల్ బ్యాలెట్ కొరకు పూర్తి చేసి ఇవ్వాలని , ఇతర ఎన్నికల సిబ్బంది ఉంటే వారు డ్యూటీలో ఉన్న వివరాలు అందజేయాలన్నారు.

# దేశాభివృద్ధి బిజెపితోనే సాధ్యం

మాజీ మంత్రి, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ

**ప్రజాపక్షం/జడ్చర్ల :** ప్రపంచంలోనే అగ్రగామిగా వెలుగొందుతున్న భారతదేశ అభివృద్ధి కేవలం బిజెపితోనే సాధ్యమని మాజీమంత్రి, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ అన్నారు. సోమవారం నాడు సాయంత్రం జడ్చర్ల పట్టణంలోని ప్రేమ్‌రంగా గార్డెన్‌లో నిర్వహించిన మండలస్థాయి నియోజకవర్గ స్థాయి కార్యకర్త సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. బిజెపి ప్రతి ఇంటికి అనేక రకాల పథకాలు కల్పింస్తుందని గతంలో ఉన్న బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టింది ఏమి లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు, శ్రీనివాస్‌రెడ్డి, బాల త్రిపుర సుందరి, శ్రీవర్ధన్ రెడ్డి, అందేబాబయ్య, శ్రీనివాస్ గౌడ్, సాహితిరెడ్డి, రమేశ్ జి, నాగరాజు, బాలవర్ధన్ గౌడ్, సాకేత ప్రవీణ్ పిట్టల నరేశ్, తదితరులు పాల్గొన్నారు.



# వందశాతం ఓటు నమోదు చేసేలా స్వీప్‌ద్వారా అవగాహన : అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/నాగర్ కర్నూల్‌ప్రతినిధి :** వంద శాతం ఓటు నమోదుచేసేలా స్వీప్‌ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవా రం ఉదయం కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన స్వీప్‌కోర్ కమిటి మీద సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో స్వీప్ కార్యక్రమాలు చేపట్ట డం జరుగుతుందన్నారు. యువత వందశాతం ఓటు నమోదు చేసేలా స్వీప్‌ద్వారా 18 సం వత్సరాలు నిండిన ప్రతి విద్యార్థి ఓటరుగా నమోదుచేయాలని పోలింగ్ కేంద్రానికి వెళ్లి తప్పనిసరిగా ఓటువేసేలా అవగాహన కల్పించాలన్నారు. అన్నిశాఖలు ఓటింగ్ శాతం పెంచేందు కు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో స్వీప్ కార్యాచరణ పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఓటుహక్కుపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఓటు ప్రాముఖ్యత తెలిసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టి చైతన్యం తేవాలని అన్నారు. అర్హతగల ప్రతి ఒక్కరు ఓటుహక్కు పొందేలా ఓటు హక్కు గురించి మెసేజ్‌లద్వారా విస్తృతప్రచారం చేపట్టాలన్నారు. ఈసమావేశంలో స్వీప్‌నోడల్ అధికారి చిన్న ఓబులేష్, జిల్లాపరిషత్ కార్యనిర్వహణ అధికారి దేవసహాయం, డిఇఒ గోవిందరాజులు, డిపిఒ కృష్ణ, జిల్లా మహిళాశిశుసంక్షేమశాఖ అధికారిణి రాజేశ్వరి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో మొత్తం 123 కేంద్రాలు

అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** నారాయణపేట ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని ఆరబెట్టి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు విక్రయించి లబ్ధిపొందాలని సూచించారు. 2023/24 యాసంగి సీజన్‌లో జిల్లాలో 1,35,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసిందని అందుకు అనుగుణంగా వరి ధాన్యం కొనేందుకు జిల్లాలో మొత్తం 123 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు సివిల్ సప్లై డిఎస్‌ఒ సుదర్శన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎం. దేవదాస్ , సివిల్ సప్లై శాఖ అధికారులు, పిఎసిఎస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుడి సేవలు మరువలేనివి

ఎంఇఒ శంకర్‌నాయక్



**ప్రజాపక్షం/వెల్దండ :** ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని, 14 సంవత్సరాలు వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించిన తలారి వెంకటయ్య నిరంతర శ్రమజీవి అని వెల్దండ మండల విద్యాధికారి శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం పెద్దాపూర్ పాఠశాలలో తలారి వెంకటయ్య పదవి విరమణ వీడ్కోలు సన్మానసభకు శంకర్‌నాయక్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్, హెచ్‌ఎం లు చంద్రులు మాట్లాడు తూ వెంకటయ్య ఉపాధ్యాయుడిగా పనిచేసి న పాఠశాలకే గుర్తింపుతేవడంతో పాటు అనేక మంది ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన పలుమార్లు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారని వారు గుర్తుచేశారు. ఉపాధ్యాయుడు వెంకటయ్య మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా ఉపాధ్యాయవృత్తిలో విధులు నిర్వహించానని ఏ పాఠశాలకు వెళ్లిన తోటి ఉపాధ్యాయులతో కలిసి ఎంతో ఆనందంగా విధులు నిర్వహించాలని ఉపాధ్యాయ వృత్తికి విరమణ పొందడం బాధ కలిగి న ఉద్యోగంలో పదవివిరమణ తప్పనిసరి కావడంతో ఎంతో ఆనందంగా విద్యార్థుల,తోటి ఉపాధ్యాయుల మధ్యలో సన్మాన కార్యక్రమం నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అదేవిధంగా పాఠశాల అభ్యున్నతికి తనవంతుగా పదివేల రూపాయల చెక్కును అందజేశారు. పదవి విరమణ వీడ్కోలు సన్మాన సభ కార్యక్రమానికి వెల్దండ కల్వకుర్తి మండలాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రిటైర్డు ప్రధానోపాధ్యాయులు వనజ, తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జీగా జూపల్లి

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల ఇంచార్జీగా కొల్లాపూర్ ఎంఎల్‌ఎ తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ టూరిజంశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం నియమించింది. పార్లమెంట్ నియోజకవర్గం నాయకులను సమన్వయం చేయడంతోపాటు పార్టీ ప్రచార కార్యక్రమాలు తదితర అంశాలను మంత్రి జూపల్లి చూసుకుంటారని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం ఆదేశించింది.

# సిఎంను విమర్శించే స్థాయి నీకు లేదు

డికె. అరుణపై ఎంఎల్‌ఎ మధుసూదన్‌రెడ్డి మండిపాటు




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ బ్యూరో :** పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకొని డికె. అరుణ మతిభ్రమించి మాట్లాడుతున్నారని, సిఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి డికె. అరుణకు లేదని ఎంఎల్‌ఎ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మీడియా దృష్టిలో పడొచ్చు అన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రిని డికె.అరుణ విమర్శిస్తున్నారని ఆయన మండిపడ్డారు. అరుణ బిజెపి కార్యకర్తలే సహకరించడం లేదని, ఆమె బిజెపి కార్యకర్తలకు కూడా నచ్చడం లేదని పేర్కొన్నా రు. మరోసారి ముఖ్యమంత్రిపై విమర్శలు చేస్తే కార్యకర్తలు చూస్తు ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి వి నోద్, టిపిసిసి అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాధా అమర్, మాజీ మహి ళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బెక్కరి అనిత, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మ ణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సంక్షేమానికి పాటుపడింది కాంగ్రెస్ ప్రభుత్వాలే


సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు, ఎంపి అభ్యర్థి వంశీచంద్ రెడ్డి

జిల్లా కాంగ్రెస్ ఆదివాసీ విభాగం అధ్యక్షుడు లింగంనాయక్




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** దేశంలో గిరిజనుల సంక్షేమానికి పాటుపడింది. కాంగ్రెస్ ప్రభుత్వాలేనని సిడబ్ల్యుసి ప్రత్యేక, ఆహ్వానితులు, కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం జిల్లా కాంగ్రెస్ ఆదివాసీ విభాగం అధ్యక్షులు లింగంనాయక్ అధ్యక్షతన ఎస్‌టిసెల్ పార్లమెంటరీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ గిరిజనులను ఎస్‌టి జాబితాలో చేర్చి రిజర్వేషన్లు కల్పించింది. దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీయేనని గుర్తుచేశారు. గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వాలు అన్ని విధాల కృషి చేశాయన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి విస్మరించిందన్నారు. రాంమందిర్ విగ్రహాప్రతిష్టలో రాష్ట్రపతిని దూరం పెట్టారన్నారు. పార్లమెంట్ భవన్ ప్రారంభోత్సవంలో రాష్ట్రపతికి ఆహ్వానించకపోవడాన్ని బట్టి చూస్తే గిరిజనుల పట్ల బిజెపికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గిరిజనుల బిజెపికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ ఆదివాసీ అధ్యక్షులు లింగంనాయక్ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి విజయయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.మహబూనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో 750 గిరిజన తండాల్లో ఎన్నికలు ముగిసే వరకు యాత్ర చేపడుతామని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ ఆదివాసీ రాష్ట్ర కన్వీనర్లు గోపాల్ నాయక్, గంగ్యానాయక్ వైస్ చైర్మన్ శేఖర్ నాయక్, పట్టణ అధ్యక్షుడు రవినాయక్ మండల అధ్యక్షులు తులసిరాంనాయక్‌తో పాటు పార్లమెంట్ పరిధిలోని మండలాల అధ్యక్షులు,జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 65,500 నగదు పట్టివేత




**ప్రజాపక్షం/అడ్డాకుల :** అడ్డాకుల మండలం శాఖపూర్ టోల్ ప్లాజా వద్ద పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో 65500 నగదు పట్టుబడింది. మంత్రాలయం నుంచి కారులో హైదరాబాద వెళ్తున్న రాజశేఖర్ వద్ద సరైన ఆధారాలు లేకుండా ఉన్న నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

# రాజకీయ విమర్శలు మానుకోండి

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్

**ప్రజాపక్షం / శ్రీరంగాపురం :** పెద్దపల్లి జిల్లా రైతుల నిరసన దీక్షకు మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరై మాట్లాడిన మాటలు హస్యాస్పదంగా ఉన్నాయని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మీరే స్వయంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు సొంత నియోజకవర్గం లో శ్రీరంగాపురం రిజర్వాయర్ కింద ఉన్న సాగు ఆకాల వర్షాలకు వివిధ గ్రామా ల శివారులో గల 788 ఎకరాల వరి పంట నీట మునిగి 1054 మంది రైతులు తీవ్రంగా నష్టపోవడం జరిగిన విషయం మీకు తెలవదా, అప్పటి కలెక్టర్ పంట నష్టపరిహారం గురించి విచారణ చేపట్టండి అని ఆదేశాలు జారీ చేస్తే దాన్ని ముందుకు కదలనియకుండా చేసింది. మీరు కాదా అని ప్రశ్నించారు. అదేవిధంగా కాశీంనగర్‌కు చెందిన కొంత మంది రైతులు పంట ఎండిపోతుంటే కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ కాల్వకు మోటార్ వేస్తే తీసేయండి లేకపోతే కేసులు చేయిస్తామని బెదిరించిన విషయం వాస్తవం కాదా అని తెలియజేశారు. కేవలం రైతుబంధు పేరిట రైతులను సంతృప్తి పరుస్తూ రైతులకు తీవ్ర నష్టం మీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని ఆరోపించడం జరిగింది. రైతు రుణమాఫి చేస్తామని పేపర్ ప్రకటన చేసి రైతులతో రె న్యూవల్ పేరిట వడ్డీ వసూలు చేసి ఒక్కరికి కూడా తిరిగి రుణాలు ఇవ్వక రైతులను మోసం చేసిందని, రాజకీయ విమర్శలు చేయడం కోసం ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం ఇవ్వాలని మాట్లాడిన మీరు గతంలో జరిగిన రైతు నష్టాలను ఏవిధంగా భర్తీ చేస్తారో తెలపాలని సూచించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సీజన్‌లో వర్షాలు తక్కువ ఉన్న ఎండలు ఎక్కువై కరెంటు ఇబ్బందులు ఉన్న రైతులకు నష్టపర్చకుండా అన్ని వసతులను కల్పిస్తుందని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతుల మేలు కోసం రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని దీని ఓర్వలేకనే రాజకీయ విమర్శలు చేస్తున్నారని ఇక మీ రాజకీయ విమర్శలు మాని ప్రజా ప్రభుత్వానికి సహకరించాలని తెలిపారు.



## తాగునీటి ఎద్దటి నివారణకు నిధులు

### మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/కోహెడ:** గ్రామాలలో తాగునీటి ఎద్దడి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం సిద్దిపేట జిల్లా కోహెడలోని లక్ష్మీ గార్డెన్‌లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ వేసవికి ముందే భూగర్భ జల మట్టం పడిపోవడం జరిగిందని దీనికి బిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ వచ్చిన తర్వాత కరువు వచ్చిందని అసత్యపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన నాయకులే పదవులు అనుభవించినారు, కొత్తవారికి ఎలాంటి పదవులు దక్కవని చెప్పారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉంటాయని, ఎన్నికల తర్వాత ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామని చెప్పారు. కార్యకర్తలకు ఏ అవసరం వచ్చిన తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వందరోజుల విజయంతో దూసుకుపోదాం

### మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/అచ్చంపేట:** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో విజయ పథంతోపాటు అగ్రగామిగా ఉండేందుకు అందరూ కృషిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్ టూరిజం శాఖమంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గపు కార్యకర్తలబూత్‌లెవల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తల పడ్డ కృషి వందరోజుల క్రితం ఫలించిందని నేడు వందరోజుల్లో సాధించిన విజయాలు అందరికీ పంచినట్లు తెలిపారు. చేసిన ఆరు గ్యారెంటీలను కార్యకర్తలపల్లె ఇంటింటి ప్రచారంచేస్తే విజయం మనదేనని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రజలు కాంగ్రెస్ అభిమానులు, ప్రలోభాలకు లొంగకుండా కాంగ్రెస్ అభివృద్ధిపై ఆత్మవిశ్వాసం చూపుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవడం తమ లక్ష్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త ఒకసైనికుడిగా పనిచేసి కృషిచేయాలని అన్నారు. స్థానిక ఎంఎల్ఏ వంశీకృష్ణ మాట్లాడుతూ అట్టడుగు వర్గాలనుండి అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్‌పై మొగ్గుచూపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎంఎల్ఏ కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, మహబూబ్‌నగర్ నాయకులు ఒబెదుల్లాకొత్వాల్, కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి మల్లురవి, స్థానిక న్యాయవాది రాజేందర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కార్మికుల పనివేళలు మార్చండి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి:** సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికుల పని వేళలను వెంటనే మార్చాలని ఏఐటియుసి బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షులు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. రోజురోజుకి ఎండ తీవ్రత, ఉష్ణోగ్రత పెరుగుతుండని దీంతో కార్మికులు వడదెబ్బ తగిలి అనారోగ్యాల పాలయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఉత్పత్తి కాలం అయిపోయే నందున యాజమాన్యం వెంటనే సింగరేణి కార్మికుల పని వేళలు మార్చాలని, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 :30 వరకు కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు, కోల్ ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు విశ్రాంతి ఇవ్వాలని కోరారు. కార్మికులందరికి ఒఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని, బొగ్గు ఉత్పత్తి పై కాకుండా కార్మిక సంక్షేమంపై యాజమాన్యం దృష్టి సారించాలని అన్నారు.

## 104 సంచార ఉద్యోగుల జీతాలివ్వండి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** రాష్ట్రవ్యాప్తంగా 1350 మంది 104 ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.సోమవారం పట్టణంలోని నిర్మాణంలోని తెలంగాణ, ఏఐఎస్ఎఫ్ నాయకుల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ధనుంజయనాయుడు మాట్లాడుతూ 104 ఉద్యోగులు 20 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో అవస్థలు పడుతున్నారని. ఔట్‌సోర్సింగ్ కొలువు అప్పై చాలీచాలని జీతాలు అది కూడా ప్రతి నెల అందని జీతాలతో గత ఐదు నెలలుగా జీతాలు లేక వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామీణ ప్రాంతాలలో ఇంటి వద్దే ఆరోగ్య సేవలందించిన 104సంచార వైద్యశాలను గత ప్రభుత్వం అర్థాంతరంగా మూసివేసిందన్నారు.ఒక్కొక్క వాహనంలో ఒక డ్రైవర్, డాటా ఎంట్రీ ఆపరేటర్, సెక్యూరిటీ గార్డు పనిచేసే వారని,వీరందరిని పిహెచ్‌సీలు, యూపిహెచ్‌సీలు, డిఎంహెచ్ఓ కార్యాలయాలకు ఇతర ప్రభుత్వశాఖలకు పంపించివేశారన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం 104 ఉద్యోగుల బాధలు పట్టించుకుని తక్షణమే వారి బకాయి జీతాలు విడుదల చేయాలని ఆయన కోరారు.కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం,ఏఐఎస్ఎఫ్ నాయకులు కొమ్మరాజు వెంకట్ పాల్గొన్నారు.

## వామపక్షాల బలం తగ్గడంవల్ల మోడీ ఆటలు సాగుతున్నాయ్

### సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు సీతారాములు



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికల్లో నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న సిపిఎం అభ్యర్థుల్ని గెలిపించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ప్రజల్ని కోరారు. భువనగిరి ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థిగా ఎండి జాహంగీర్ బరిలోకి దిగడం జరిగిందన్నారు. సోమవారం జనగామ పట్టణంలోని కామాక్షి ఫంక్షన్ హాల్‌లో భువనగిరి పార్లమెంట్ జనగామ నియోజకవర్గ స్థాయి సమావేశం కామాక్షి ఫంక్షన్ హాల్‌లో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు చెరుపల్లి సీతరాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. దేశం క్లిష్ట పరిస్థితిలో ఉంది, బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తూ మతోన్మాదంతో కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందన్నారు. గత 10 ఏండ్ల కాలంలో పార్లమెంట్ నందు వామపక్షాల బలం తగ్గడం వలనే మోడీ ఆటలు సాగుతున్నాయని, అందకే వామపక్ష అభ్యర్థులను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలన్నారు. అనేక ప్రజా వ్యతిరేక బిల్లుల్ని పార్లమెంట్‌లో ఆమోదించారని, బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని సైతం మార్చాడానికి సిద్ధ పడుతుందన్నారు. రాజ్యాంగాన్ని, లౌకిక, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి ఆహాల్య, సాంబరాజు యాదగిరి, సింగారపు రమేష్, జిల్లా కమిటి సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, సుంచు విజేందర్, బొల్లంకొండ వెంకటేష్, ఓడ నరేందర్, పొత్కనూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఓడించేందుకు విద్యార్థులు సన్నద్ధం

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** తెలంగాణ విభజన హామీలను అమలు చేయలేని బిజెపిని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించడానికి విద్యార్థులు సిద్ధం కావాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ముందస్తు అడ్మిషన్లు, ప్రచారాలను నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోకుండా వారికే వత్తాసు పలుకుతున్నారని అన్నారు. కరీంనగర్ ఎంపిగా ఉన్న బండి సంజయ్ ఐదేళ్లలో పార్లమెంటు పరిధిలోని విద్యార్థి, యువకుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చాయని, ప్రస్తుత విద్యాసంవత్సరం పూర్తికాక ముందే వచ్చే విద్యాసంవత్సరం సంబంధించి అడ్మిషన్లు, ప్రచారం నిర్వహిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, అధికారుల అండదండలతోనే ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల ప్రచారం చేస్తూ లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. అధికారులు ముందస్తు అడ్మిషన్ల ప్రచారాల హోర్డింగ్‌లను తొలగించాలని, రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ విద్యార్థి, యువత బిజెపిని ఓడించడానికి సన్నద్ధం కావాలన్నారు. మోడీ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో తెలంగాణపై కక్షపూరితంగా వ్యవహరించారన్నారు. యేడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. యువ త ఓట్ల కోసం రెచ్చగొట్టి రాజకీయపబ్బం గడిపారన్నారు. మోడీ ప్రభుత్వం విద్యాకాషాయీకరణ, ప్రైవేటీకరణ, కార్పోరేటీకరణ చేస్తూ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయకపోతే విద్యావ్యవస్థ ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. తెలంగాణ బిజెపి ఎంపిలు ఒక్కరోజు సైతం విద్యార్థి, యువత హక్కుల కోసం పార్లమెంటులో గొంతు ఎత్తలేదన్నారు. కరీంనగర్ ఎంపిగా ఉన్న బండి సంజయ్ కేంద్రం నుంచి విద్యార్థి, యువకులకు తీసుకువచ్చింది ఏమీ లేదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి హటావోదేశ్‌కి బచావో అనే నినాదంతో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి విద్యార్థి లోకం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చాట్ల సమ్మయ్య, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, జిల్లా ఆఫీస్ బేరర్స్ కేశబోయిన రాము, కనకం సాగర్, విష్ణు ఉన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు తంబు విధానం రద్దు చేయాలి

### భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లా



**ప్రజాపక్షం/వేములవల్లి :** భవన నిర్మాణరంగంలో పనిచేసే కార్మికులకు వేలి ముద్ర విధానం రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వేములపల్లి మండలం తిమ్మారెడ్డి గూడెంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆన్‌లైన్ విధానంలో నిజమై న కార్మికుల చేతి గీతలు అరిగిపోయి వేలిముద్ర పడటం లేదని దాంతో సం క్షేమ బోర్డు ఫలాలు అందకుండా పోతున్నాయని అన్నారు. కనీసం ఐరిష్ ద్వారా ఆన్‌లైన్ చేసుకునే అవకాశమైనా కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభు త్వం కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని పెరుగుతు న్న ధరలను దృష్టిలో పెట్టుకొని భవననిర్మాణ కార్మికుల ఇచ్చే సంక్షేమ నిధి స హజ మరణానికి ఐదు లక్షలు, ప్రమాద మరణానికి రూ.10 లక్షలు, పెళ్లి, కానుపులకు ఇచ్చే నిధిని లక్షకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మండల ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు జిల్లా యాదయ్య, డివిజన్ నాయకులు వల్లపుదాసు వెంకన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కన్వీనర్ పుట్టల కృష్ణ,కత్తుల బిక్షం రామానుజ రెడ్డి, ఎల్ ప్రసాద్ రెడ్డి, ఎస్.కె అమీర్,బంటు నగేష్,రవి,సురేష్, శంఖర్,నాగరాజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**భవన నిర్మాణ కార్మిక సంఘం గ్రామ కమిటీ ఎన్నిక**

మండల కన్వీనర్ పుట్టల కృష్ణ అధ్యక్షతన ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు పల్లా దేవేందర్ రెడ్డి తిమ్మారెడ్డి గూడెం భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని నియమిస్తూ అధ్యక్షులుగా కత్తుల బిక్షం, ప్రధాన కార్యదర్శిగా రామానుజ రెడ్డి, కోశాధికారిగా ఎల్ ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్కె అమీర్,ఎస్.కె రహీం, సహాయ కార్యదర్శులుగా బంటు నగేష్ ,పి శ్రీనివాస్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బొగ్గు లోడ్ అన్‌లోడ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

### ఎంఎల్ఏ గండ్ర సత్యనారాయణరావు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సింగరేణి బొగ్గు లోడింగ్ అన్‌లోడింగ్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సింగరేణి లారీ లోడింగ్ అన్‌లోడింగ్ యూనియన్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బౌత్ విజయ్ కుమార్ అధ్యక్షతన 370 మంది కార్మికులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారికి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ బొగ్గు లోడ్ అన్లోడ్ కార్మికులుగా పనిచేస్తున్న మీ అందరిని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించే విధంగా చూస్తానని అన్నారు. సింగరేణి జిఎంతో మాట్లాడి కార్మికులకు హెల్త్ కార్డులు అందించే విధంగా సహాయ సహకారాలు అందిస్తానను అన్నారు. కార్మికులందరికీ పిఎఫ్ సౌకర్యం అందేలా కృషి చేస్తాను, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు చల్లూరి మధు, కాంగ్రెస్ నాయకులు బుర్ర కొమురయ్య, అప్పం కిషన్, కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, శిరూప అనిల్, కార్మిక సంఘం అధ్యక్షులు బౌత్ విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రాజబాబు. ఉపాధ్యక్షులు బిక్షపతి, క్యాషియర్ పోలవేణి రమేష్ పాల్గొన్నారు.



## రోజుకూలీ రూ. 600 ఇవ్వాలి

### బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య

### ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం విఫలం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య ఆరోపించారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చౌలపల్లి గ్రామ పంచాయతీలోని ఈరం చెరువు దగ్గర నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించడంతోపాటు కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఎండలోనే కూలీలు పనులు చేస్తున్నా వారికి తగిన సదుపాయాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించిందని, సకాలంలో కూలీలకు డబ్బులు చెల్లించడం లేదని ఆరోపించారు. ఉపాధి హామీ పథకానికి నిధుల కొరత చూపించి పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తీసివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. ఎండల వేడిమిని తట్టుకునేందుకు టెంటు, వైద్య కిట్లు, పార గడ్డపార వంటి సౌకర్యాలు ఏమి కల్పించడం లేదని మండిపడ్డారు. సొంత పనిముట్లు తీసుకువచ్చి పనులు చేయాల్సి వస్తుందని, అందుకు తగ్గట్టుగా కూలీచెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొలతలతో సంబంధం లేకుండా రోజువారి కూలీ రూ.600 ఇవ్వాలని, 200రోజులు పని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, వారంవారం కూలీ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు 55ఏళ్ళు ఉన్న వారికి రూ.5వేలు పింఛన్ సౌకర్యం కల్పించాలని, రెండు పూటలా మాస్టర్ కాకుండా ఒక్కపూటనే మాస్టర్ వేసుకోవాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించునున్నట్లు హెచ్చరించారు.



### 6 వారాలుగా వేతనాలు లేవు : అశోక్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఉపాధి హామీ కూలీలకు గత ఆరు వారాల వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామంలో ఉపాధిహామీ కూలీల పనిప్రాంతంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా గత ఆరు వారాలుగా వేతనాలు రావడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బోయిని అశోక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేయాలని కుట్ర పన్నుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శ్రీరాముల రామచంద్రం, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు దరిపెల్లి అంకుష్, సిపిఐ నాయకులు ఏడవెన సదయ్య, గట్టు రాజయ్య, శ్రీరాముల శంకర్ తదితరులున్నారు.



## పొలంబాట పేరుతో బిఆర్ఎస్ దొంగనాటకాలు

### జిల్లాకు తీరని అన్యాయం చేసింది మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

### నకిరేకల్ ఎంఎల్ఎ వేముల వీరేశం

**ప్రజాపక్షం/నల్లగొండ :** వర్షాలు రాక పంట పొలాలు ఎండిపోతున్న రైతులకు, ప్రజలకు ధైర్యం చెప్పి ప్రభుత్వానికి నిర్మాణత్మకమైన సలహాలు ఇవ్వాల్సిన మాజీ సీఎం కెసిఆర్ తెలంగాణ ఉద్యమ సమయంలో ఎలాంటి సెంటిమెంట్ ఉపయోగించి విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమయ్యావో మళ్లీ అదే సెంటిమెంట్‌ను రైతులకు చెప్పి ఆత్మహత్యలు చేసుకునేలా స్థాయి దిగజారి దొంగ మాటలు చెప్తున్నారని నకిరేకల్ ఎంఎల్ఏ వేముల వీరేశం విమర్శించారు. సినిమాట్రోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎస్ఎల్‌బిసి సొరంగ మార్గం, చర్లగూడెం, డిండి ఎత్తిపోతల, బి వెల్లెంల ప్రాజెక్టులతో పాటు పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాలువ పనులను పూర్తి చేయకుండా ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. ఒకవైపు కెసిఆర్ కూతురిని ఇడి, కుమారుడిని ఫోన్ ట్యాపింగ్ వెంటాడుతుందన్నారు. మంత్రిగా పనిచేసిన జగదీష్‌రెడ్డి జిల్లాకు ఏం చేశాడో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిసిసి అధ్యక్షులు శంకర్ నాయక్ మాట్లాడుతూ సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చాక మాజీ ఎంఎల్ఏ గాదరి కిషోర్ ఆస్తులు పెంచుకున్న విషయం జిల్లా ప్రజలకు తెలియదా అని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుమ్మల మోహన్ రెడ్డి, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జుకూరి రమేష్ , డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, నార్కట్‌పల్లి మండల పార్టీ అధ్యక్షులు ఊషయ్య , ఎల్లారెడ్డి గూడెం ఉప సర్పంచ్ వడ్డే భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.





## పార్లమెంట్ ఎన్నికలపై పోలింగ్ అధికారులకు శిక్షణ

### జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు ఇచ్చే శిక్షణ చాలా ముఖ్యమైనదని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాజేంద్రప్రసాద్ బిఇడి కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, రాజస్వ మండలాధికారి సురేష్, తహశీల్దారు దేశ్ పాండే తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు ఎన్నికల రోజున విధులను నిర్వర్తించడంపై సూచనలు, సలహాలు చేశారు. పిఓ డైరీ, 17సి పై పూర్తి అవగాహన చేసుకోవాలని తెలిపారు. పోలింగ్ రోజున అవసరమయ్యే కవర్ లో సరైన సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందే ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి వివిప్యాట్లలో ఉండే స్లిప్లను ప్రత్యేక కవర్‌లో ఉంచాలన్నారు. ఈవిఎం, వీవీప్యాట్లపై పోలింగ్ అధికారులకు పూర్తి అవగాహన కలిగిఉండాలన్నారు. పోలింగ్ అధికారులు పోలింగ్‌కి ముందురోజు, పోలింగ్ రోజు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగం కోసం ఫామ్ 12ని తప్పనిసరిగా నింపి సమర్పించాలని సూచించారు. ఎన్నికల రోజు విధుల పట్ల నిర్లక్ష్యం వహించకూడదన్నారు. పోలింగ్ అధికారి, పోలింగ్ సహాయ అధికారి ఇద్దరూ ముఖ్యమేనని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెండు దఫాలుగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే సెక్టోరల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. బూత్ ఏజెంట్ల సమక్షంలో ఈవిఎం, వీవీప్యాట్లపై సీల్ వేయాలన్నారు. వేసవికాలంలో ఎండ తీవ్రత దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, ఎన్నికల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పెంచిన టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలి

### ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శి ఆంజనేయులు, మురళీకృష్ణ

**ప్రజాపక్షం/చండూరు:** టెట్ పరీక్ష ఫీజు అధికంగా పెంచడం వలన నిరుద్యోగులపై పెనుభారం పడుతుం దని పెంచిన టెట్ పరీక్ష ఫీజును తగ్గించి నిరుద్యోగులను ఆదుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శి వల్లమల్ల ఆంజనేయులు,ముదిగొండ మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వారు మండల పరిధిలోని కొండాపురంలో మాట్లాడుతూ గతంలో ఒక పేపర్ రాస్తే రెండు వందలు ,రెండు పేపర్లు రాస్తే మూడు వందలు ఫీజు ఉండేదని కానీ ఇప్పుడు ఒక పేపర్‌కు వెయ్యి రూపాయలు,రెండు పేపర్లు రాస్తే 2వేలు రూపాయలు ఫీజు పెట్టడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశ పరీక్షల ఫీజులు తగ్గించి తక్కువ ఫీజుతో పోటీ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీలకు విరుద్ధంగా అధిక ఫీజు వసూలు చేయడం సరికాదన్నారు. నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉండాలని,పెంచిన టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు కురుపాటి పరమేష్, సంఘం నాయకులు మనోహర్, జనార్ధన్,నిఖిల్ పాల్గొన్నారు.



## ఉత్తర్వు తాత్కాలికమే

(మొదటి పేజీ తరువాయి)

మసీదు సెల్లార్ భాగంలో ప్రార్థనలుచేసుకునేందుకు అనుమతి ఇస్తూ వారణాసీ జిల్లా కోర్టు జనవరి 31వ తేదీన ఇచ్చిన ఉత్తర్వులను మసీదు కమిటీ అలహాబాద్ హైకోర్టులో సవాలు చేసింది. ఐతే ఫిబ్రవరి 26న అలహాబాద్ హైకోర్టు కూడా జిల్లా కోర్టు ఉత్తర్వులనే సమర్థిస్తూ మసీదు కమిటీ పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో మసీదు కమిటీ గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ విషయాన్ని సుప్రీం కోర్టులో సవాలు చేయగా, అక్కడ కూడా ధర్మాసనం ఉత్తర్వుల రద్దుకు తిరస్కరించింది. మసీదులో తమ మతపరమైన కార్యకలాపాలకు ఎలాంటి విఘాతం కలగకుడా చూడాలని కోరుతూ అటు హిందువులు, ఇటు ముస్లింలు కూడా వేరు వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ప్రార్థనలు చేసుకునే విధానం యథాతథంగా కొనసాగుతుందని చంద్రచూడ్ సారథ్యానగల ధర్మాసనం స్పష్టం చేసింది. జనవరి 17న ఇచ్చిన ఉత్తర్వులలో ముస్లింలు తమ నమాజు కార్యక్రమాలను నిరాటంకంగా కొనసాగించవచ్చునని ఉత్తర్వు జారీ చేయగా, 15 రోజుల తర్వాత మరో తీర్పులో హిందువులు కూడా నిరాటంకంగా నిబంధనలకు అనుగుణంగా తమ ప్రార్థనలు కొనసాగించుకోవచ్చునని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ జె.బి.పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా కూడా ఉన్నారు. ఈ సందర్భంగా గూగుల్ ఎర్త్ ద్వారా వచ్చిన చిత్రాలను సుప్రీంకోర్టు పరిశీలించింది. సెల్లార్‌కు ఉత్తరభాగంవైపు ముస్లింలు నమాజులకు వీలుగా ప్రవేశద్వారం ఉండటాన్ని, మసీదుకు దక్షిణభాగంలో హిందువులకు ప్రార్థనలు చేసుకోవడానికి వీలుగా ప్రవేశద్వారం ఉండటాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం పరిశీలించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com